
# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 130 | హైదరాబాద్ | సోమవారం 10-11-2025 | పేజీలు : 12 | వెల : 1.00

11లో

అమెరికాలో కొనసాగుతున్న సంక్షోభం.. రెండో రోజూ 1,000కి పైగా విమానాలు రద్దు

## హైదరాబాద్‌ను వణికిస్తున్న చలి..

పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

11లో





11లో

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముగిసిన ప్రచారం..

- నవంబరు 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్
- బరిలో 58 మంది అభ్యర్థులు
- ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ
- నవంబరు 14న ఓట్ల లెక్కింపు

## నేటి భారతం


- ఐదేళ్లకొకసారి బిర్యానీ ప్యాకెట్, క్వార్టర్ బాటిల్, ఒక్క వెయ్యి రూపాయలు.. నీ మొహాన పడేస్తాడు.. నీ ఓటును కొనేస్తాడు..
- అదే మహా ప్రసాదం అని భావిస్తావు నువ్వు నీ ఓటును ఒక దుర్మార్గుడికి అమ్ముకుంటావు..
- నీ ఐదేళ్ల జీవితమే కాదు.. మీ పిల్లల వందేళ్ళ జీవితాన్ని కూడా నాశనం చేస్తావు..
- ఓటేసేముందు ఒక్కసారి ఆలోచించు.. ఓటు అనేది నీకు లైసెన్సు లేని ఆయుధం..
- ఆ ఆయుధాన్ని సక్రమంగా వినియోగించుకో.. నీకు సేవ చేసే నాయకున్ని గుర్తించి ఎన్నుకో...
- నువ్వు గుడ్డిగా ఓటేస్తావు.. వాడికి పదవి వస్తుంది సంపద వస్తుంది..
- నీకు మాత్రం కష్టాలు కన్నీళ్లు మాత్రమే మిగులుతాయి..
- ఈ వాస్తవాన్ని అర్థం చేసుకో నీ జీవితాన్ని అర్థవంతం చేసుకో...

– బోయినపల్లి రమణా రావు, సీనియర్ జర్నలిస్ట్..

## పోస్టల్ సేవలు ఇక మరింత సులభం

వచ్చేసింది 'డాక్ సేవా' యాప్

11లో




- తపాలా శాఖ నుంచి కొత్త 'డాక్ సేవా' యాప్
- పాత 'పోస్ట్ ఇన్ఫో' యాప్ స్థానంలో నూతన యాప్
- ఒకే యాప్‌లో 8 రకాల ముఖ్యమైన సేవలు
- స్పీడ్ పోస్ట్, పార్శిల్ ట్రాకింగ్ ఇక చాలా సులభం
- పోస్టేజ్, ఇన్సూరెన్స్ ప్రీమియంల లెక్కింపు సౌకర్యం
- గూగుల్, ఆపిల్ స్టోర్లలో ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు

## జపాన్ లో భారీ భూకంపం... సునామీ హెచ్చరికలు జారీ

11లో

## 5 రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ బ్యూరో మెగా ఆపరేషన్...

11లో



## అభివృద్ధి కోసం చంద్రబాబు, వైఎస్ విధానాలను ఫాలో అవుతున్నాం

- ఐటీ, ఫార్మా రంగాలను వారు ప్రోత్సహించారన్న ముఖ్యమంత్రి
- ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు
- ఐటీ రంగానికి పునాది వేసిన నేత నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి



11లో



## ఒక సంకల్పం నుంచి సంక్షోభం వరకు..

- నీరుగారిపోయిన డబల్ బెడ్ రూమ్ పథకం..
- వందల కోట్ల ప్రజాధనం వృధాగా మిగిలిపోయిన దౌర్భాగ్యం..
- గత ప్రభుత్వంలో ఎందుకు పనికిరాని చోట నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లు..

12లో



ఒక అద్భుతమైన సంకల్పంతో అప్పటి కెసిఆర్ ప్రభుత్వం నిరుపేదలకు ఒక గూడును అందించాలనే మంచి ఉద్దేశంతో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకాన్ని తీసుకొని వచ్చింది.. తీసుకుని రావటమే కాకుండా త్వరితగతిన నిర్మాణాలను చేపట్టింది.. నిర్మాణాలు పూర్తయ్యాక కొంతమంది లబ్దిదారులకు కేటాయించడం కూడా జరిగింది.. కానీ ఎన్నో వందల ఇండ్లు ఇంకా పంపిణీ కాకుండా అలాగే ఉండిపోయాయి.. మరి ఎందుకు ఆ ఇండ్లను కేటాయించలేదు ఇప్పటివరకు తెలియని పరిస్థితి నెలకొంది.. ఇదే విషయమై అప్పటి ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వ్యవహారంపై విమర్శలు గుప్పించింది.. కానీ దురదృష్టం ఏమిటంటే ఇప్పుడు రేవంత్ రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలో ఉంది అప్పుడు విమర్శలు గుర్తించిన రేవంత్ రెడ్డి కూడా డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో కేసీఆర్ కంటే మూర్ఖంగా వ్యవహరిస్తున్నాడని విమర్శకులు మండిపడుతున్నారు.. కొన్ని వందల ఇండ్లు ఎందుకు పనికిరాకుండా అలాగే ఉండిపోయాయి.. ఆ ఇండ్లను పేదలకు ఎందుకు పంచడం లేదు.. కెసిఆర్ ప్రభుత్వంలో నిర్మించిన ఇండ్లను పాము ఎందుకు పంపిణీ చేయాలి అని రేవంత్ ప్రభుత్వం ఆలోచిస్తుందా..? క్రెడిట్ అంతా కేసీఆర్ ఖాతాలోకి వెళ్తుందని భావిస్తున్నారా..? ఇది ఎంత మాత్రం వాంఛనీయం కాదు.. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే హక్కు ఈ ప్రభుత్వాలకు ఎవరు కల్పించారు..? మీ ఈగోలను పక్కనపెట్టి ఒక్కసారి ప్రజల గురించి ఆలోచించమని సూచిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "

## కోటి దీపోత్సవానికి రాష్ట్ర పండుగ హోదా: రేవంత్‌రెడ్డి





11లో

- వచ్చే ఏడాది నుంచి అధికారికంగా ఉత్సవాల నిర్వహణ
- జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని వెల్లడి
- ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న కార్యక్రమంలో సతీసమేతంగా పాల్గొన్న సీఎం
- పుట్టినరోజు వేడుకలను భక్తుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్న రేవంత్


# ఏఐ.. వరమా? శాపమా

ప్రస్తుతం ప్రపంచాన్ని శాసించే దిశగా పయనిస్తున్న అత్యాధునిక సాంకేతికత కృత్రిమ మేధ (ఏఐ) యుగంలో జీవిస్తున్నాం. ఈ మధ్యకాలంలో విడుదలవుతున్న దాదాపు ప్రతి సాధనం (సాఫ్ట్‌వేర్) ఏఐ వెర్షన్‌ను అందిస్తూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఒక సర్వే ప్రకారం, ప్రతి ఇద్దరు భారతీయుల్లో ఒకరు ఏదో ఒక రూపంలో ఏఐ సాంకేతికతను ఉపయోగిస్తున్నారట! ఒక్క ఏఐ అనే కాదు ఏ సాంకేతికత అయినాసరే దాన్ని'మానవాళికి వరం' అంటూ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు! అయితే, ప్రతివ్యక్తికీ మోసగించే ప్రవృత్తి కూడా ఒకటి ఉంటుందని మరోపక్క శాస్త్రాలు హెచ్చరిస్తున్నాయి! ఇలాంటి పరిస్థితుల్లో, మనం ఏఐని సంపూర్ణంగా విశ్వసించగలమా?భగవద్గీత ప్రకారం, ప్రతీ ఆవిష్కరణ భగవంతుడు ప్రేరేపించిన బుద్ధితో ప్రకృతిలో సూక్ష్మ నియమాలను కనుగొనడం ద్వారా లభిస్తుంది. ప్రతి సాంకేతిక ఆవిష్కరణ ఒక కత్తితో పోల్చదగినది. ఒక వైద్యుడు కత్తిని ఉపయోగించి ఆపరేషన్ చేసి వ్యక్తి ప్రాణాలను కాపాడగలడు. ఒక దుర్మార్గుడు అదే కత్తిని మరోవ్యక్తి ప్రాణాలను తీసేందుకూ ఉపయోగించగలడు. కాబట్టి, ఇక్కడ ప్రశ్న కత్తి మంచిదా, చెడ్డదా అని కాదు. దాన్ని ఎలా ఉపయోగిస్తారన్నదే అసలు విషయం. అదే విధంగా, ఏఐ సాంకేతికత స్వతహాగా మంచిదికానీ చెడ్డదికానీ కాదు. దాన్ని ఎలా ఉపయోగిస్తారన్నదే ముఖ్యం. ప్రపంచంపై ఆధిపత్యం చెలాయించేందుకా, లేదా ధనికులుగా మారేందుకా! భగవత్ సంబంధితమైన సాంస్కృతిక విలువలను ప్రోత్సహించి సమాజంలో మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సును పెంపొందించేందుకా?కృత్రిమ మేధస్సు (ఏఐ), అణుశక్తి, ఇతర శక్తిమంతమైన సాంకేతికత ఏదైనా సరే, దానిని కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే కలిగే దుష్పరిణామాలను గురించి హరేకృష్ణ ఉద్యమ సంస్థాపక ఆచార్యులైన శ్రీల ప్రభుపాదుల వారు తమ భగవద్గీత భాష్యంలో స్పష్టంగా హెచ్చరించారు. భౌతిక ప్రపంచంలో సాధ్యమైనంత వరకు సుఖం అనుభవించాలని ప్రయత్నిస్తూ, ఇంద్రియ సుఖాల కోసం ఏదో ఒక కొత్త దాన్ని కనిపెట్టడంలోనే వాళ్లు ఎల్లప్పుడూ నిమగ్నులై ఉంటారు. అలాంటి భౌతిక పరిశోధన ఫలితాలు మానవ నాగరికత పురోభివృద్ధిగా పరిగణించినప్పటికీ, ప్రజలు రోజురోజుకూ హింసాప్రాయులుగా, క్రూరులుగా తయారవుతున్నారు. జంతువుల పట్ల, సాటి మనుషుల పట్ల హింసా ప్రవృత్తిని పెంచుకుంటున్నారు. తోటి జీవులతో ఎలా మెలగాలో వారికి తెలియడం లేదు. తమ పరిశోధనల ద్వారా అందరికీ వినాశనాన్ని చేకూర్చే వస్తువులను కనిపెట్టే వాళ్లు ప్రపంచానికి శత్రువులుగా పరిగణన పొందుతారు.మనిషి పుటింది మొదలు గిట్టే వరకు సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తూనే ఉంటుంది. మనిషి తన మేధస్సుకు, మనుగడకు ఎదురయ్యే ప్రతి సమస్యలను, సవాళ్ళను అధిగమించి ఎప్పటికప్పుడు వాటిని అవకాశాలుగా మార్చుకుంటూనే వస్తున్నాడు. తాజాగా కృత్రిమ మేధస్సు (ఏఐ) మానవునికి సవాల్‌గా మారుతుందా అన్నది ఆలోచించాల్సిన అంశం.తన శారీరక శ్రమను తగ్గించుకోవడానికి అనేక రంగాల్లో పరిశోధనలు చేసి వాటికి పరిష్కార మార్గాలు కనుగొన్నాడు. ఇప్పుడు ప్రపంచాన్ని ఊపేస్తున్న ఏఐ కూడా మానవ సృష్టే అన్న విషయం మరువొద్దు. తన సౌలభ్యం కోసం సృష్టించిన ఏఐ ఇవాళ సొంతంగా ఆలోచిస్తూ నిర్ణయాలు తీసుకోవడమే కాదు అత్యంత వేగంగా, దోషరహితంగా పనిచేస్తుంది. మరి ఏఐ వరమా? శాపమా అన్న విషయాన్ని గమనిస్తే.. ఏఐ వచ్చి న తర్వాత సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగుల లేఆఫ్స్ పెరిగిపోతున్న వార్తలు తరచూ చూస్తూనే ఉన్నాం. నిజానికి ఏఐ రావడం వల్లనే ఉద్యోగాలు ఉడిపోతున్నాయనేది కేవలం అపోహ మా త్రమే.ఎందుకంటే ఏఐను సృష్టించింది మానవుడే. దానిని నియంత్రించే శక్తి కానీ, మెరుగుపరిచే సాంకేతికత కానీ మానవుడికే ఉంటుంది తప్ప ఏఐ తనంతట తానుగా అప్‌గ్రేడ్ చేసుకోలేదు. ఏఐ అప్‌గ్రేడ్ కోసం మళ్లీ మానవుడి తెలివితేటలే అవసరం అన్న విషయాన్ని గ్రహించండి. ఏఐ ఎప్పుడూ మనిషికి సేవకుడే కానీ పోటీదారుడు ఎంతమాత్రం కాదు. ఏఐను దాటడానికి పరిష్కార మార్గాలు కూడా మన చేతుల్లోనే ఉన్నాయి.నైపుణ్యాలు పెంచుకోవడం, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ కోర్సులతో ఏఐపై పట్టు పెంచుకోవడం చేయాలి. ఏఐ మనిషిలా ఆలోచిస్తుంది, కానీ మనిషిని మంచి సృజనాత్మకతను చేయలేదు. కళ, సాహిత్యం, సంగీతం, డిజైన్ రంగాలు ఎప్పటికీ సురక్షితమే. మానవుని భా వాలు, ఊహలు ఏఐకి ఎప్పటికీ రావు. మారుతున్న సాంకేతిక యుగంలో ఏఐ తదనంతరం కూడా కొత్త టెక్నాలజీ పుట్టుకొస్తూనే ఉంటుంది. వాటిని సృష్టించేది కూడా మానవుడే అనేది సత్యం. ఏఐ నిర్వహణ, ఏఐ ఎథిక్స్, ఏఐ భద్రత, గ్రీన్ టెక్నాలజీ, సస్టైయినబుల్ డెవలప్‌మెంట్ రంగాలు భవిష్యత్తులో మరింత విస్తరించనున్నాయి.నిరుద్యోగాన్ని తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలి. ప్రతీ మార్పు కొత్త అవకాశం కోసమే అన్నది గుర్తుంచుకోవాలి. కొన్ని దశాబ్దాల కిందట అనేక నూతన యంత్రాలు, కంప్యూటర్ పరికరాలు వచ్చినప్పుడు కూడా కార్మికులు, ఉద్యోగులు ఇదే విధంగా భయపడ్డారు. కానీ ఎన్ని యంత్రాలు, పరికరాలు తయారైనా వాటిని ఆపరేట్ చేయాల్సింది మనుషులే. ఎందుకంటే వాటంతట అవి ఆపరేట్ చేసుకోగలిగే శక్తి ఉన్నా ఎంత మోతాదులో కావాలన్నది నిర్ణయించాల్సింది మనమే అన్న విషయం తెలుసుకోవాలి. మానవుని కోరికలు, అభిరుచులు అనంతం.వాటిని తీర్చుకోవడానికి మానవుడు ఎప్పటికప్పుడూ తన సృజనాత్మకతకు పదును పెడుతూనే ఉన్నాడు. ఇప్పు డు వచ్చిన ఏఐ విషయంలోనూ అదే జరుగుతుంది. ఏఐ పట్ల భయం, నిరుత్సాహం, నిస్తేజం అనవసరం. మానవుని ఆలోచనలు, అభిరుచులకు తగ్గట్లుగా మారే ఆలోచనా విధానం ఏఐలో లేవు. ఏఐ మానవ చరిత్రను మారుస్తుంది. కానీ మానవుడు దాని సృష్టికర్త అని మరువద్దు. ఏఐని ఉపయోగించి సమాజాన్ని మెరుగుపరచాలి. అలాగే ఏఐ యుగం ఎప్పటికీ మానవుని విజయమే.

# వైసీపీ గూటికే విజయిసాయి...

నెల్లూరు, నవంబర్ 09(భారత శక్తి):

విజయసాయిరెడ్డి యూటర్న్ తీసుకున్నారా? జగన్మోహన్ రెడ్డికి దగ్గర అవుతున్నారా? లిక్కర్ స్కామ్ కేసులో సాక్షులుగా ఉన్న ఆయన అల్లుడు పిటిషన్ వేయడం ఏంటి? వాంగ్మూలం వెనక్కి తీసుకోవాలని కోరడం ఏంటి? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. విజయసాయిరెడ్డి వ్యవహారంలో రెండు పరిణామాలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. విశాఖ బీచ్ ను విధ్వంసం చేశారని ఆయన కుమార్తె కంపెనీ పై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జీవీఎంసీ కి నష్టపరిహారం చెల్లించాలని ఆదేశాలు ఇచ్చింది. అదే సమయంలో లిక్కర్ స్కాం కేసులో సాక్షులుగా ఉన్న రోహిత్ రెడ్డి, శరత్ చంద్రారెడ్డి ప్రత్యేక దర్యాప్తు బృందానికి ఇచ్చిన వాంగ్మూలాలను వెనక్కి తీసుకోవాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.కొన్ని నెలల కిందట విజయసాయిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. అయితే ఆయన వ్యవసాయం చేసుకుంటానని చెప్పుకొచ్చారు. కానీ అనూహ్యంగా లిక్కర్ స్కాం కేసులు అనధికారిక అప్రూవర్ గా మారారు. ఆయన ఇచ్చిన సమాచారంతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేసుల నమోదు, అరెస్టులు జరిగాయని అంతా భావించారు. కానీ ఇటీవల విజయసాయిరెడ్డి ఫుల్ సైలెంట్ అయ్యారు. కనీసం ఎక్కడ ఉన్నారో కూడా తెలియడం లేదు. గతంలో విజయసాయి రెడ్డి అల్లుడు రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు శరత్ చంద్రారెడ్డి లిక్కర్ స్కామ్ దర్యాప్తు చేస్తున్న సిట్ కు వాంగ్మూలం ఇచ్చారు. తమ కంపెనీల ద్వారా లిక్కర్ స్కాం నగదును చలామణి చేశారని.. అందులో రూపాయి కూడా తాము సంపాదించలేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఆ వాంగ్మూలాన్ని వెనక్కి ఇప్పించాలని కోర్టులో వారు పిటిషన్ దాఖలు చేయడం మాత్రం సంచలనంగా మారింది. దీని వెనుక విజయసాయిరెడ్డి ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.కచ్చితంగా కేసులకు భయపడి విజయసాయిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారని సాక్షాత్ జగన్మోహన్ రెడ్డి చెప్పుకొచ్చారు. వైసీపీ శ్రేణులు సైతం ఇదే విషయాన్ని చెప్పుకుంటూ వస్తున్నాయి. ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి అసలు సూత్రధారుడు అన్న విజయసాయిరెడ్డి.. అవసరమైతే ప్రత్యేక దర్యాప్తు బృందానికి అన్ని వివరాలు సమర్పిస్తానని చెప్పుకొచ్చారు. మొత్తం విజయసాయిరెడ్డి ఇచ్చిన వివరాలతోనే ఇప్పటి వరకు అరెస్టులు జరుగుతున్నాయని అంతా



భావించారు. అయితే ఇప్పుడు ఆయన అల్లుళ్ల ఇద్దరు పిటిషన్లు దాఖలు చేయడంతో.. విజయసాయిరెడ్డి అడ్డం తిరిగారు అన్న టాక్ వినిపిస్తోందివిజయసాయిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో తిరిగి చేరతారని ప్రచారం సాగింది. ఆయనకు ఇప్పుడు ఆప్షన్ లేదు. జగన్మోహన్ రెడ్డికి గత్యంతరం లేదు. జగన్ పక్కన విజయసాయిరెడ్డి ఉండడంతో చాలా రకాల పనులు ఇట్టే జరిగిపోయేవి. ఢిల్లీ స్థాయిలో చాలా పనులను చక్కదిద్దే వారు విజయసాయిరెడ్డి. కానీ జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పేరు మోసిన బిగ్ హాండ్స్ కలిసి రావడం లేదు. ఇటువంటి తరుణంలో విజయసాయిరెడ్డి తో రాజీ చేసుకుంటే మంచిదన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఏ కేసులకు భయపడి వైసీపీ నుంచి బయటకు వచ్చారో.. అది నెరవేరడం లేదు. అందుకే విజయసాయిరెడ్డి నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# నిమ్మకాయలకు మళ్లీ ఆశలు

రాజమండ్రి,నవంబర్ 09(భారత శక్తి):

టీడీపీలో సీనియర్ నేత నిమ్మకాయల చినరాజప్ప తిరిగి యాక్టివ్ అయ్యే అవకాశాలు కనిపిస్తుంది. ఆయనకు మంత్రి వర్గ విస్తరణలో అవకాశం లభిస్తుందన్న అంచనాల్లో నిమ్మకాయల అనుచరులున్నారు. దశాబ్దకాలం నుంచి టీడీపీనే నమ్ముకుని ఉన్న నిమ్మకాయల చినరాజప్ప 2014 ఎన్నికల్లో పెద్దాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి చంద్రబాబు మంత్రివర్గంలో చేరారు. అప్పట్లో హోంమంత్రి బాధ్యతను చేపట్టారు. అంతేకాదు ఉప ముఖ్యమంత్రి పదవి కూడా లభించింది. చంద్రబాబుకు, లోకేశ్ కు అత్యంత సన్నిహితుడైన, నమ్మకమైన నేతగా ఆయన పేరు తెచ్చుకున్నారు. పెద్దాపురం నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ విజయం సాధించిన ఆయనకు ఈసారి మంత్రిపదవి దక్కలేదు కేవలం సామాజిక వర్గాల సమతూకంలో భాగంగానే నిమ్మకాయల చినరాజప్పకు మంత్రిపదవి దక్కలేదు. అయితే వచ్చే ఏడాదిలో మంత్రి వర్గ విస్తరణ జరగనుందన్న సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఈసారి ఖచ్చితంగా నిమ్మకాయల చినరాజప్పకు మంత్రి పదవి దక్కుతుందన్న ఆశలో ఉన్నారు. ప్రస్తుతం ఉన్న కాపు సామాజికవర్గం మంత్రుల్లో నుంచి తప్పించిన వారి స్థానంలో రాజప్పకు అవకాశం దక్కుతుందని అంటున్నారు. తూర్పు గోదావరి జిల్లా కావడం ఒకింత మంత్రిపదవికి ఇబ్బందికరంగా మారుతుందంటున్న వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి. జనసేనకు చెందిన ఇద్దరు మంత్రులు ఉండటంతో మరో కాపు సామాజిక వర్గానికి చెందిన వారికి ఎలా అప్పగిస్తారన్న ప్రశ్న కూడా కలుగుతుంది. కానీ పెద్దాపురం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నిమ్మకాయల చినరాజప్ప మాత్రం ఆశలు



వదులుకోకుండా తన వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. తూర్పు గోదావరి జిల్లాలో తానే పార్టీలో సీనియర్ కావడంతో పాటు పార్టీని నమ్ముకుని ఉండటం కూడా తనకు కలసి వస్తుందని నమ్ముతున్నారు. కానీ సామాజికవర్గం కోణంలో చూస్తే మాత్రం కూటమి ప్రభుత్వంలో ఆయనకు మంత్రి పదవి దక్కే అవకాశాలు చాలా తక్కువేనని అంటున్నారు. ఈ టర్మ్ లో మంత్రి పదవి రాకపోతే వచ్చే ఎన్నికలకు తాను శాసనసభకు పోటీ చేయకుండా పార్టీ నామినేటెడ్ పదవి అంటే రాజ్యసభకు వెళ్లాలన్న యోచనలో కూడానిమ్మకాయల చినరాజప్ప ఉన్నట్లు తెలిసింది. మొత్తం మీద ఒక ప్రయత్నం చేస్తే పోయేదేముంది అన్న రీతిలో ఆయన తన వంతుగా ప్రయత్నాలు చేస్తున్నారట.

## అభివృద్ధిపైనే ఆశలు

విజయవాడ,నవంబర్ 09(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధిపైనే ఫోకస్ పెట్టారు. విడిపోయి నష్టపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలని ఏడు పదులు దాటిన వయసులోనూ చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలను ఎవరూ కాదనలేరు. పెట్టుబడుల కోసం ఒక ముఖ్యమంత్రి కాలికి బలపం కట్టుకుని విదేశాల చుట్టూ తిరగడం ఒక్క చంద్రబాబు విషయంలోనే చూస్తున్నాం. ఆయన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి తనకంటూ రాజకీయాల్లో ఒక మార్క్ ను క్రియేట్ చేసుకోవాలని పడుతున్న తపన స్పష్టంగా కనపడుతుంది. అందుకే వయసును, అలసటను లెక్క చేయకుండా ఆయన పనిచేస్తున్నారు. అయితే కార్యకర్తలు మాత్రం చంద్రబాబు పనితీరుపై కొంత అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు నాయుడు గతంలో జరిగిన పొరపాట్లను కూడా గుర్తించడం లేదని కార్యకర్తలే సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. కేవలం అభివృద్ధి సంక్షేమం తమను మరొకసారి అధికారంలోకి తెస్తుందన్న నమ్మకంతో చంద్రబాబు ఉన్నారు. కానీ టీడీపీ కార్యకర్తలు మాత్రం అందుకు విరుద్ధంగా సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పోస్ట్ చేస్తుండటం పార్టీలో చర్చనీయాంశమైంది. 1999లో రెండోసారి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సైబరాబాద్ ను అభివృద్ధిని చేసినప్పటికీ 2004 ఎన్నికల్లో దాని చుట్టు పక్కల పరిధిలో ఉన్న యాభై శాసనసభ నియోజకవర్గాల్లో రాజేంద్ర నగర్ నియోజకవర్గం మినహా మరే చోట టీడీపీ గెలవలేకపోవడాన్ని ఈ సందర్భంగా కార్యకర్తలు గుర్తు చేస్తున్నా 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మరోసారి అమరావతితో పాటు అనంతపురంలో కియా పరిశ్రమను తెచ్చారని, కానీ అమరావతి చుట్టు పక్కలతో పాటు, అనంతపురంలో కియా పరిశ్రమను ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ పార్టీ పూర్తిగా 2019 ఎన్నికల్లో చతికలపడటానానికి గల కారణాలను కూడా గుర్తుంచుకోవాలని మరికొందరు కోరుతున్నారు.

# జంతువుల కొవ్వుతో నెయ్యి...

కాకినాడ,నవంబర్ 09(భారత శక్తి):

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో కల్తీ నెయ్యి దందా కలకలం రేపుతోంది. పిఠాపురం కేంద్రంగా జంతువుల కొవ్వుతో నెయ్యి తయారు



చేస్తున్నారని అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు తనిఖీలు చేసి కొవ్వును గుర్తించారు. అనంతరం నమూనాలు.. ఆహార నియంత్రణ విభాగానికి పంపించారు. అయితే జంతు కొవ్వు కలిసిన ఈ కల్తీ నెయ్యి వల్ల ఆరోగ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.నెయ్యిని చాలా మంది ఇష్టంగా తింటుంటారు. వేడి వేడి అన్నంలో పచ్చడి కలుపుకుని.. కాస్తా నెయ్యి వేసి తింటే అద్భుతమే! వంటల్లో మంచి ఫ్లేవర్, టేస్ట్ రావడానికి కూడా నెయ్యి విరివిగా ఉపయోగిస్తుంటారు. అయితే ప్రజల అవసరాన్ని కొందరు క్యాష్ చేసుకుంటున్నారు. కల్తీ నెయ్యి తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. తాజాగా ఈ ఘటన ఆంధ్రప్రదేశ్‌లో వెలుగు చూసింది. ఏకంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్య వహిస్తున్న పిఠాపురం కేంద్రంగా అక్రమ నెయ్యి దందా సాగుతున్నట్లు అనేక ఫిర్యాదులు వస్తున్నాయి.

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేగా ఎన్నికైన పిఠాపురంలో జంతు కొవ్వుతో నెయ్యి తయారు చేస్తున్నారని ఫిర్యాదుల అనేక ఫిర్యాదులు వచ్చాయి. దీంతో అధికారులు రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టారు. అయితే తనిఖీల్లో జంతువుల కొవ్వును గుర్తించడం కలకలం రేపుతోంది. బుధవారం (నవంబర్ 5న) అర్ధరాత్రి పిఠాపురం పట్టణంలోని అన్నపూర్ణా థియేటర్ వెనుక.. మాధవనగర్‌లోని ఓ ఇంట్లో జంతు కొవ్వు నిల్వలను హిందూ సంఘాలు గుర్తించాయి. అనంతరం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆ ఇంటిని సీజ్ చేశారు. గురువారం సాయంత్రం ఎస్సై మణికుమార్, ఆర్ఐ వెంకటేష్, పారిశుధ్య అధికారి ప్రభాకర్ కల్తీ నెయ్యి తయారు చేస్తున్న ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఆ ప్రదేశంలో 12 డబ్బాల కొవ్వు, నెయ్యి ఉన్నట్లు గుర్తించారు. నమూనాలు సేకరించి ఆహార నియంత్రణ విభాగానికి పంపించారు. మిగిలిన జంతు కొవ్వును పారిశుధ్య కార్మికులతో.. భూమిలో పూడ్చేస్తామని పోలీసులు తెలిపారు. ఈ విషయంపై భవన యజమాని మణికంఠపై కేసు నమోదు చేశామని పోలీసులు వెల్లడించారుకేంద్రంగా గత కొంత కాలంగా కల్తీ నెయ్యి తయారవుతోందని విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు దువ్వా వెంకటేశ్వరరావు ఆరోపించారు. పిఠాపురం నియోజకవర్గంలో కల్తీ నెయ్యి తయారు చేసే స్థావరాలు పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువుల కొవ్వు, కల్తీ నెయ్యి గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా ఈ కల్తీ నెయ్యిని ఆలయాలకు సరఫరా చేస్తున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.కల్తీ నెయ్యిలో అనారోగ్యకరమైన జంతు కొవ్వులు, నూనెలు కలిస్తే అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి పెరిగి గుండె జబ్బులు వచ్చే ప్రమాదముంది. ఇలాంటి నెయ్యి తినడం వల్ల అజీర్తి, కడుపు ఉబ్బరం, కడుపు నొప్పి, వికారం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. కల్తీ నెయ్యి వల్ల అలర్జీలు కూడా వచ్చే ప్రమాదముంది. వీటిలో పోషకాలు ఉండకపోవడానికి తోడు.. శ్వాసకోస సంబంధిత వ్యాధులు తెచ్చి పెడతాయట. చర్మ వ్యాధులు, రోగనిరోధక శక్తి తగ్గడం, ఎముకలపై కూడా ప్రభావం చూపిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

# కొలికపూడి తగ్గట్లే...



విజయవాడ,ననవంబర్ 09(భారత శక్తి):

తెలుగుదేశంపార్టీలో ఇటీవల విభేదాలు వీధిన పడుతున్నాయి. వాటిని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తోంది నాయకత్వం. నిన్ననే టిడిపి క్రమశిక్షణ కమిటీ ఎదుటకు వచ్చారు విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు. కొద్ది రోజుల కిందట ఈ ఇద్దరి మధ్య మాటల యుద్ధం నడిచిన సంగతి తెలిసిందే. దీనిపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ నేపథ్యంలో టిడిపి క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరయ్యారు. వేర్వేరుగా హాజరై వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే ఇది జరిగిన తరువాత కూడా ఓ పరిణామం టిడిపి నాయకత్వానికి షాక్ ఇచ్చింది. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఓ కార్యక్రమంలో ఎంపీ కేసినేని చిన్నిని విస్మరించడం వివాదం కొనసాగుతుందే తప్ప.. ఫుల్ స్టాప్ పడలేదని అర్థం అవుతుంది.విజయవాడ ( ఎంపీగా గెలిచారు కేసినేని చిన్ని. అదే సమయంలో తిరువూరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు కొలికపుడి శ్రీనివాసరావు. టిడిపిలో నెలకొన్న పరిణామాలతో ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు కేసినేని నాని. ఆయనకు ప్రత్యామ్నాయంగా ఆయన సోదరుడు చిన్నిని ప్రోత్సహించింది టిడిపి నాయకత్వం. నాని వైసీపీలో చేరి ఆ పార్టీ ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగారు. చిన్ని టిడిపి అభ్యర్థిగా పోటీ చేశారు. తన పార్లమెంట్ స్థానం పరిధిలోని తిరువూరు టిక్కెట్టు కొలికపూడి శ్రీనివాసరావుకు ఇవ్వాలని సిఫారసు చేశారు. ఇద్దరూ గెలిచారు. కానీ తరచూ తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు వివాదాస్పదంగా మారారు. సొంత పార్టీ శ్రేణులు సైతం ఆయనను వ్యతిరేకిస్తూ హై కమాండ్కు ఫిర్యాదు చేశాయి. ఈ తరుణంలో తిరువూరు సమన్వయ బాధ్యతలను కేసినేని చిన్నికి అప్పగించింది టిడిపి నాయకత్వం. అయితే తనను విస్మరించి మాజీమంత్రి జవహర్ ను తెరపైకి తెచ్చారని చిన్ని పై అనుమానం పెంచుకున్నారు శ్రీనివాసరావు. అప్పటినుంచి వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే కేవలం అక్కడ సమన్వయ బాధ్యతలను అప్పగిస్తే.. మరింత జఠిలం చేశారని ఎంపీ చిన్ని పై టిడిపి నాయకత్వం ఆగ్రహంగా ఉంది.కొద్ది రోజుల కిందట ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సంచలన ఆరోపణలు చేశారు. అసెంబ్లీ టికెట్ కోసం ఎంపీ చిన్ని తన వద్ద ఐదు కోట్లు డిమాండ్ చేశారని సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అది మొదలు రచ్చ ప్రారంభం అయింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో ఆ ఇద్దరూ టిడిపి క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరయ్యారు. కొలికపూడికి ఇదే లాస్ట్ ఛాన్స్ అని ప్రచారం నడిచింది. అయితే క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరైన శ్రీనివాసరావు చంద్రబాబు పట్ల గౌరవ భావాన్ని ప్రకటించారు. ఆయన ఆదేశాల మేరకు నడుచుకుంటానని చెప్పుకొచ్చారు. దీంతో ఈ వివాదం ముగిసిందని అంతా భావించారు. కానీ లోకేష్ ఆదేశాల మేరకు ప్రజాదర్బార్ నిర్వహించారు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు ప్రజా దర్బార్ నిర్వహించకపోవడంపై లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ తరుణంలో తిరువూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు ప్రజా దర్బార్ నిర్వహించారు. కానీ అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎంపీ కేశినేని చిన్ని ఫోటో లేదు. దీంతో ఎంపీ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే కొలికపూడి సంకేతాలు ఇచ్చినట్లు అయింది.

# మంత్రుల వ్యవహారశైలిపై అసంతృప్తి

గుంటూరు, నవంబర్ 09(భారత శక్తి):

ఏపీ క్యాబినెట్ మీటింగ్ జరిగే సమయాల్లో మంత్రుల పనితీరుపై సీఎం చంద్రబాబు తరచూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు వారి శాఖపై ఏమాత్రం పట్టు సాధించలేని పరిస్థితి నెలకొందని.. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ వథకాల్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడంలోను?ప్రతిపక్షం నుంచి వచ్చే విమర్శలను గట్టిగా తిప్పికొట్టడంలోను మంత్రుల ఇన్వాల్‌మెంట్ సరిగా ఉండడంలేదనే భావనలో సీఎం ఉన్నారనే గుసగసలు వినిపిస్తున్నాయి. అటు పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా మంత్రులు



పాల్గొనలేకపోతున్నారనే చర్చ పార్టీ నేతల్లో ఉందట. నగం మంది మంత్రులు హైదరాబాద్, వైజాగ్, బెంగళూరులకు షటిల్ సర్వీస్ చేస్తున్నారనే విమర్శలున్నాయట. క్యాబినెట్ భేటీలో మంత్రుల తీరుపై చర్చ:. గత ఆరు నెలల కాలంలో వైసీపీ అధ్యక్షుడు జగన్ రాష్ట్రంలో అక్కడక్కడా పర్యటనలు చేస్తూ.. ప్రభుత్వం పై సంబంధింత శాఖల మంత్రుల పై ఆరోపణలు చేస్తున్నారు. అయినప్పటికీ ఆ శాఖలకు సంబంధించిన మంత్రులు గాని.. మిగిలిన వారు కానీ వైసీపీ నేతల నుంచి, జగన్ చేస్తున్న విమర్శలకు కౌంటర్ ఇవ్వడంలో విఫమలవుతున్నారనే చర్చ టీడీపీలో నడుస్తోందట. ఈ విషయమై ప్రతి క్యాబినెట్ భేటీలోను మంత్రుల తీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు.. ప్రజలను అయోమయానికి గురి చేస్తున్న వైసీపీ అధ్యక్షుడు:. వైసీపీ అధ్యక్షుడు జగన్ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని, వాస్తవాలు ప్రజలకు చెప్పటంలో మంత్రులు వైఫల్యం చెందుతున్నారని చంద్రబాబు అసంతృ వ్యక్తం చేస్తూనే ఉన్నారట. చంద్రబాబు ఎన్నిసార్లు అసంతృప్తి వ్యక్తం చేసినా నేతల తీరులో మాత్రం మార్పు రావడం లేదట. తాజాగా మంత్రుల పై లోకేష్ సైతం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం పార్టీ నుంచి కానీ, మంత్రుల నుంచి కానీ గట్టి కౌంటర్ ఎందుకు ఇవ్వలేకపోయారని అడిగినట్లు టాక్ వినిపిస్తోంది. గ్రీవెన్స్‌సెల్‌ను పట్టించుకోవడం లేదని లోకేష్ ఆగ్రహం:. ప్రతిపక్షంగా వైసీపీ చేస్తున్న ఆరోపణలను మంత్రులు లైట్ తీసుకుంటున్నారనే ఫీలింగ్‌లో ఉన్న నాయకత్వానికి.. టీడీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గ్రీవెన్స్ సెల్‌ను కూడా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదనే చర్చ నడుస్తోందట. ప్రజాదర్బార్ విషయంలో నారా లోకేష్ కూడా సీరియస్ అయినట్లు చెప్తున్నారు. ప్రజా దర్బార్‌ను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేసిన యువనేత, అసలు చాలా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు గ్రీవెన్స్ సెల్ నిర్వహించడం లేదని మండిపడ్డారట. ఇటీవల పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన లోకేష్, ఆ ప్రజా దర్బార్ కు వేల సంఖ్యలో ప్రజలు రావడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారట సుమారు ఐదు గంటల పాటు సమస్యలు విని అసలు ఎందుకు ఈ ఇంతమంది సమస్యలతో పార్టీ కార్యాలయానికి వచ్చారంటే నియోజకవర్గాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారట. ఇకపై నియోజకవర్గాల్లో, మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించాల్సిందనేని ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్‌కు మంత్రులు తప్పుకుండా హాజరు కావాలిని ఆదేశాలు జారీ చేశారట. ఆ క్రమంలో నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయిలో మంత్రులు ప్రజా సమస్యలను పట్టించుకోడంలేదా అనే చర్చ మొదలైందట. మరోవైపు వైసీపీ చేస్తున్న విమర్శల్ని దీటుగా ఎదుర్కొన లేకపోవడం మంత్రుల వైఫల్యంగా మారిందనే టాక్ గట్టిగా వినిపిస్తోంది. 2014 –19 మధ్య కూడా వైసిపి చేసిన ప్రచారాన్ని దీటుగా సమాధానం చేప్పకపోవడం వల్లే 2019 ఎన్నికల్లో ఓటమి కారణంగా పార్టీ అధిష్టానం భావిస్తుందనే చర్చ కూడా పార్టీ నేతల్లో ఉందట:. గతంలో జరిగిన తప్పిదాన్ని మరోసారి జరక్కుండా చూసుకోవాలని అధిష్టానం భావిస్తుందట. విశాఖపట్నం సమ్మిట్ అయిపోయిన తర్వాత జిల్లాల వారీగా మంత్రులు ఎమ్మెల్యేలతో లోకేష్ సమావేశం కావాలని నిర్ణయం తీసుకున్నారట. ప్రతిపక్ష పార్టీ చేసే ప్రతి విమర్శకి సంబంధిత జిల్లా నుంచి అయితే జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు.. రాష్ట్రస్థాయిలో అయితే ఆ శాఖ మంత్రి, ప్రభుత్వ అధికారులతో వెంటనే రిప్లై ఇప్పించాలని యోచిస్తున్నారట. పార్టీ, ప్రభుత్వం రెండు కలిసి పనిచేసే విధంగా అధిష్టానం కసరత్తు చేస్తుందట. త్వరలోనే ఫాక్ట్ చెక్ పేరుతో టీడీపీ కమిటీ వేయాలని చెప్పి నిర్ణయం తీసుకున్నట్లు నేతలు చెబుతున్నారట. ప్రతి నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు.. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలు.. దానికి కౌంటర్ గా ఏ రకంగా ముందుకు వెళ్లాలి అనేదానిపై కమిటీ వేసే ఆలోచనలో టీడీపీ ఉందట. టీడీపీ అధిష్టానం కార్యచరణ ఎంత వరకు వర్కౌట్ అవుతుందో చూడాలి

# యాక్టివ్ పాలిటిక్స్ లో ధర్మాన



శ్రీకాకుళం,నవంబర్ 09(భారత శక్తి):


వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఇటీవల సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు యాక్టివ్ అయ్యారు. అయితే ఆయన ఓటమి నుంచి చేరుకోవడానికి ఏడాదికి పైగా పట్టింది. అయితే ఒకే ఒక షరతుతో ఆయన పార్టీలో యాక్టివ్ అయినట్లు ప్రచారం నడుస్తోంది. సుదీర్ఘకాలం ఉమ్మడి ఏపీలో రాజకీయాలు చేశారు ధర్మాన ప్రసాదరావు. అయితే గత ఎన్నికల్లో ఒక సామాన్య సర్పంచి చేతిలో ఓడిపోయారు. అది మొదలు తీవ్ర నైరాస్యంలోకి వెళ్లిపోయారు. ఇప్పుడు ఉన్నఫళంగా యాక్టివ్ అయ్యారు. దీంతో రకరకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆది నుంచి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ఆయన భిన్న వైఖరి అనుసరిస్తూ వచ్చారు. ఒకానొక దశలో పార్టీకి దూరమవుతారని ప్రచారం నడిచింది. కానీ కూటమిలో ఆప్షన్ లేకపోవడంతోనే ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారని తెలుస్తోంది.ఉమ్మడి రాష్ట్రంలోనే ఏకధాటిగా 12 సంవత్సరాలపాటు మంత్రిగా ఉన్నారు ధర్మాన ప్రసాదరావు పైగా రెవెన్యూ లాంటి కీలక శాఖ బాధ్యతలను చూశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ సమయంలో కాంగ్రెస్ మంత్రిగా ఉండేవారు. జగన్మోహన్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే 2014 లో గత్యంతరం లేని స్థితిలో ఆయన జగన్ చెంతకు వెళ్లారు. అయినా ఓటమి పలకరించింది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉన్న వేవ్ దృష్ట్యా చాలా యాక్టివ్ గా పని చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో తనకు మంత్రి పదవి ఖాయమని అంచనా వేశారు. కానీ జగన్మోహన్ రెడ్డి ఆయనకు మంత్రి పదవి ఇవ్వలేదు. సోదరుడు కృష్ణదాస్కు ఇవ్వడంతో తీవ్ర మనస్థాపంతో మూడేళ్లపాటు గడిపారు. దీంతో విస్తరణలో ధర్మాన ప్రసాదరావు కు ఛాన్స్ ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి. అయితే జగన్ విషయంలో విభిన్న వైఖరితో ఉన్న ధర్మాన మంత్రిగా తన మార్కు చూపించుకోలేకపోయారు. 2024 ఎన్నికల్లో ఓడిపోయేసరికి జగన్ నాయకత్వంలో పనిచేసేందుకు ముందుకు రాలేదు కూడా.

ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ అయ్యారు ధర్మాన ప్రసాదరావు. అయితే ఈ యాక్టివ్ వెనుక కుమారుడు రామ్ మనోహర్ నాయుడు భవితవ్యం ఉన్నట్లు తేలుతోంది. 2024 ఎన్నికల్లోనే తన కుమారుడికి టిక్కెట్ ఇవ్వాలని కోరారు ధర్మాన ప్రసాదరావు. అందుకు జగన్ అంగీకరించలేదు. ఎన్నికల్లో ఓడిపోవడంతో శ్రీకాకుళం నియోజకవర్గంలో వైసిపి గెలుపు కష్టం అన్న ఆలోచనకు వచ్చారు. పార్టీ ఆవిర్భవించి మూడుసార్లు ఎన్నికలు జరిగితే ఒకసారి మాత్రమే గెలిచింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. 2024 ఎన్నికల్లో రికార్డు స్థాయిలో టిడిపి అభ్యర్థి 52,000 ఓట్ల తేడాతో గెలిచారు. అంటే ఏ స్థాయిలో ఇక్కడ తెలుగుదేశం అనుకూల వాతావరణం ఉందో గ్రహించారు ధర్మాన ప్రసాదరావు. అందుకే టిడిపి తో పాటు కూటమి పార్టీలో చేరేందుకు ప్రయత్నించారు. అది వర్కౌట్ కాకపోవడంతో వైసీపీలో కొనసాగుతున్నట్లు విశ్లేషణలు ఉన్నాయి.అయితే ధర్మాన ప్రసాదరావు విషయంలో పార్టీ హైకమాండ్ అల్టిమేట్ జారీ చేసినట్లు తెలుస్తోంది. పార్టీలో కొనసాగుతారా? లేదా? లేకుంటే ప్రత్యామ్నాయం చూసుకోమంటారా? అని గట్టిగానే కోరినట్లు తెలుస్తోంది. అప్పుడే ధర్మాన ప్రసాదరావు ఒక షరతు పెట్టినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు రామ్ మనోహర్ నాయుడు కు టికెట్ ఇస్తే పార్టీలో యాక్టివ్ అవుతానని ధర్మాన ప్రసాదరావు చెప్పినట్లు తెలుస్తోంది. అధినేత జగన్మోహన్ రెడ్డి అంగీకరించడంతోనే ధర్మాన యాక్టివ్ అయినట్లు సమాచారం.

# పొలిటికల్ టర్న్ తీసుకున్న డ్రగ్స్ కేసు

విశాఖపట్టణం, నవంబర్ 09(భారత శక్తి):

విశాఖలో చోటుచేసుకున్న డ్రగ్స్ కేసు ఇప్పుడు రాజకీయ మలుపు తిరుగుతోంది. ఈ కేసులో వైసీపీ స్టూడెంట్ వింగ్ నాయకుడు కొండారెడ్డి అరెస్టు వివాదాస్పదంగా మారింది. పోలీసులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నామని చెబుతుండగా, వైసీపీ మాత్రం దీనిని ప్రభుత్వ కుట్రగా పేర్కొంటోంది. పార్టీ నేతలు, కార్యకర్తలు పోలీసు వ్యవహారాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఆరోపణల ప్రకారం.. కొండారెడ్డిని ఉదయం 7 గంటల సమయంలోనే పోలీసులు అరెస్టు చేశారని, అయితే కేసు నమోదు మాత్రం సాయంత్రం



4.30కి చేశారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అధికారుల పాత్రపై వైసీపీ అనుమానం వ్యక్తం చేస్తోంది. పార్టీ నాయకులు పలు వీడియోలు, టైమ్ స్టాంపులు ఆధారంగా చూపిస్తూ.. అరెస్టు సాయంత్రం జరిగిందని పోలీసులు చెబుతుంటే, ఉదయం 11.30 గంటలకు టీడీపీ అధికారిక సోషల్ మీడియా పేజీలో అరెస్ట్ ఫోటోలు ఎలా వచ్చాయి? అని ప్రశ్నించారు. కొండారెడ్డి అరెస్టు అనంతరం ఆయనను సమీపంలోని టాస్క్ ఫోర్స్ పోలీస్‌స్టేషన్ (మూడే కిలోమీటర్ల దూరంలో)కి తీసుకెళ్లకుండా.. 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో స్థలానికి తీసుకెళ్లారని వైసీపీ ఆరోపిస్తోంది. ఆ టైమ్‌లో కొండారెడ్డి ఎక్కడ ఉన్నారు? ఎవరిని కలిశారు? ఎవరైనా ఒత్తిడి చేశారా? అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని పార్టీ నేతలు డిమాండ్ చేశారు. అరెస్టు అనంతరం కొండారెడ్డి మీడియా ముందు కన్నీళ్లతో మాట్లాడుతూ.. నా కొడుకును నిర్దోషిగా లాక్కెళ్లి, ప్రైవేట్ పార్ట్స్‌పై కొట్టి బలవంతంగా నేరాన్ని ఒప్పించారని ఆరోపించారు. డ్రగ్స్ కేసుతో తన కుమారుడికి ఎలాంటి సంబంధం లేదని, అవసరమైతే ఏ టెస్టుకైనా సిద్ధంగా ఉన్నామని కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. వైసీపీ నేతలు ఈ ఘటనను రాజకీయంగా ప్రేరేపిత అరెస్టుగా పేర్కొంటూ.. హోమ్ మినిస్టర్ కేవలం జగన్‌ని విమర్శించడానికే ఉన్నారు. ప్రజల భద్రత గురించి పట్టించుకోవడం లేదు అని వైసీపీ ప్రతినిధులు వ్యాఖ్యానించారు.. ఇక వైసీపీ మహిళా నాయకులు కూడా హోమ్ మినిస్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఎన్సీఆర్బీ రిపోర్టు ప్రకారం, అమ్మాయిల మిస్సింగ్ కేసులు రాష్ట్రంలోనే అత్యధికంగా నమోదయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఆమె ఏ హోమ్ కి మినిస్టర్ అంటూ వైసీపీ విమర్శలు గుప్పించారు. కొండారెడ్డి అరెస్టు వ్యవహారంలో వైసీపీ వీడియోలు బయట పెట్టడంతో డైలమాలో కూటమి ప్రభుత్వం పడిందని విమర్శించారు.

# నానికే కాపుకాస్తారా...



విజయవాడ,నవంబర్ 09(భారత శక్తి): (

మాజీ మంత్రి పేర్ని నానికి క్రేజ్ ఉంది. మచిలీపట్నంలో ఆయనకు కాపు సామాజికవర్గం కూడా అండగా ఉండేది. ఎక్కువ మంది కాపులు ఆయనకు మద్దతిచ్చేవారు. కానీ 2019 ఎన్నికల తర్వాత పేర్ని నాని పై కాపుల్లో వ్యతిరేకత మొదలయింది. పేర్ని నాని ఒంటికాలిపై పవన్ కల్యాణ్ పై లేస్తుండటం, ఆయనపై విమర్శలు చేస్తుండటంతో సొంత సామాజికవర్గం నానికి దూరమయిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. పేర్ని నాని మంచి వాగ్దాటి ఉన్న నేత. నాడు జగన్ కేబినెట్ లో మంత్రిగా ఉండి పవన్ కల్యాణ్ ను టార్గెట్ చేయడం వల్లనే కాపు సామాజికవర్గం నానికి దూరమయిందన్నది వాస్తవం. అంతకు ముందు ఆయనకు బలంగా నిలిచిన వర్గం కూడా ఆయన వైపు నిల్చోకపోవడానికి జనసేన కారణమని చెప్పాలి.. కొన్ని పరిణామాలు పేర్ని నానికి అనుకూలంగా మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. పవన్ కల్యాణ్ గత పదహారు నెలల నుంచి కొంత మౌనంగా ఉండటంతో పాటు కందుకూరు ఘటనపై మాట్లాడకపోవడంతో పాటు గతంలో మచిలీపట్నంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం, నామినేటెడ్ పదవుల్లో తమకు అన్యాయం జరిగిందని భావించడం, మచిలీపట్నంలో ప్రస్తుతం కాంట్రాక్టులు, నామినేటెడ్ పదవులు కొందరికే దక్కుతుండటంతో నానికి అనుకూలంగా క్రమంగా కాపులు కూడా మారుతున్నారన్నది వాస్తవం. ఇది ఎవరు అవునన్నా కాదన్నా నిజం. అక్కడి పరిస్థితుల్లో మార్పులు కనిపిస్తున్నాయి స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే ఖచ్చితంగా ఫలితాలు నాని వైపు ఉంటాయన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికతోనూ ఫలితాలు ఉంటాయని అంటున్నారు. మచిలీపట్నం జనసేనలో మాత్రం కూటమి సర్కార్ పై కొంత అసహనం ఏర్పడింది. అందులోనూ టీడీపీపై కొంత వ్యతిరేకతతో ఉన్నారు. పవన్ కల్యాణ్ కూడా పార్టీ కోసం కష్టపడిన తమను పట్టించుకోవడం లేదన్న అభిప్రాయంలో ఉన్నారు. అయితే దీనిని పేర్ని నాని రాజకీయంగా ఉపయోగించుకునే అవకాశముంది. మంత్రి కొల్లు రవీంద్ర కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణంపై రోడ్డు విస్తరణ పనులు కూడా నాని బయటకు తెచ్చి తన వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరి పేర్ని నాని ప్రయత్నాలు ఎంత వరకూ ఫలిస్తాయన్నది చూడాలి.

# ఎలన్ మస్క్‌కు 88 లక్షల కోట్లు ప్యాకేజీ

న్యూయార్క్, నవంబర్ 09(భారత శక్తి):

మనదేశంలో అత్యధిక వేతనాలు తీసుకొనే ప్రైవేట్ కంపెనీల అధినేతలలో ముకేశ్ అంబానీ, కావేరి మారన్, రోషిణి నాడార్, ఆనంద్ మహీంద్రా ముందు వరసలో ఉంటారు. వీరి వార్షిక వేతనం కోట్లల్లో ఉంటుంది. ప్రతి ఏడాది వీరి వేతనం పెరుగుతూనే ఉంది. పెరిగిన వేతనం ద్వారా వీరు రికార్డులు సృష్టిస్తూనే ఉన్నారు.. కార్పొరేట్ ప్రపంచంలో సరికొత్త ఘనతలను అందుకుంటునే ఉన్నారు. మన దేశం గురించి కాస్త పక్కన పెడితే.. ప్రపంచంలోనే అత్యధిక వేతనం తీసుకుంటున్న వ్యక్తిగా రికార్డ్ సృష్టించాడు టెస్లా అధినేత మస్క్.టెస్లా.. ఎక్స్, స్పేస్ ఎక్స్ కంపెనీల అధినేతగా.. ప్రపంచ కుబేరుడిగా పేరుపొందాడు మస్క్. ఇంకా తన వ్యాపారాలను మరింత స్థాయికి విస్తరించడానికి ఆయన ప్రణాళికలు రూపొందిస్తున్నారు. టెస్లా కార్ల విక్రయాల ద్వారా సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నారు. అటువంటి మస్క్ శాటిలైట్ ఇంటర్నెట్ వ్యాపారం లోకి కూడా అడుగు పెట్టారు. త్వరలోనే భారతదేశంలో సేవలు అందించబోతున్నారు. దీనికి సంబంధించి అనుమతులు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో మస్క్ మరో రికార్డు సృష్టించారు. కార్పొరేట్ ప్రపంచం కనీ విని ఎరుగని ఘనతను ఆయన అందుకున్నాడు. అమెరికా ఎన్నికల్లో ట్రంప్ తరఫున ప్రచారం చేశాడు మస్క్. ట్రంప్ ప్రభుత్వంలో క్రియాశీలక పాత్ర కూడా పోషించాడు. ఆ తర్వాత ఆ స్థానం నుంచి తప్పుకున్నాడు. ట్రంప్ తో తనకు విభేదాలు ఉన్నాయని పేర్కొన్నాడు. ట్రంప్ తో స్నేహం ముగిసిన అధ్యాయమని మస్క్ వెల్లడించాడు.. ఇక ఇప్పుడు మస్క్ కార్పొరేట్ ప్రపంచంలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించాడు. ఆయనకు వన్ ట్రిలియన్ డాలర్ల ప్యాకేజీ ఇవ్వడానికి టెస్లా కంపెనీకి చెందిన 75 శాతం షేర్ హోల్డర్లు ఆమోదం తెలిపారు.

# దౌత్యవేత్త నుండి రాష్ట్రపతిగా ఎదిగిన నారాయణన్

## భారత మాజీ రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ వర్ధంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

దౌత్యవేత్త నుండి రాష్ట్రపతిగా ఎదిగిన గొప్ప వ్యక్తి కెఆర్ నారాయణన్.. కొచెరిల్ రామన్ నారాయణన్ భారతదేశ 10వ రాష్ట్రపతి. అతను ఉరుఖుపూర్ లోని ఒక దళిత కుటుంబంలో జన్మించాడు. పాత్రికేయుడిగా కొంతకాలం పనిచేసిన తర్వాత, ఉపకార వేతనం సహాయంతో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో రాజకీయ శాస్త్రాన్ని అధ్యయనం చేసాడు. నెహ్రూ ప్రభుత్వంలో భారత విదేశాంగ శాఖలో ఉద్యోగిగా



నారాయణన్ తన వృత్తి జీవితాన్ని ప్రారంభించాడు. నారాయణన్ ప్రతిభను గుర్తించిన జవహర్ లాల్ నెహ్రూ ఆయనను రంగూన్ లోని భారత విదేశాంగ శాఖలో భారతదేశ ప్రతినిధిగా నియమించాడు. అతను జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్, థాయ్‌లాండ్, టర్కీ, చైనా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు దేశాలలో భారత రాయబారిగా పనిచేసాడు. అమెరికాలో భారత రాయబారిగా 1980 నుండి 1984 వరకూ నాలుగేళ్ళు పనిచేసాడు. అతనిని దేశంలో అత్యుత్తమ దౌత్యవేత్తగా నెహ్రూ పేర్కొన్నాడు. కె.ఆర్.నారాయణన్ పెరుమథనం, ఉఝవూర్ గ్రామంలో పేద కుటుంబంలో కొచెరిల్ రామన్ వైద్యర్, పున్నత్తురవీట్టిల్ పాపియమ్మ దంపతులకు జన్మించాడు. అతని తండ్రి సిద్ధ, ఆయుర్వేద వైద్యం చేస్తుండేవాడు. అతని కుటుంబం "పరవాన్" కులానికి చెందినవారు. పేదరికంతో ఉండేది. అతని తండ్రి వైద్యం చేయడం ద్వారా గౌరవాన్ని సంపాదించాడు. నారాయణన్ 1921, ఫిబ్రవరి 4 న జన్మించాడు. అతని మామయ్య అతన్ని పాఠశాలలో చేర్పించేటప్పుడు పుట్టినతేదీ సరిగా తెలియక 1921 అక్టోబరు 27 గా పాఠశాల రికార్డులలో నమోదు చేయించాడు. నారాయణన్ తరువాత ఆ తేదీనే అధికారికంగా ఉంచుకున్నాడు.నారాయణన్ ప్రారంభ విద్యను ఉరఖువూర్ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రారంభించాడు. తరువాత అవర్ లేడీ అఫ్ లౌర్డెస్ అప్పర్ ప్రైమల్ స్కూల్, ఉళవూర్ (1931?35) లో చదివాడు. తన యింటి నుండి 15 కిలోమీటర్ల దూరంలో గల పాఠశాలకు వరిపొలాల గుండా నడుచుకొని వెళ్ళేవాడు. పాఠశాల విద్యకు ఫీజులు చెల్లించలేక పోయేవాడు. తరచుగా తరగతిగది వెలుపల నిలబడి పాఠాలు నేర్చుకునేవాడు. ట్యూషన్ ఫీజులు అధికంగా ఉండటం వల్ల తరగతి గదిలోనికి అతని హాజరును నిషేధించారు. ఆ కుటుంబం పుస్తకాలు కొనడానికి కూడా ఆర్థిక యిబ్బందులు పడేది. అతని అన్నయ్య కె.ఆర్. నీలకంఠన్ ఆస్మా రోగం వల్ల బాధపడుతూ గృహానికి పరిమితమయ్యాడు. నీలకంఠన్ ఇతర విద్యార్థుల నుండి పుస్తకాలను తీసుకొని, వాటిని నకలు చేసి, వాటిని నారాయణ్‌కి ఇచ్చేవాడు. నారాయణన్ సెయింట్ మేరీ హైస్కూలు, కురవిలంగడ్ లో (అంతకు ముందు 1935?36 లో సెయింట్ జాన్స్ హైస్కూలు కూతట్టుకుళంలో చదివాడు) మెట్రిక్యులేషన్ (1936?37) పూర్తిచేసాడు. ఇంటర్మీడియట్ విద్యను కొట్టయం లోని సి.ఎం.ఎస్ కళాశాలలో (1938?40) పూర్తిచేసాడు. ట్రావెన్స్‌కోర్ రాజ కుటుంబం నుండి ఉపకార వేతనాన్నిపొందాడు. నారాయణన్ బి.ఎ (ఆనర్స్), ఆంగ్ల సాహిత్యంలో ఎం.ఎ డిగ్రీలను ట్రావెన్స్‌కోర్ విశ్వవిద్యాలయం (ప్రస్తుతం కేరళ విశ్వవిద్యాలయం) నుండిపూర్తిచేసాడు. విశ్వవిద్యాలయంలో ప్రథమ శ్రేణిలో (ట్రావెన్స్‌కోర్ లో డిగ్రీలో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడైన మొదటి దళిత విద్యార్థి) ఉత్తీర్ణుడయ్యాడు. అతని కుటుంబం తీవ్రమైన యిబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు అతను ఢిల్లీ వెళ్ళి ది హిందూ, ది టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికలలో పాత్రికేయుడిగా (1944?45) పనిచేసాడు. ఆ కాలంలో అతను తన స్వంత సంకల్పంతో 1945 ఏప్రిల్ 10న బొంబాయిలో మహాత్మా గాంధీని ఇంటర్వ్యూ చేసాడు .1945లో నారాయణన్ లండన్ వెళ్ళి లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ వద్ద హారోల్డ్ లాస్కీ అధ్వర్యంలో రాజనీతి శాస్త్రాన్ని అభ్యసించాడు. అతను కార్ల్ పాప్పర్, లియోనెల్ రోబిన్స్, ఫ్రెడిరిచ్ హైక్ ఉపన్యాసాలకు హాజరయ్యేవాడు. జె.ఆర్.డి.టాటా అందించిన ఉపకార వేతనంతో రాజనీతి శాస్త్రం ప్రత్యేకాంశంగా బి.ఎస్.సి (ఆర్థిక శాస్త్రం) డిగ్రీ ఆనర్స్ ను పూర్తిచేసాడు. లండన్ లో ఉన్నప్పుడు అతను కె.ఎన్.రాజ్ అనే సహ విద్యార్థితో వి.కె.కృష్ణమీనన్ అధ్వర్యంలోని ఇండియా లీగ్ లో క్రియాశీలకంగా పాల్గొన్నాడు. కె.ఎం.మున్షీ ప్రచురిస్తున్న సోషల్ వెల్ఫేర్ వారపత్రికకు అతను లండన్ విలేకరిగా వ్యవహరించాడు. కె.ఎన్.రాజ్, వీరసామి రింగాడూ (తరువాత కాలంలో మలేషియా మొదటి అధ్యక్షుడు) లతో కలసి ఒకే గదిలో ఉండేవాడు. అతనికి మరొక ఆప్త మిత్రుడు పియరీ త్రుదే (తరువాత కాలంలో కెనడా ప్రధానమంత్రి).అతను రంగూన్, బర్మా (మయన్మార్) లో పనిచేస్తున్నప్పుడు, మా టింట్ టింట్ ను కలిసాడు. తరువాత 1951 జూన్ 8 న ఆమెతో వివాహమయింది. మా టింట్ టింట్ "ప్రపంచ యువ మహిళా క్రిస్టియన్ అసోసియేషన్" లో క్రియాశీలక సభ్యురాలు. ఆమె లాస్కీ విద్యార్థిని. ఆమె తన పరిచయానికి ముందు రాజకీయ స్వేచ్ఛ గురించి మాట్లాడటానికి అతనిని సంప్రదించింది. నారాయణన్ ఐ.ఎఫ్.ఎస్, ఆమె విదేశీయురాలు అయినందున వారి వివాహానికి భారతీయ చట్టం ప్రకారం నెహ్రూ నుండి ప్రత్యేక మినహాయింపు అవసరమైంది. మా టింట్ టింట్ భారతీయ నామం "ఉషా" గా మార్చుకొని భారతీయ పౌరసత్వం తీసుకుంది. ఉషా నారాయణన్ మహిళలు, పిల్లలకు సంబంధించిన అనేక సాంఘిక సంక్షేమ కార్యక్రమాలలో పనిచేసింది. ఆమె ఢిల్లీ స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్ లో మాస్టర్ డిగ్రీని చేసింది. ఆమె బర్మా భాషలోని అనేక కథలను అనువాదం చేసి ప్రచురించింది. థిన్ పీ మైంట్ (బర్మా రచయిత) ద్వారా అనువదించబడిన కథల సంకలనం "స్వీట్ అండ్ సోర్" అనే శీర్షికతో 1998 లో కనిపించింది. విదేశీయ నేపథ్యం గల వారిలో భారతదేశంలో "ప్రథమ మహిళ"గా స్థానం పొందిన వారిలో ఆమె రెండవదానిగా గుర్తింపబడింది. వారికి ఇద్దరు కుమార్తెలు. వారు చిత్రా నారాయణన్ (స్విడ్జర్లాండ్, ద హోలీ సీ దేశాలకు భారత అంబాసిడర్), అమృత. ఇందిరా గాంధీ అభ్యర్థన మేరకు అతను రాజకీయాలలోనికి ప్రవేశించాడు. 1984, 1989, 1991 లలో వరుసగా మూడు సార్లు పాలక్కాడ్ (కేరళ) లోని ఒట్టపాళం నియోజకగర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొంది లోక్‌సభకు ఎన్నికయ్యాడు. అతను రాజీవ్ గాంధీ కేబినెట్ లో రాష్ట్ర వ్యవహారాల మంత్రిగా ఉన్నాడు. 1985 లో ప్లానింగ్ , 1985-86 మధ్య విదేశీ వ్యవహారాలు, 1986-89 మధ్య సైన్సు అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ పదవులను స్వీకరించాడు. పార్లమెంటు సభ్యునిగా అతను అతను భారతదేశంలో పేటెంట్ నియంత్రణలను అణచడానికి అంతర్జాతీయ ఒత్తిడిని అడ్డుకున్నాడు. 1989 నుండి 1991 మధ్య కాలంలో కాంగ్రెస్ పదవిలో లేనందువల్ల ప్రతిపక్షంలో ఉన్నాడు. 1991లో కాంగ్రెస్ మరలా అధికారంలోనికి వచ్చిన తరువాత అతనికి ఏ కేబినెట్ పదవీ దక్కలేదు. అతనికి రాజకీయ విరోధి అయిన అప్పటి కేరళ ముఖ్యమంత్రి కె.కరుణాకరన్, కమ్యూనిస్టు భావజాలం కలిగి యున్నందున నారాయణన్ మంత్రి అయ్యే అవకాశం లేదని తెలిపాడు. అయితే, తాను మూడు ఎన్నికలలో కమ్యూనిస్ట్ అభ్యర్థులను ఓడించినట్లు నారాయణన్ స్పష్టం చేశాడు. 1992 ఆగస్టు 21 న నారాయణన్ భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నుకోబడ్డాడు. అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నారాయణన్ పేరును మొదటి సారిగా జనతాదళ్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, పూర్వపు భారతదేశ ప్రధానమంత్రి వి.పి.సింగ్ ప్రతిపాదించాడు. జనతాదళ్ , పార్లమెంటులోని వామపక్ష పార్టీలు ఉమ్మడిగా అతనిని అభ్యర్థిగా ప్రకటించాయి. ఇది తరువాత పి.వి. నరసింహారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుండి మద్దతు పొందింది. ఇది అతని ఏకగ్రీవ ఎన్నికకు మార్గం సుగమమైంది. కె.ఆర్. నారాయణన్ 1997 జూలై 17 న భారత రాష్ట్రపతిగా ఎన్నుకయ్యాడు. రాష్ట్రపతి ఎన్నికలలో అతనికి 95% ఎలక్టోరల్ కాలేజి ఓట్లు వచ్చినవి. ఈ ఎన్నికలు జూలై 14న జరిగింది. కేంద్రంలో మైనారిటీప్రభుత్వం ఉన్న సమయంలో జరిగిన ఏకైక అధ్యక్షుని ఎన్నిక ఇది. అతనిని టి. ఎన్. శేషన్ ఏకైక ప్రత్యర్థి అభ్యర్థి. శివసేన తప్ప మిగతా ప్రధాన రాజకీయ పక్షాలన్నీ నారాయణన్‌కు ఈ అధ్యక్ష ఎన్నికలలో మద్దతు నిచ్చాయి. నారాయణన్ కేవలం దళిత అభ్యర్థిగా ఎన్నికయ్యారని శేషన్ ఆరోపించాడు. 1997 జూలై 25న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జె.ఎస్.వర్మ సమక్షంలో పార్లమెంటు సెంట్రల్ హాలులో దేశాధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేసాడు. 1998 సార్వత్రిక ఎన్నికలలో నారాయణన్ రాష్ట్రపతి భవన్ సముదాయం లోని ఒక పాఠశాలలో నిర్వహింపబడుతున్న పోలింగు బూత్‌లో సామాన్య ఓటర్లతో కలసి వరుసలో నిలబడి ఓటు వేసి పదవిలో ఉండి ఓటు వేసిన మొదటి రాష్ట్రపతిగా గుర్తింపబడ్డాడు. ఈ ప్రక్రియను తన పూర్వపు రాష్ట్రపతులు వదిలి వేసినప్పటికి అతను ఓటు వేయడానికి పట్టుబట్టాడు. 1999 సార్వత్రిక ఎన్నికలలో కూడా తన ఓటు హక్కును వినియోగించుకున్నాడు.అధ్యక్షుడు నారాయణన్ ఒక రాష్ట్రంలో రాజ్యాంగంలోని 356 అధికరణ క్రింద రాష్ట్రపతి పాలనను విధించేందుకు కేంద్ర మంత్రివర్గం చేసిన సిఫారసును పునఃపరిశీలించమని రెండు సార్లు కోరాడు; గుజ్రాల్ ప్రభుత్వం (1997 అక్టోబరు 22) ఉత్తర ప్రదేశ్ లోని కళ్యాణ్‌సింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలన్నప్పుడు, వాయ్‌పేయి ప్రభుత్వం (1998 సెప్టెంబరు 25) న బీహార్ లోని రబ్రీదేవి ప్రభుత్వాన్ని రద్దు చేయాలన్నప్పుడు అతను ఈ విధంగా పునఃపరిశీలను కోరాడు. ఈ రెండు సందర్భాలలో అతను నిర్ణయం తీసుకున్నప్పుడు 1994 లో జరిగిన ఎస్.ఆర్.బొమ్మై, కేంద్ర ప్రభుత్వం పై సుప్రీ కోర్టు ఇచ్చిన తీర్పును ఉదహరించాడు. రాష్ట్రపతి సూచనను మంత్రివర్గం గౌరవించింది. ఒక అధ్యక్షుడు ఇటువంటి పునఃపరిశీలనను కోరినప్పుడు, ఈ సంఘటనలు ఫెడరలిజం, రాష్ట్రప్రభుత్వాల అధికారాలను గూర్చి ముఖ్యమైన సంప్రదాయాన్ని నెలకొల్పింది. భారత రాష్ట్రపతిగా పదవీవిరమణ చేసిన తరువాత కె.ఆర్. నారాయణన్ తన భార్య ఉషతో పాటు తన మిగిలిన జీవితాన్ని సెంట్రల్ ఢిల్లీ బంగ్లా (34 పృథ్వీ రోడ్) లో గడిపాడు. ముంబై (21 జనవరి 2004) లో వరల్డ్ సోషల్ ఫోరమ్ "ప్రత్యామ్నాయ ప్రపంచీకరణ ఉద్యమానికి" తన మద్దతును అందించాడు.అతను సిద్ధ, ఆయుర్వేదం కోసం నవజ్యోతిశ్రీ కరుణాకర గురు పరిశోధనా కేంద్రాన్ని స్థాపించడానికి ఉఝూవూరు నుండి పోథెన్‌కోడ్ లోని సంతిగిరి ఆశ్రమానికి వెళ్ళాడు. కె.ఆర్.నారాయణన్ 2005 నవంబరు 9 న తన 85వ యేట న్యూఢిల్లీ లో మరణించాడు. అతనికి హిందూ ధర్మ శాస్త్రంప్రకారం దహన కార్యక్రమాలను సైనిక లాంఛనాలతో చేసారు. ఇది రాజ్‌ఘాట్ కు సమీపంలోని "కర్మ భూమి" లో జరిగింది. కె.ఆర్.నారాయణన్ ఫౌండేషన్ 2005లో స్థాపించబడినది. ఇది కె.ఆర్.నారాయణ్ జ్ఞాపకార్థం అతని ఆదర్శాలను ప్రచారం చేయుటకు ప్రారంభించబడింది. దీని లక్ష్యం కేరళ సమాజంలోని దుర్బల వర్గాలైన మహిళలు, పిల్లలు, అంగవైకల్య వ్యక్తులు, వృద్ధులు, ఇతర వెనుకబడిన వర్గాలకు విద్యా శిక్షణను అందిచడం, వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడం, వారిజీవన పరిస్థితులను మెరుగుపరచడాం, వారి కుటుంబాలను బలోపేతం చేయడం వంటి కార్యక్రమాలద్వారా మంచి భవిష్యత్తునందించడం. ఈ ఫౌండేషన్ యొక్క ముఖ్య ఉద్దేశం.

===============

### కారు బీభత్సంలో ముగ్గురు మృతి

జగ్గంపేట నవంబర్ 09(భారత శక్తి):

కాకినాడ జిల్లాలో 16 నెంబర్ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కడ మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. అన్నవరం నుంచి జగ్గంపేట వస్తున్న కారు మార్గమధ్యలోని కిర్లంపూడి మండలం సోమవరం గ్రామం జంక్షన్ వద్ద వచ్చేసరికి కారు యొక్క టైరు బరస్ట్ అవడంతో బైకును రిక్షాను ఢీ కొట్టి అక్కడితో ఆగకుండా బస్ స్టాప్ లోకి దూసుకుపోయింది.. దీంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందగా, మరో నలుగురికి తీవ్రంగా గాయాలు అవ్వడంతో చికిత్స నిమిత్తం ప్రత్తిపాడు ఆస్పత్రి తరలించారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించి అన్ని విధాల ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు..

### దుగ్గిరాల లో వ్యాపారి దారుణ హత్య

మంగళగిరినవంబర్ 09(భారత శక్తి):

దుగ్గిరాలలో వ్యాపారి దారుణ హత్య జరిగింది. వీరబాబు అనే వ్యాపారిని దుండగులు హత్య చేసారు. అప్పు ఇవ్వలేదనే వీరబాబును నవీన్, కృష్ణ హత్య చేసారు. నిందితులు నవీన్, కృష్ణ పరారీలో వున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మళ్లీ బిఆర్ఎస్ వైపు గూడెం బ్రదర్స్.?

సంగారెడ్డి నవంబర్ 09(భారత శక్తి):

శుక్రవారం జరిగిన బిఆర్ఎస్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డి ప్రత్యక్షమయ్యారు. పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి 2014, 2018, 2023 ఎన్నికల్లో వరుసగా గెలిచిచారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాజకీయ పరిణామాలు మారాయి. దాంతో అయన అధికార కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. అయితే మహిపాల్ రెడ్డి ఇప్పటి వరకూ కాంగ్రెస్, బిఆర్ఎస్ సమదూరం పాటించారు. తెరపైకి ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు వచ్చింది. ఇటీవల కొల్లూరులో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ పర్యటన జరిగినప్పుడు అయనకు ఆహ్వానం అందలేదు.

## సంకష్టహర చతుర్థి పూజలందుకున్న మహాగణపతి -అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు

మంథని నవంబర్ 09(భారత శక్తి):

సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మహాగణపతి దేవాలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. మంథని పట్టణంలోని తమ్మిచెరువు కట్ట వీధిలో గల శ్రీ మహాగణపతి దేవాలయం ఎంతో విశిష్టత సంతరించుకుంది. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత సంకటహర చతుర్థి వస్తుంది. సంకష్ట చతుర్థి నాడు వ్రతం ఆచరించడం వల్ల జాతకంలో కుజ దోష సమస్యలు తొలగిపోతాయి. అంతేకాకుండా చేసే పనులలో సంకటాలు తొలగి విజయాలు చేకూరుతాయని శాస్త్రవచనం. ఈరోజు సంకష్టి ఉపవాసాలు ఉండేవారు మహా గణపతికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేస్తూ ఉంటారు. అలాగే ప్రతినిత్యం ఎందరో భక్తులు ఆలయంలో గణపతిని దర్శించుకొని వెళుతుంటారు. ప్రతి మంగళవారం భక్తులు విగ్నేశ్వరుని పూజిస్తుంటారు. ముఖ్యంగా సంకటహర చతుర్థి రోజున మంథని పట్టణ ప్రజలే కాకుండాచుట్టుపక్కల గ్రామాల నుండి సైతం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. సంకటహర చతుర్థి



దీక్ష పట్టిన భక్తులు రాత్రి చంద్రోదయం అనంతరం మాత్రమే ఉపవాస దీక్షను విరమిస్తారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పల్లి రాము ఆలయానికి వచ్చిన భక్తులకు సంకల్పాలు, అర్చనలు, అభిషేకాలు చేయించారు. ఆలయం లోని స్వామి వారిని అలంకరిస్తూ భక్తుల సౌకర్యార్థం అర్చకులు పల్లి సంజీవ్, పల్లి రాము సోదరులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## కళ్యాణదుర్గంలో మంత్రి నారా లోకేష్ 71వ రోజు ప్రజాదర్బార్ ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి

### అన్ని విధాల అండగా ఉంటామని భరోసా

కళ్యాణదుర్గం: నవంబర్ 09(భారత శక్తి):

అనంతపురం జిల్లా రెండు రోజు పర్యటనలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. కళ్యాణదుర్గం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద 71వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రతిఒక్కరిని మంత్రి ఆప్యాయంగా పలకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. బతుకుదెరువు కోసం మస్కట్ వెళ్లిన తన సోదరి షేక్ జుబేదా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, సరైన తిండి లేక అనారోగ్యం పాలైన ఆమెను క్షేమంగా స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని గుంతకల్లుకు చెందిన షేక్ షబానా మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. తన ఇద్దరు కుమార్తెల ఉన్నత చదువుల కోసం ఆర్థికసాయం అందించాలని అనంతపురానికి చెందిన మదమంచి ప్రవీణ్ కుమార్ మంత్రి నారా లోకేష్ కలసి కోరారు. కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతపురం జిల్లా ఉప్పరపల్లిలో తాను ఐదు సెంట్ల ఇంటి స్థలాన్ని కొనుగోలుచేశానని, అయితే రామకృష్ణారెడ్డి, కుమారస్వామిరెడ్డి అనే వ్యక్తులు దౌర్జన్యపూరితంగా తన స్థలాన్ని ఆక్రమించారని పుట్టపర్తి మండలం గువ్వలకుంటపల్లి గ్రామానికి చెందిన ఈ.సురేంద్ర రెడ్డి మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. విచారించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం మౌక్తికాపురంలోని గత 40 ఏళ్లుగా 110 ముస్లీం మైనార్టీ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. తమ గ్రామానికి చెందిన 4.86 ఎకరాల స్మశాన స్థలాన్ని ముద్దినాయనపల్లికి చెందిన ఈ.అశోక్ ఆక్రమించి తప్పుడు పత్రాలతో ఆన్ లైన్ లో నమోదు చేశారు. విచారించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. శ్రీ సత్యసాయి వాటర్ సప్లై ప్రాజెక్టు లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది మంత్రి లోకేష్ ను కలిసి కోరారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

### సీఎం రేవంత్ జన్మదినం యాదాద్రిలో ప్రత్యేక పూజలు

యాదాద్రి నవంబర్ 09(భారత శక్తి):

తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శుభాకాంక్షలు విలువ పోటెత్తుతుంది. సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా.. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు గోత్రనామాలతో అర్చకులు అర్చన చేసారు.

### ఇన్నోవా పల్టీ పలువురికి గాయాలు

నల్గొండ నవంబర్ 09(భారత శక్తి):

నల్లగొండ జిల్లా, చిట్యాల మండలం, గుండ్రాంపల్లి వద్ద జాతీయ రహదారి 65 హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంతో వెళ్తున్న ఇన్నోవా వాహనం.. అదుపుతప్పి డివైడర్ ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ప్రమాద ధాటికి.. ఇన్నోవా వెహికిల్ రోడ్డుపైనే ఫల్టీలు కొట్టింది. దీంతో, కార్ ఇంజన్ లో మంటలు చెలరేగి, వాహనం నడిరోడ్డుపైనే దగ్ధమయింది. అయినప్పటికీ.. ఇన్నోవా నుంచి ఎనిమిది మంది సురక్షితంగా 8 మంది ప్రయాణికులు ప్రాణాలతో బైట పడ్డారు. వాహనం రోడ్డుకు అడ్డం పడడంతో హైద్రాబాద్ టూ విజయవాడ నేషనల్ హైవే పై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఓ లారీ అదే సమయంలో రాగా.. అందులో ప్రయాణిస్తున్న వారు.. ప్రాణాలకు తెగించి.. ఇన్నోవా వెహికిల్ లోని ప్రయాణికులకు కాపాడారు. ఈ క్రమంలో వారికి కాలిన గాయాలు అయ్యాయి. మొదటగా చౌటుప్పల్ ఆసుపత్రికి తరలించగా.. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

### ఎన్నిక ప్రచారం దోశలు వేసిన మంత్రి జూపల్లి

హైదరాబాద్, నవంబర్ 09(భారత శక్తి):

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచారంలో పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, మద్యనిషేధ ఎ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని సుల్తాన్‌నగర్‌లో నవీన్ యాదవ్ ను గెలిపించాలని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాల ఫలితంగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు.

# శ్రీ చరణికి కడపలో నీరాజనం



బద్వేలు నవంబర్ 09(భారత శక్తి):

కడప జిల్లా రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో ప్రపంచ మహిళా క్రికెట్ వరల్డ్ కప్‌లో భారత జట్టుతో కలిసి చారిత్రక విజయం సాధించిన మహిళా క్రీడాకారిణి నల్లపురెడ్డి శ్రీచరణికి నిర్వహించిన ఘన సన్మాన కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఉ కడప జిల్లా టిడిపి అధ్యక్షులు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి , ప్రభుత్వ విప్ కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి , కడప క్రికెట్ స్టేడియం చైర్మన్ రెడ్డెప్పగారి శ్రావణ్ రాజ్ రెడ్డి పాల్గొన్నారు.ప్రపంచ మహిళా వరల్డ్ కప్‌లో భారత మహిళా క్రికెట్ జట్టు తరఫున అద్భుత ప్రదర్శన చేసి దేశానికి గర్వకారణంగా నిలిచిన కడప జిల్లాకు చెందిన నల్లపురెడ్డి శ్రీచరణికి క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ కడప జిల్లా ఆధ్వర్యంలో ఘన సత్కారం నిర్వహించారు.జిల్లాకు చేరుకున్న శ్రీచరణిని సెవెన్ రోడ్స్ నుండి రాజీవ్ మార్గ్ వరకు భారీ ర్యాలీగా స్వాగతం పలికి అనంతరం స్టేడియంలో జరిగిన సన్మాన సభలో నాయకులు పాల్గొని ఆమె ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీచరణి తల్లిదండ్రులతో కలిసి ఆమెను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ? మహిళా ప్రతిభను నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చి, శ్రీచరణికి రూ.2.5 కోట్లు ప్రోత్సాహకంగా ప్రకటించడం, గ్రూప్-1 స్థాయి ఉద్యోగం, కడపలో 1000 గజాల స్థలం కేటాయించడంలాంటి చారిత్రాత్మక నిర్ణయాలు ప్రభుత్వానికి మహిళలపై ఉన్న నమ్మకం, ప్రోత్సాహానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఇక భవిష్యత్తులో కడప జిల్లా నుంచి ఇంకా ఎక్కువ మంది ప్రతిభావంతులైన యువ క్రీడాకారులు ప్రపంచ వేదికపై రాణించేందుకు ప్రభుత్వం, క్రీడా సంఘాలు బలోపేత చర్యలు కొనసాగిస్తాయని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, క్రికెట్ సంఘ ప్రతినిధులు, క్రీడా సంఘ నాయకులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



జయశంకర్ భూపాలపల్లి. నవంబర్ 09(భారత శక్తి):

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూట్ల తిరుపతి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి మాట్లాడుతూ ఈ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుండి పేద ప్రజల సేవయే తన వృత్తి వ్యాపారంగా తలచి ,బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చి అమలుపరుస్తూ ఈ రాష్ట్ర ప్రజల మనలను పొందుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా అనారోగ్యంగా ఉన్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలుపరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఘనత ఆయనకే దక్కింది పేదలకు ఉచిత సన్నబియ్యం, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం 200 యూనిట్లు ఫ్రీ కరెంటు ,రైతులకు రుణమాఫీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ ,గురుకుల పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన భోజనం రైతులకు రైతు భరోసా సన్నబడ్లకు 500 రూపాయల బోనస్ ఇలా అనేక సంక్షేమ పథకాలను అమలు పరుస్తూ రాష్ట్ర ప్రజల ఆశీస్సులను తీసుకుంటూ దూసుకుపోతున్న ఆ రేవంతన్నకు భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలను అందిస్తూ ఇంకా పది సంవత్సరాలు ఈ రాష్ట్ర ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని కొనియాడారు . ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య కార్యదర్శి చిలుకల రాయకుమురు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూలశంకర్ గౌడ్ , యూత్ మండల అధ్యక్షులు అల్లకొండ కుమార్, మండల ఉపాధ్యక్షులు బండి భగవాన్, టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర లక్ష్మణ్ గౌడ్ ,స్థానిక మాజీ ఎంపీటీసీ దొబ్బేట అనిల్, బీసీ సెల్ మండల అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ , సీనియర్ నాయకులు గుర్రపు తిరుపతి గౌడ్ రత్నంకూస్ కోఆప్షన్ సభ్యులు ఎండి రాజ్ మహమ్మద్ , పట్టెం శంకర్, నాయకులు ఆరెపల్లి మల్లయ్య, రాజమౌళి ,గుర్రపు అశోక్, శనిగరపు మొగిలి ,బుర్ర మల్లేష్ గౌడ్, పుల్ల సమ్మయ్య, ఏ కు కిషన్ ,మొలుగూరి కుమార్ ,క్యాతంమార్కండేయ కంచు శ్రీకాంత్, ముష్కే నాగరాజు,అల్లంరాజు , అందుగుల రాజు,తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు.



రామగుండం : నవంబర్ 09(భారత శక్తి):

గోదావరిఖనిలోని ప్రధాన చౌరస్తాలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం నాడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక చౌరస్తాలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాల్వలింగస్వామి, లీడర్ మహంకాళి స్వామి హాజరై జన్మదిన కేకును వారి చేతుల మీదుగా కట్ చేయడం జరిగింది అనంతరం వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 6 గ్యారంటీలను అమలు చేస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 200 యూనిట్ల ఉచిత కరెంటు 500 గ్యాస్ కలెక్షన్స్ సన్న బియ్యం 10 లక్షల రూపాయల ఆరోగ్య శ్రీ పథకాలను అమలు చేస్తూ మరియు రైతు భరోసా లాంటి సంక్షేమాలను దిగ్విజయంగా అమలు చేస్తూ పేదల పక్షపాతిగా నిలిచారు అంతేకాకుండా బీసీలకు న్యాయం చేయాలని సంకల్పంతో 42 శాతం రిజర్వేషన్ సాధించాలని అసెంబ్లీలో తీర్మానం చేయించడం జరిగింది. ఎస్సీ వర్గీకరణ దేశంలోనే మొట్టమొదటి రాష్ట్రంగా నిలవడం జరిగింది సంక్షేమ సారధిగా రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతున్నటువంటి రేవంత్ రెడ్డి పక్షాన రాష్ట్ర ప్రజలు అండగా నిలవాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు దిటి బాలరాజు, గట్ల రమేష్, ఎండి ముస్తఫా, బొమ్మక రాజేష్, పెద్దల్లి ప్రకాష్, నాయిని ఓదెలు యాదవ్, సింహాచలం, ఉమాదేవి సాంబమూర్తి, మాలెం మధు,ఉల్లంగుల రమేష్, చుక్కల శ్రీనివాస్, ధోలికట్ల సతీష్, పంజా శ్రీనివాస్, దాసరి విజయ్, చెరుకు బుచ్చిరెడ్డి, గజాబింకర్ బాబు, శివ, గుడికందుల రవి, శ్రీనివాస్ రెడ్డి శోభ స్వప్న హవీద్ రమేష్ గడ్డం శ్రీనివాస్ దశరథం, భూషణ్ గౌడ్, తదితరులు అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# మామండూరు అడవిలో పవన్ కళ్యాణ్ పర్యటన

తిరుపతి నవంబర్ 8,

తిరుపతి జిల్లా, మామండూరు అటవీ ప్రాంతాన్ని ఉ పముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పరిశీలించారు. అడవిలో నాలుగు కిలోమీటర్లు పైగా ప్రయాణం. రెండు కిలోమీటర్ల మేర కాలినడకన ప్రతి చెట్టునీ పరిశీలించారు. ఎర్రచందనం, అంకుడు, తెల్లమద్ది, వెదురుతో పాటు శేషాచలంలో మాత్రమే కనబడే అరుదైన మొక్కలు పరిశీలించి అటవీ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. నేపిరయర్ రిజర్వ్ ఫారెస్ట్ వద్ద ఉన్న వాచ్ టవర్ నుంచి మొత్తం అటవీ ప్రాంతం మొత్తం పరిశీలించారు. వెలిగొండ, శేషాచలం అటవీ సరిహద్దులు, స్వర్ణ ముఖీ నది ఎక్కడి నుంచి ఉ ద్భవిస్తుంది? తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుంటి మడుగు వాగు ఒడ్డున కూర్చుని, పరిసరాలను ఆసక్తిగా తిలకించారు. వాగుకి ఇరు వైపులా ఉన్న చెట్ల వివరాలపై ఆరా తీశారు. ఎర్రచందనం స్మగ్లింగ్, స్మగ్లింగ్ నిరోధక ఆపరేషన్స్, టాస్క్ ఫోర్స్, అటవీ సిబ్బంది కూంబింగ్ తదితర తెలుసుకున్నారు.

# డ్రగ్స్ రహిత సమాజం కోసం నడుం బిగిద్దాం... డ్రగ్స్ వద్దు -- ఆరోగ్యమే ముద్దు....

.బద్వేలు నవంబర్ 09(భారత శక్తి):

మత్తు పదార్థాలు డ్రగ్స్ గంజాయి రహిత సమాజం కోసం అందరం కలిసికట్టుగా నడుం బిగిద్దామని బద్వేల్ అర్బన్ సిఐ లింగప్ప తెలిపారు శనివారం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ముద్రించిన పోస్టర్స్ ను శనివారం బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్ నందు అర్బన్ సీఐ లింగప్ప చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా బద్వేల్ అర్బన్ సిఐ లింగప్ప మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో తెలిసి తెలియని వయసులో యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని అన్నారు యువతకు అవేర్నెస్ కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ యువజన సంఘం నాయకత్వానికి అభినందనలు తెలిపారు ముఖ్యంగా డ్రగ్స్ గంజాయి వంటి వాటికి బానిసవుతున్నారని తద్వారా తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు అన్నారు డ్రగ్స్ గంజాయి వాడిన అమ్మిన నేరమని దానికి కఠిన శిక్షలు ఉన్నాయని వారన్నారు కావున యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా మంచి మార్గంలో నడిచి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అన్నారు డ్రగ్స్ గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దామని వారు పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ.. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు కాదు యువతకు చైతన్యపరిచే కార్యక్రమాలు కూడా నిర్వహించడం జరుగుతుందని అన్నారు డ్రగ్స్ గంజాయి వద్దు ఆరోగ్యమే ముద్దు అన్నారు అందరికీ విద్య అందరికీ ఉపాధి లక్ష్యంగా డివైఎఫ్ఐ యువజన సంఘం ముందుకు సాగడం జరుగుతుందని యువత అందరం కలిసి డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడదామని అన్నారు దీనిపై భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా సదస్సులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని యువత పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఎస్కే ఆదిల్, ఉపాధ్యక్షులు ఎస్కే ఖలీల్ భాషా డివైఎఫ్ఐ మహిళా కో కన్వీనర్ ఎస్కే ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



# వీధి కుక్కలు కనిపిస్తే తరలించాలని సంచలన ఆదేశం



హైదరాబాద్ నవంబర్ 09(భారత శక్తి):

దేశంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది వీధి కుక్కల దాడిలో చనిపోతున్న వారి సంఖ్య బాగా పెరుగుతోంది. అదే సమయంలో జంతు ప్రేమికులు మాత్రం వీధి కుక్కల విషయంలో కరుణ చూపాలని అంటున్నారు.ఇలా భిన్నాభిప్రాయాలు నెలకొన్న నేపధ్యంలో దేశ అత్యున్నత న్యాయ స్థానం ఈ విషయం మీద దాఖలైన పిటిషన్లను విచారించి తాజాగా తీర్పు వెలువరించింది.తలగించాల్సిందే:జనాలు ఎక్కువగా ఉండే ఆసుపత్రులు రైల్వే స్టేషన్లు బస్టాండ్లలో వీధి కుక్కలను లేకుండా చూడాలని సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొంది. ఒకవేళ అక్కడ కనిపిస్తే కనుక వాటిని షెల్టర్ హోం లకు తరలించాలని ఆదేశించింది. అంతే కాదు పాఠశాలల వద్ద కూడా వీధి కుక్కలు ఉండకుండా చూసుకోవాలని కనిపిస్తే తరలించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది.అందరూ అమలు చేయాలి:విద్యా సంస్థలతో పాటు క్రీడా ప్రాంగణాలు ఇతర పబ్లిక్ ప్రదేశాలలో వీధి కుక్కలు కనిపిస్తే వాటిని అక్కడ నుంచి షెల్టర్లకు తరలించాలని కోరింది. అవసరం అయితే విద్యా సంస్థల వద్ద కంచెలు ఏర్పాటు చేసి వీధి కుక్కలు చొరబడకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. వీధి కుక్కలను పట్టుకోవడంతో సరిపోదని వాటిని షెల్టర్లకు తరలించడం కూడా బాధ్యతగా భావించాలని సూచించింది.తనిఖీలు తప్పనిసరి:వీధి కుక్కలు పబ్లిక్ ప్లేస్ లలో కానీ ప్రైవేట్ ప్లేస్ లో కానీ తిరగకుండా నిరోధించేందుకు ఎప్పటికప్పుడు తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది.ఈ విషయంలో అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని కోరింది.జంతు ప్రేమికుల స్పందన:ఇక ఆ మధ్యన సుప్రీం కోర్టు ఢిల్లీలో ఉన్న వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఇచ్చిన ఆదేశాల మీద జంతు ప్రేమికులు అయితే ఆందోళన నిర్వహించారు. మూగ జీవులను రక్షించాలని కోరారు. చాలా మంది ప్రముఖులు సెలిబ్రిటీస్ కూడా ఈ విషయంలో తమదైన స్పందనను వ్యక్తం చేసారు. ఇపుడు సుప్రీంకోర్టు ఇపుడు దేశవ్యాప్తంగా వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని తప్పించి రోడ్ల మీద తిరిగేలా చేయవద్దు అని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించిన నేపధ్యంలో జంతు ప్రేమికులు ఎలా రియాక్ట్ అవుతారో చూడాల్సి ఉంది.

# నేను బెంజిలో తిరిగిన గంజికే కనెక్ట్ అవుతా: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 9 : ఒకప్పుడు గంజి తాగి బతికిన వాళ్ళు నేడు బెంజ్ కార్



లో తిరుగుతూ ఒకప్పటి తమ స్థాయిని సైతం మర్చిపోవడం కామన్ గా మారిందాన్ని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. ఆదివారం సంగారెడ్డిలో ఆయన మాట్లాడుతూ... కష్టపడిన రోజులను నెమరేసుకుంటూ గంజి బెంజి కథను చెప్పారు. ఒకప్పుడు గంజి నీళ్లు తాగిన వాళ్ళు తర్వాత రోజుల్లో బెంజ్ కార్ లో తిరుగుతూ తమ స్థాయిని మర్చిపోవడం సర్వసాధారణమైపోయిందని ఇదే ఇప్పుడు రాష్ట్రంలో దేశంలో కామన్ గా మారిందని నవ్వుతూ చమత్కరించారు. కానీ తన జీవన విధానాన్ని తెలుపుతూ తాను ఒకప్పుడు గంజి నీళ్లు తాగాలని బెంజి ఎక్కిన గంజికే కనెక్ట్ అవుతానని కరాకండిగా తేల్చి చెప్పారు. ఇష్టం లేకున్నా బెంజి ఎక్కుతానని కానీ గంజికే ఎక్కువ కనెక్ట్ అవుతానని జగ్గారెడ్డి కథలో ఉదాహరించారు. ప్రతి ఒక్కరు నాటి నేటి స్థాయిలను మర్చిపోవద్దని హితవు పలికారు.

# ప్రజలందరి భాగస్వామ్యంతో తెలంగాణ సాధించుకున్నాం: తెలంగాణ జన సమితి అధ్యక్షులు కోదండరాం

సూర్యాపేట,భారత శక్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 9:ప్రజలందరి భాగస్వామ్యంతో తెలంగాణ సాధించుకున్నాం అని తెలంగాణ జన సమితి అధ్యక్షులు కోదండరాం అన్నారు.సూర్యాపేటలోని తిరుమల గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ జన సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యువజన సమితి నాయకులు నారబోయిన కిరణ్ అధ్యక్షతన నిర్వహించిన సామాజిక తెలంగాణ బీసీ రిజర్వేషన్లు ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంపై జరిగిన సదస్సులో ప్రధాన వక్తగా పాల్గొని ఆయన మాట్లాడారు.సదస్సు లో ప్రారంభంలో మహాత్మా జ్యోతిబపులే,బి ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలవేశారు. తెలంగాణ ప్రజలు ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం వర్గాల నుండి తెలంగాణ ఆధిపత్యం వర్గాలకు అధికార బదలాయింపు కొరకు కాదని ప్రజలందరికీ భాగస్వామ్యం కల్పించడం కొరకు సాధించుకున్నామని ఆ దిశగా అడుగులు వేయడమే తెలంగాణ ప్రజల యొక్క కర్తవ్యం అని అన్నారు.బీజేపీ మొదటి నుంచీ కుల గణనకు వ్యతిరేకమని, రాష్ట్ర ప్రభుత్వం కుల గణన ప్రారంభించడం హర్షించదగ్గ విషయం అని తెలిపారు. అందరూ ఐక్యంగా పోరాడి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు సాధించాలన్నారు.ప్రజలకు కావలసింది ఉచిత పథకాలు కాదు సమానత్వం,ఆత్మగౌరవం అన్నారు.రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టాలు, ఆర్డినెన్సులను గవర్నర్లు ఆమోదంతెలపకపోవడందురదృష్టకరమన్నారు.రిజర్వేషన్లు 50 దాటొద్దు అనేది సుప్రీం కోర్టు తీర్పు కాదని,1931 బీసీ సెన్సస్, 1961 సెన్సస్, 1979 మండల కమిషన్ రిపోర్టులను పరిగణనలోకి తీసుకొని అప్పటి పరిస్థితుల్లో కోర్టు ఆ అభిప్రాయం వ్యక్తం చేసిందని చెప్పారు. రిజర్వేషన్లు సవరించుకోవచ్చుని మండల కమిషన్ రిపోర్టులోనే ఉందన్నారు. రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి న్యాయ సమీక్ష నుండి రక్షణ కల్పించాలి అన్నారు.ప్రజలు ఎన్నుకున్న శాసనసభ చట్టం చేసి పంపితే దాన్ని తిరస్కరించే అధికారం గవర్నర్లకు లేదని,గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ఏజెంట్లుగా వ్యవహరిస్తూ ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారని పేర్కొన్నారు.సామాజిక అసమానతలను నిర్మూలించడంలో రిజర్వేషన్లు కీలక సాధనమని,తెలంగాణ జన సమితి పార్టీ ఏర్పడినదే సామాజిక ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసం అని పేర్కొన్నారు.పదేళ్ల టీఆర్ఎస్ పాలనలో బీసీలకు అన్యాయం జరిగిందని, ఉన్న రిజర్వేషన్లను కూడా తగ్గించారని విమర్శించారు. రాబోయే నవంబర్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా సదస్సులు, సేమినార్లు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కలిగిస్తామని,డిసెంబర్‌లో హైదరాబాద్‌లో భారీ ర్యాలీ, జనవరిలో ఢిల్లీలో దీక్షలు, ధర్నాలు నిర్వహిస్తామని ప్రకటించారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. ధర్మార్జున్ మాట్లాడుతూ బిజెపి నాయకులు ఇక్కడ మద్దతు తెలపడం కాదు ఢిల్లీలో ఉన్న పార్టీ వైఖరిందో చెప్పే విధంగా అల పార్టీ నాయకత్వం మీద ఒత్తిడి తేవాలని గతంలో తెలంగాణ బిల్లు కొరకు కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ మెట్ల మీద నిరసన చెప్పారని అదే తరహాలో నేడు బిజెపి ఎంపీలు ఢిల్లీలో పోరాటం చేయాలని అన్నారు. బీసీ రిజర్వేషన్ సాధన కొరకు వివిధ పాయలుగా జరుగుతున్న ఉద్యమం సమన్వయంతోటి సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్ ధ్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు నాగరాజు గౌడ్ బీసీ జేఏసీ కన్వీనర్ చనమల నరసింహ లీగల్సెల్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ నాయక్ విద్యార్థి జన సమితి జిల్లా



అధ్యక్షులు బొమ్మగాని వినయ్ గౌడ్ యువజన సమితి జిల్లా కార్యదర్శి నాలుగు నాయక్ రైట్ జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ పార్టీ జిల్లా నాయకులు సుమన్ నాయక్ బిసి సెల్ జిల్లా నాయకులు పిట్టల మురళి పట్టణ మైనార్టీ ఎస్టీ సెల్ కన్వీనర్ దేవత సతీష్ నాయకులు భాష బోయిన వేణు జువారి సతీష్ లోకేష్ భరత్ నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సదస్సు పలు తీర్మానాల్ని ఆమోదించింది. తీర్మానాలు కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలి.రాబోయే శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపచేయాలి.బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ ఉద్యమ రీతిలో ఐక్య ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలి.

రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర పాలకులతో చర్చించాలని అన్నారు.

# ఆహార భద్రత తోనే ఆకలి చావులఅంతం

ప్రపంచ మానవాళికి ఆహారభద్రత సమస్యగా పరిణమించింది. ఒక వైపు కరోనా మహమ్మారి మరొకవైపు పర్యావరణ సంక్షోభం దీనికి తోడు అనేక దేశాలలో అంతర్గత యుద్దాలు వెరిసి ఆకలి చావులు పెరుగుతున్నాయి. పలు దేశాలలో కరువు కరాల నృత్యం చేస్తూ ఎంతో మందిఆకలి చావులకు బలై మరణిస్తున్నారు.ఆక్స్ఫామ్ నివేదిక ఆకలి చావులు

ప్రపంచవ్యాప్తంగా ఆకలి చావులు పెరుగుతున్నాయి. కోవిడ్ మరణాల కంటే ఆకలి చావుల సంఖ్య ప్రభుత్వాలకు సవాలుగా పరిణమించింది .ప్రపంచములో రాజకీయ అస్థిరత ఉన్న దేశాలలో ఆకలి చావులు అధికంగా ఉన్నాయని. పలుదేశాల్లో రాజకీయ సంక్షోబాలు—ాజకీయ అస్తిరతర రాజ్యమేలడం వల్లపేద దేశాల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని కరోనా వైరస్ ప్రభావం తో పరిస్థితులు మరింత దిగజారాయని పేదరిక నిర్మూలన కోసం కృషి చేసే ఆక్స్ ఫామ్ సంస్థ బాధా కరమైన విషయాలను వెల్లడించింది. ఆకలి కారణంగా ప్రపంచంలో ప్రతి నిమిషానికి 11 మంది చనిపోతున్నారని ప్రకటించింది.గత యేడాది తో పోలిస్తే ఆకలితో మరణించిన వారి సంఖ్య6 రెట్లుఎక్కువగ వుంది అని అంచనా వేసింది.ది హంగర్ ముల్టిప్లయిస్ అనే పేరుతో నివేదికను విడుదల చేసింది.


2021 ప్రకారం ప్రపంచ జనాభాలో 10% జనాభా పోషకాహారలోపముతోబాధపడుతున్నరు. 30 శాతం జనాభాకు తగిన ఆహారం దొరకడం లేదు. అదనంగా 11 కోట్ల ప్రజలు ఆకలి కోరల్లో చిక్కుకున్నారని .ప్రజా పంపిణీ వ్యవస్థ వైఫల్యం.లోప భూయిష్టమైన ఆహార భద్రత విధానంనిరుద్యోగం పెరగడం .ఆహార కొరత పెరగడం గత ఏడాదితో పోలిస్తే ఆకలితో మరణించిన వారి సంఖ్య అధికంగా ఉన్న విషయాన్ని వెల్లడించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 15 కోట్ల ప్రజలు ఆహారం లభించక ఇబ్బందులు పడుతున్నారని నమోదైంది .గత యేడాది కంటేఇది రెండు కోట్లు ఎక్కువ. కొన్ని దేశాల్లో ప్రజలు తీవ్ర సంక్షోభంలో ఉన్నారు. అంతర్గత రాజకీయ పరిస్థితుల వల్ల ఎక్కువమంది సంక్షోభం ఎదుర్కొంటున్నారు .

పోషకాహార లోపం దేశములో2021బి22లో315 టన్నుల.రికార్డ్ స్థాయి ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగింది. .ఆహారధాన్యాల ఉత్పత్తిలో భారత దేశం స్వయం సమృద్ధి దశకు చేరిన పోషకాహార లోముతో బాధపడుతున్న జనాభా2018 లో13.8 శాతం ఉండగా2020 నాటికి15.3 శాతానికి క్రమంగా పెరుగుతూ వుంది. ఆహారధాన్యాల ఉత్పత్తిలో మిగులు సాధించినప్పటికీ నిరుద్యోగం పేదరికం వల్ల ప్రజల కొనుగోలు శక్తి ఆశించిన మేరకు పెరగలేదు.కొనుగోలు సామర్థ్యం కొరవడింది.పోషకాహారం లోపమువల్ల ఆకలి చావులు పెరుగుతున్నాయి.

భారత దేశములో దాదాపు14 శాతం(,190 మిలియన్స్) ప్రజలు పోషకారం లోపముతో 5 యేండ్ల లోపు వయస్సు వున్న పిల్లలు 20 శాతం తక్కువ బరువుతో వున్నారు.52 శాతం 15బి49 యేండ్ల లోపు మహిళల్లో రక్తహీనతతో సతమత మౌతున్నారని అంచనాలు తెలుపుతున్నాయి. లిప్రపంచ ఆకలి సూచీ భారత్ స్థానంలిప్రపంచ ఆకలి సూచీ ప్రకారం 2021లో 116 దేశాల్లో ఆకలి సూచికలో భారతదేశం స్థానం అట్టడుగు 101 స్థానములో వుండటం విచారకరం.2020 లో భారత్ స్థానం 94 వుండగా 2021 నాటికి 101 స్థాయికి దిగజారింది.

శ్రీలంక 65 వ స్థానం బంగ్లాదేశ్ 76 వ స్థానం పాకిస్థాన్ 92 స్థానములోవుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 15.5 కోట్ల మందిఆహార సంక్షోభం లో బతుకుతున్నారని .ఈ సంఖ్య గత ఏడాదితో పోలిస్తే రెండు కోట్లు ఎక్కువ అని కరోనా కారణంగా వచ్చిన లాక్ డౌన్ కూడా ఆహార సంక్షోభానికి కారణమైందని అధ్యయనంలో తేలింది. .కరోనా కారణంగా ఆర్థిక వ్యవస్థ పతనం కావడం ఆకలి చావులుకు కారణంగా పేర్కొంది .

ఆఫ్ఘనిస్తాన్ " దక్షిణ సూడాన్ సిరియా యేమన్ లాంటి యుద్ద



సంక్షోభాలు వున్నదేశాలలో ఆకలిచావుల తీవ్రత ఎక్కువగాఉందని ఆక్స ఫామ్ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది.

ప్రతిరోజు 5 లక్షల మందికి తిండి దొరకని పరిస్థితి ప్రపంచంలో నెలకొని వుందని అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఆకలి విపత్తు ఇలాగే కొనసాగకుండ ప్రభుత్వాలు సత్వర చర్యలు చేపట్టాలి. ఆకలిపై పోరాటం చేస్తున్న సంస్థలకు అవసరమైన సహాయం అందించాలని .ఆకలితో అలమటిస్తున్న వారికి సహాయం చేరువయ్యేలా చూడాలని ఆకలిని తగ్గించడానికి యున్ చేస్తున్న ప్రయత్నాలకు నిధులు సమకూర్చాలని ప్రపంచ దేశాలకు పిలుపు నిచ్చింది. గ్లోబల్ వార్మింగ్ పర్యావరణ సంక్షోభాలు ప్రకృతి విపత్తులు మరియు కరోనా మహమ్మారి ప్రపంచంలో సంభవిస్తున్న ఆర్థిక పరిణామాలు ప్రపంచం లో ఆహారపదార్థాల ధరలు 40 శాతం పెరుగుదలకు కారణమైంధని పేర్కొంది. ఈ ఆర్థిక స్థితి ప్రకృతి ఉప్పెన .10 లక్షల మందిని ఆకలిలోకి నెట్టివేసిందని నివేదికలో తెలిపింది.

ఆయా దేశాల్లోని రాజకీయ అస్థిరత అంతర్గత రాజకీయ పరిస్థితుల వల్ల ఎక్కువ మంది ఆకలి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు .వాతావరణ విపత్తుల వల్ల5'20 లక్షల మంది కటిన పేదరికంలో కి నెట్ట వేయ బడ్డారు.కొన్ని దేశాలలో జరుగుతున్న అంతర్గత యుద్దాలు ఒక వైపు కరోనా మహమ్మరి విజృంభణ మరో వైపు ప్రపంచ దేశాలకు సవాల్ గ పరిణమించింది. ప్రపంచ.వ్యాప్తంగా సైనిక సామర్థ్యాన్ని పెంచుకునేందుకు తమ తమ బలగాల పటిష్టతకు కోసం 5100 కోట్ల డాలర్లు కర్చు చేశాయనీ ఆక్స్ఫామ్ నివేదిక తెలిపింది.ఇది ప్రపంచంలో పేదల ఆకలి తీర్చడానికి ఐక్యరాజ్య సమితికి ఖర్చు చెయ్యాలనుకున్నా దాని కన్నా 6 రేట్లు ఎక్కువని ఆక్స్ఫామ్ సంస్థ వెల్లడించింది. అంతర్గత యుద్దాలు ఉగ్రవాదం విచ్చిన్న కర పరిస్థితులు ఆహార సంక్షోభానికి శాపంగా పరిణమించాయని అక్స్ ఫామ్ సంస్థ తెలిపింది. రాజకీయ సంక్షోభాలు పేదరికం అంతర్గత రాజకీయ సంక్షోభాలు వల్ల ప్రజలు పేదవాళ్ళు అవుతున్నారని యుద్ధాల వల్ల పేదలు నష్టపోతున్నారని నివేదికలో వెల్లడించింది. ధనిక దేశాలు ఐక్య రాజ్య సమితి ద్వార ఆకలిచావులు ఎక్కువగా వున్నదేశాల్లోని ప్రజలకు ఆర్థిక సహాయం అందించాలని ఆక్స్ఫామ్సంస్థ సూచించింది ఈ సూచననుమన్నించి మానవతా దృక్పథంతోఆకలి చావులను అరికట్టే కార్యాచరణకు ధనిక దేశాలు పూనుకొంటాయని ఆశిద్దాం. సుప్రీం కోర్టు సూచన ఆహారభద్రత ప్రభుత్వం ప్రజలకు ఆహార భద్రత కల్పించడం ప్రాథమిక బాధ్యత అన్న సుప్రీం కోర్టు సూచన పాటించాలి.భారత దేశంలో ఇక ముందు ఆకలి చావులు ఉండకూడదని . ప్రజల సంక్షేమంప్రభుత్వాల రాజ్యాంగపరమైన బాధ్యత అని.కమ్యూనిటీ కిచెన్లపై ప్రణాళిక రూపొందించి వెంటనే రిపోర్ట్ఇవ్వాలని దేశ అత్యున్నత ధర్మాసనం సుప్రీంకోర్టుకేంద్ర ప్రభుత్వానికి సూచించింది.ఇక నుంచి ఆకలి చావులు అనే మాట వుండకూడదని దీని కోసం కేంద్రంఎటువంటి ప్రణాళికలు అమలుచేస్తున్న ది వెంటనే తెలుపాలని సుప్రీం కోర్టు సూచించింది. ప్రజా సంక్షేమం రాజ్యాంగ పరమైన బాధ్యత. కమ్యూనిటీ కిచెన్ ల పై 3 వారాల్లోగా ప్రణాళిక రూపొందించి కోర్టు కు అంద చెయ్యాలని సూచించింది. ఇది కేంద్రానికి చివరి అవకాశం అని .ఆకలి చావులు శాశ్వతంగా నిర్మూలనకు దేశ వ్యాప్త ప్రణాళిక వుండాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయం తీసుకోవాలని సిజేఐ నేతృత్వంలో జస్టిస్ బోప్పన్న హిమాకొహిలి తో కూడిన త్రిసభ్య ధర్మాసనం అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ కు సూచించింది. ఆకలితో అల్లాడుతున్న ప్రజలు నివసించే ప్రాంతాలు గుర్తించి వారి కి సకాలములో ఆహార ధాన్యాలు అందించాలని ఆకలితో ఎవ్వరూ చనిపోకూడదని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ ఏన్ వి రమణ అభిప్రాయపడ్డారు. ఎన్నికల వేళ కమ్యూనిటీ కిచెన్లను ప్రకటించిన కేంద్రం కార్యాచరణకు ఉపక్రమించాలని ఆకలిని ఎదుర్కోవడానికి జాతీయస్థాయిలో మోడల్ స్కీమ్ ఏర్పాటు చెయ్యాలని సూచించింది. మంగళ వారంనాటి విచారణ సందర్భంగా ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలో ధర్మాసనం ప్రభుత్వాల తీరు పైతీవ్ర అసహనంవ్యక్తం చేసింది.ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత చట్టాన్ని అమలు చెయ్యాలి. ఆహారభద్రత అంటే బియ్యం గోధుమలు ఇవ్వడంకాదు. దారిద్ర్యరేఖకు కింద.వున్నవారికి పౌష్టికాహారం అందించడం.అప్పుడే పేద వర్గాలలో ఆహార భద్రతఏర్పడుతుంది. ఆహార వ్యవసాయ సంస్థ ప్రకారం ప్రజలు ఆరోగ్య దాయక జీవితాన్ని పొందేందుకు అవసరమైన తగినంత సురక్షిత పౌష్టికాహారం ప్రజలందరికీ అందించాలి.అన్ని కాలాల్లో ఆర్థికంగా భౌతికంగా అందుబాటులో ఉంచడముతో పాటుప్రతి వ్యక్తి సురక్షితమైన పౌష్టికాహారాన్నీ కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత కలిగి వుండాలి. శరీరానికి తోడ్పడే మాంసకృతులు విటమీన్స్' మినరల్స్ వంటి పౌష్టికాహారం అందరూ పొందాలి.నేటికి దేశ జనాభాలో 14 శాతం అల్పపౌష్టికాహారం తో బాధపడుతున్నారు. 15బి 45 వయసులో వున్న మహిళలు 34-7 శాతం రక్త హినతతో బాధపడుతున్నారు. గర్భిణీల్లో రక్త హీనత తక్కువ బరువుతో శిశుజననాలుపౌష్టికాహార సంక్షోభానికి సంకేతాలు అని ప్రముఖ ఆర్థిక వేత్త "జీన్ డ్రిజ్" అభిప్రాయపడ్డారు. .పిల్లలకు మధ్యాహ్నం భోజనం అందించాలి.ప్రభుత్వ పంపిణీ విధానం ద్వారాపేదలకు ఆహార ధాన్యాలు సబ్సిడీ ధరలకు సరఫరా చేయాలి. అంగన్వాడీ పిల్లలకు పోషకాహారం సరఫరా చేయాలి .అణగారిన వర్గాల కు గిరిజనుల కు మురికి వాడల్లో నివసించే వారికి ప్రభుత్వ పంపిణీ విధానం ద్వారా ఆహార ధాన్యాలు అందజేయాలి.ఆర్థిక వ్యవస్థలో ఉపాధి అవకాశాలు విస్త రించాలి. కొద్ది మందికిమాత్రమే జీవనోపాధి గౌరవప్రదమైన జీవితం అవకాశాలు వుండడం సరైంది కాదు. ఉపాధి ఉత్పత్తి ఉత్పాదకత ఆదాయ సృష్టి జరగాలి. జీవనోపాధి ఆహారభద్రత కలిపించాలి. జాతీయ ఉత్పత్తిపంపిణీ పథకం అమలుకుప్రభుత్వం చర్యలు తీసుకోవాలి .ఆహారాన్ని వృధా చేయకుండా ఆకలితో ఉన్న వారిని గుర్తించి వారికి ఆహారం అందించాలి. పేదలకు పోషకాహారం ఆరోగ్య సేవలు ఉచిత విద్యా అందించాలి .ఆహార భద్రత చట్టాలను సమర్థవంతంగా అమలు చెయ్యాలి. పాలనలో పారదర్శకత జవాబుదారీతనం బలోపేతం కావాలి .సుపరిపాలన పేదల ముంగిట్లోకి అందించాలి.సామాజిక భద్రతకు తగిన వ్యవస్థలు అమలులో ఉన్న అణగారిన వర్గాలకు చెందిన వారికి సదుపాయాలు అందడం లేదు సామాజిక భద్రత పథకాలను సవ్యంగా అమలు చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలి. పట్టణ ప్రాంతాల్లో కమ్యూనిటీ కిచెన్స్ఏర్పాటు చేయడ%శీ% గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పంపిణీ విధానం ద్వారా ఆహార ధాన్యాలు అందజేయాలి అలాగే సెలవుల్లో కూడా మధ్యాహ్నం భోజనం చేయాలి.వనరుల సమాన పంపిణీపై జాతీయ స్థాయిలో చర్చలు జరగాలి.ప్రభుత్వ పాలకులు పాలనా యంత్రాంగం రాజకీయ పార్టీలు చేయవలసింది ఆకలిచావుల మీద చర్చించకుండా ఆకలిని తీర్చే ప్రణాళికలతో పోటీ పడాలి.చర్చలతో కాలాన్ని వృధా చేయొద్దు . పేదలకుఉచితఆరోగ్య సేవలు అందించాలి.ప్రజలకు అందుబాటులో ప్రజా పంపిణీవ్యవస్థను పటిష్టం చెయ్యాలి.అందరికీ ఆరోగ్యం ఉచిత విద్య ఉపాధి కల్పన స్వయం ఉపాధి అవకాశాలను విస్తృత పరచాలి.వ్యవసాయ రంగంలో స్వావలంబనగ్రామీణాభివృద్ధి చిన్న లఘు పరిశ్రమల స్థాపన అభివృద్ధి కి ప్రభుత్వం కృషి చెయ్యాలి ఉపాధి హామీ పథకం అమలు చేయడం మౌలిక సదుపాయాలు కల్పన ఆదాయ సృష్టి జీవన ప్రమాణాలపెరుగుదలతో ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి ఉత్పాదకత పెరిగి వృద్ధి అభివృద్ధి తో జాతియాదయ అభివృద్ధికి దోహదపడే సూక్ష్మ.స్థూల విధానాలు ఆర్థిక ప్రణాళికల అమలుతో వ్యవసాయ పారిశ్రామిక సేవా రంగాలలో ఆత్మనిర్భరత కేంద్ర బిందువుగ ఆహార భద్రత వ్యవస్థ పరిపుష్టికి దీర్ఘకాలిక కార్యాచరణ వ్యూహాలతో బహుముఖ చర్యలతో ఆకలి చావులు లేని స్వయం స్వమృద్ధ భారత్ ఆవిర్భానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆశిద్దాం.

నేదునూరి కనకయ్యఅధ్యక్షులుతెలంగాణ ఎకనామిక్ ఫోరంసామాజిక ఆర్థిక అధ్యయన వేదిక 9440245771 హైదరాబాద్

# గణితం, గణాంకాలలో మదన్ కుమార్ కు పీహెచ్డీ



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 9 :

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత, గణాంక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి ఆర్. మదన్ కుమార్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. సాగదీసిన షీట్ పై మాగ్నెటో హైడ్రోడైనమిక్ (ఎంహెచ్ డీ) నాన్-న్యూటోనియన్ నానోఫ్లూయిడ్ ప్రవాహంలో ఉష్ణ బదిలీ లక్షణంపై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. శ్రీనివాసరాజు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ మదన్ కుమార్ అయస్కాంత, పోరస్ మీడియా ప్రభావాల కింద నానోఫ్లూయిడ్ డైనమిక్స్ యొక్క అధునాతన నమూనాలపై అధ్యయనం చేసినట్టు తెలియజేశారు. అదిక్రాస్-డిఫ్యూజన్ ప్రభావాలు, జిగట దుర్వినియోగం, క్రియాశీలత శక్తి, ఉష్ణ వికిరణం, రసాయన ప్రతిచర్యలను పరిశీలిస్తుందన్నారు. బలమైన సంఖ్యా పద్ధతులను ఉపయోగించి సాగదీసిన షీట్ లపై ద్రవం-ఉష్ణ పరస్పర చర్యలపై కొత్త అంతర్దృష్టులను పొందడానికి జెఫ్రీ, విలియమ్సన్ ద్రవ ప్రవాహ నమూనాలను ఉపయోగిస్తుందని తెలిపారు. ఈ పరిశోధనా ఫలితాలు బయోమెడికల్ ఇంజనీరింగ్, మైక్రోఫ్లూయిడిక్స్, నానోటెక్నాలజీ, ఎనర్జీ స్టోరేజ్, ఆప్టికల్ పరికరాలు, స్మార్ట్ మెటీరియల్స్ లో ఉపయోగించగల అవకాశాలు కలిగి ఉన్నట్టు వివరించారు.ఈ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రజాస్వామ్యానికి "ఓటే" ఊపిరి

(నవంబర్ 11 జూబ్లీహిల్స్ శాసనసభకు జరగనున్న ఉప ఎన్నికల సందర్భంగా ఓటరు చైతన్యం కొరకు రాసిన కవిత)



ఓటు బుల్లెట్ కంటే బలమైంది
ఓటు మనతల రాతలు
మార్చే ఆయుధం
అవినీతి అక్రమార్కుల
రౌడీ మాఫియా
ధనస్వాముల నేర
చరితుల రాజకీయాలకు
ఓటుతో వేటు వేయాలి
ఓటరు తనతల రాతను
మార్చి రాసే విశ్వసనీయ
అభ్యర్థులకు ఓటు వేసి
సామాజిక ఆర్థిక సాంస్కృతిక
వికాసానికి మార్గదర్శిగా
నిలువాలి

అభివృద్ధిచేసే సత్తా ప్రగతి శీల
ప్రణాళికలతో ముందుకు వచ్చే
అభ్యర్థులకు ఓటరు మదిలో
చోటు ఇవ్వాలి

రాజకీయ అవినీతి
అక్రమాలకు ఓటుతో
వేయాలి వేటు.
ఎన్నికల్లో ఓటర్లే దేవుళ్ళు
భీరు బిర్యానీ కానుకలకు
లొంగక హామీలు అమలు
చేసి అభివృద్ధికి పాటుపడే
ఉత్తమ అభ్యర్థులకు
ఓటు వేసి ప్రజాస్వామ్య
రక్షకులుగా నిలువాలి

మాయ మాటలు టక్కు
టమార విద్యలతో నూతన
జిమ్మిక్కుల తో నీచెంతకు...
వచ్చే నాయకుల నయా
వంచనకు పొంగిపోకు
మందు విందు వినోదాలకు
లొంగి పోయి ఆదమరచి ఓటు
వేస్తే అవినీతి రాజ్యమేలుతుంది

పార్టీలు మారి జెండాలు మారి
బహు రూపాలతో వచ్చే
ఆయారాం గాయరాంలకు
ఓటుతో నిగ్గ తీసిబుద్ధి చెప్పు
అధికారమే ఎజెండాగా
ఎన్నికల్లో గెలుపే
పరమావధిగాపోటీ చేసే
అభ్యర్థులను ఓటుతో
అడ్డుకోవాలి

ప్రభుత్వాల మార్పుకు
ఓటే వజ్రాయుధం
సామాన్యుని సాధికారిత
మహిళా యువజన
సాధికారిత సృష్టికి
ఓటే మూలం

అరాచక అక్రమాల దోపిడి
రాజకీయాల అంతం ఓటరు
పంతం కావాలి
ఓటు చైతన్య దీపిక కావాలి..
ఓటు చట్ట సభలకు నిజమైన
ఊపిరి...ఓటు ప్రభుత్వాల
ఏర్పాటుకు ప్రాణావాయువు..

ఓటు కొరకు ఎందరినో
పరుగులు తీయిస్తావు.
ఎందరినో ఉరికించి
ఊరడిస్తావు...

నచ్చని అభ్యర్థులను ఓడించి
గద్దెని కరిపిస్తావు ప్రజా జీవితం
నుండి బహిష్కరిస్తావు
ఓటరా నీకు నీవే ధీటు

ప్రపంచంలో ఏదీ రాదు నీసాటి
ఏపార్టీ అయిన ఏపాటి
నాయకుడైన ఓటును
అర్థించాల్సిందే

ప్రజాస్వామ్య ప్రపంచాన్ని
నడిపించే నాయకులు
ఓటరుకు సలాం చేయాల్సిందే
ఓటరు నాయకులకు
ఆకర్షణ పుంజం
ఓటే నాయకుల
గుండెల్లో దడ పుట్టిస్తుంది
ఓటరు తీర్పే మార్పుక
నాంది ఓటు బుల్లెట్ కంటె
బలమైనది ఐదేళ్లకు ఒక సారే
కదా నీవు సార్వభౌముడివి

నీ ఓటు నోటుకు నాటుకు
లొంగొద్దు నీఓటు నీచేతిలో
పాశుపతాస్త్రం
మెరుగైన రాజకీయాల కొరకు
నీ ఓటే పునాది ..

పోలింగ్ రోజు ఓటు వేయి
ఐదేళ్ల ప్రగతికి బాటెయ్యి
ప్రభుత్వాలు ఏర్పాటులో
ఓటే వేగు చుక్క

గెలుపు ఓటములు
ఓటరు చేతుల్లోనే ఉంది
మనీ మందు మత్తులో
పడి పోకు ఓటరు
ప్రజల తలరాతలు
మార్చి రాసే విధాత కావాలి
ప్రజాస్వామ్య విలువల
రక్షకుడిగా నిలచిపో

పౌర సమాజం ఉన్నతి
ఉద్ధరణ నీ చేతిలోనే ఉంది..
ఓటరా నీచైతన్యంతో
కుళ్లు కుతంత్ర
రాజకీయాలకు చెల్లు చీటి
ఓటుతో అవినీతికి
వేయాలి వేటు

నేదునూరి కనకయ్య
( నేదునూరి కళ్యాణ్)
ఫ్రీలాన్స్ రైటర్
అధ్యక్షులు సామాజిక ఆర్థిక
అధ్యయన వేదిక &
తెలంగాణ
ఎకనామిక్ ఫోరం
తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
కరీంనగర్
9440245771

# లేవండి! మేల్కొనండి! గమ్యం చేరే వరకూ విశ్రమించకండి!" :: స్వామి వివేకానందుడు

==============================

అపార విశ్వాసం, అనంత శక్తి ఇవే విజయసాధనకు మార్గాలని,సేవకుడిగా ఉండడం నేర్చుకుంటే ,నాయకుడయ్యే యోగ్యత లభిస్తుందని,అఖండమైన ఉత్సాహం,అపరిమితమైన ధైర్యం, అప్రతిహతమైన శక్తి....అన్నింటిని మించి పరిపూర్ణవిధేయత,ఈ లక్షణాలు ఒక వ్యక్తినిగాని,ఒకదేశాన్ని గాని పునరుజ్జీవింప చేయగలవని ఎన్నో మార్లు తెలియచేసిన యువసన్యాసి,యోగిపుంగవుడు స్వామి వివేకానంద.

"నరేన్" గా ముద్దుగా పిలువబడే "నరేంద్రనాథ్ దత్త" తరువాత కాలంలో విశ్వ విఖ్యాత గాంచిన,సింహాసదృశ్యమైన మనో బలానికి ప్రతిరూపమై భారతదేశ యువజనులందరికి ఆదర్శమై నిలిచిన "స్వామి వివేకానంద" గా పేరు గాంచాడు.

ఎందరికో జ్ఞానోదయం కలిగించి ,ఆధ్యాత్మిక ప్రపంచాన్ని పరిచయం చేసి,భారత దేశం అంటే ఒక సంస్కృతి కలిగిన గొప్పదేశం అని విశ్వానికి తెలియ చేసి జులై 4, 1902 న విశ్వాంతరాల్లోకి వెళ్లిన దివ్యజ్ఞాని స్వామిజీ.

కలకత్త నగరంలో విశ్వనాథ్ దత్త ,భువనేశ్వరి దేవి దంపతుల గారాల పుత్రుడుగా జనవరి 12,1863 న జన్మించాడు.చిన్న నాటి నుండి దైవభక్తి,ఏకాగ్రత కలిగి ప్రతి ఒక్కరి మన్ననలు పొందాడు.ఆటలలో,చదువులలో ఏరంగాల్లో అయిన సులభంగా, ఉత్సాహంగా పాల్గొని అందరిలో ముందుండేవాడు. మహాగురువు రామకృష్ణ పరమహంస వద్ద చేరి వారికి ప్రియశిష్యుడుగా మారి,వేదాంత, యోగా ,తత్వశాస్త్రం లలోని అంశాలను ప్రజలకు విడమరిచి చెపుతూ వారిని మానసికంగా సిద్ధం చేసిన మహనీయుడు స్వామిజీ.స్వప్నం లో గురువు పరమహంస గారు ప్రత్యక్షంగా మాతా శారదా దేవి గారి ఆజ్ఞ మేరకు మొదటి సారిగా విదేశాలకు పయనమయ్యాడు.

1893 వ సంవత్సరం, సెప్టెంబర్ 11 వ తేదీ సోమవారం రోజు విశ్వమత మహాసభలు ప్రారంభం అయ్యాయి.ఆ సమావేశాల్లో మాట్లాడేటప్పుడు హృదయాంతరాలలో నుంచి వచ్చిన విశ్వమానవ సౌభ్రాతృత్వ భావనతో,"నా అమెరికా దేశ సోదర సోదరీమణులారా..."అని మొదలుపెట్టగానే ఆ విశాల సమావేశములో ఉన్న అందరూ లేచి నిలబడి,కరతాళ ధ్వనుల వర్షం కురిపించారు.అప్పటి నుండి ప్రపంచానికి భారత్ యొక్క గొప్పతనం తెలియ వచ్చింది.

భారతదేశంలో స్వామి వివేకానంద పేరు తెలియని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు. ఆధునిక యుగపు గొప్ప ఆధ్యాత్మిక వేత్తలలో ఆయనొకరు. 1893లో జరిగిన చికాగో సర్వమత సభలలో చేసిన ప్రసంగాలు మరియు తర్వాత నాలుగున్నర సంవత్సరాల పాటు అమెరికా, ఇంగ్లాండులో చేసిన ఉపన్యాసాల ద్వారా ఆయన భారతదేశానికి సంబంధించి అప్పటి వరకూ పాశ్చాత్యులకు ఉన్న భావనను మార్చడంలో చాలా వరకూ విజయం సాధించారు. ఆధ్యాత్మికతకు, సామరస్యానికి, గొప్ప సంస్కృతికి భారతభూమి నిలయమని వారు గ్రహించేలా చేశారు. భారతదేశంపై వారికి గల అభిప్రాయాన్ని మార్చి వారి మనస్సులో భారతదేశాన్ని గొప్పగా భావించేలా చేశారుబీ ఉన్నత స్థానాన్ని కల్పించారు.

భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత తన అద్భుతమైన వాగ్ధాటితో, ప్రసంగ పరంపరలతో భారతావని ఉత్కృష్ట సంస్కృతి, వారసత్వ సంపద గురించి ప్రజలకు తెలియజేసి వారిలో చైతన్యాన్ని నింపారు. ఆత్మ విశ్వాసాన్ని ఆశావహ దృక్పథాన్ని పెంపొందించి అణగారిన జనులను ఉద్ధరించాల్సిన తక్షణ అవసరాన్ని తెలియజేశారు. ఆధునిక భారతదేశంలో పేదల అభ్యున్నతికై పాటుపడమని బోధించి వివిధ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ప్రప్రథమ యతివరేణ్యుడు వివేకానంద.



రామకృష్ణ మఠం స్థాపించి అందరి అవసరాలకు బాసటగా నిలిచిని గొప్ప వ్యక్తి స్వామిజీ.

అమెరికా మరియు విదేశాల్లో తన ప్రసంగంద్వారా ఎందరినో ఆకట్టుకొని భారతదేశమునకు తిరిగి వచ్చిన తర్వాత ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ...నా ప్రియాతిప్రియమైన ప్రజలారా... భారతదేశ ముద్దు బిడ్డలారా.... అమృత పుత్రులారా... ఋషి బిడ్డలారా... నేడు జరుగుతున్న సన్మానమూ, మర్యాద, ఏ రాజకీయ నాయకుడికో, ఏ వ్యాపారవేత్తకో, ఏ కళాకారుడికో, ధనవంతుడికో జరుగుతున్నది కాదు. రేపటి రోజు భోజనం ఉంటుందో లేదో తెలియని, భగవంతుడినే హృదయంలో నింపుకుని జీవించే ఒక దేశ దిమ్మరియైన సన్యాసికి జరుగుతున్నది. భారతదేశం యొక్క ఆయువు పట్టు దాని ఆధ్యాత్మికతా, భగవన్మయ జీవనంలోనే ఉన్నదనదానికి ఇంతకంటే గొప్ప నిదర్శనం మరొకటి ఉండదు. లేవండి! మేల్కోండి! మనుష్యులవ్వండి! మనం బానిసలమనీ, ఎందుకూ పనికిరాని వారమనీ, మన పూర్వీకులు చెప్పినదంతా హాస్యాస్పదమనీ ఎవడో బయటివాడు వచ్చి చెప్పగానే నిజమేనని నమ్మి వాడి బూట్లు తుడవడం ఎంత హేయం! ఎంత దయనీయం! నా భారతదేశ యువ కిశోరాల్లారా, నా ఆశలన్నీ మీ పైనే ఉన్నాయి. మీరు అనంత శక్తి సంపన్నులు. దేన్నైనాసరే సాధించే శక్తి యుక్తులు మీలో ఉన్నాయి. మీరు గొర్రె లని అనుకోవద్దు. సింహాలు మీరు. మీరు లేచి జూలు విదిలించి ఒక్కసారి గాండ్రిస్తే కుయుక్తులతో నక్కలవలె చుట్టు ముట్టిన బలహీనతలన్నీ దుష్ట శక్తులన్నీ మిమ్మల్ని చూసి, మీ సింహ నినాదం విని, గుండెలు జారి పారిపోతాయి. లేవండి! మేల్కోండి! గమ్యం చేరేవరకూ విశ్రమించకండి! అని పిలుపునిచ్చారు.

లక్ష్యంపై ఉన్నంత శ్రద్ధాశక్తులను, లక్ష్య సాధనలో సైతం చూపించడమే విజయారహస్యం అని,మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించండి.బలహీన పరిచే ప్రతి ఆలోచననూ తిరస్కరించండని ఎన్నోమార్లు యువతకు వెన్నుతట్టిన యువ నేత స్వామి వివేకానంద.మీరెలా ఆలోచిస్తే అలాగే తయారవుతారని,బలహీనులమని భావిస్తే ,బలహీనులే అవుతారని,శక్తిని స్మరిస్తే శక్తిమంతులు అవుతారని యువతకు సందేశమిచ్చిన హిందు కర్మయోగి స్వామి వివేకానంద..సమస్త శక్తి మీలోనే ఉంది.అసమర్థులమని భావించకండి. మీరు ఏమైనా చేయగలరు,అన్నింటిని సాధించ గలరని ప్రతి రంగంలో ముందు ఉండాల్సింది యువతేనని ప్రోత్సహిస్తూ వారిని కార్యోన్ముఖులను చేసాడు స్వామి వివేకానంద.

"లేచి నిలబడు, ధైర్యం వహించు,

బలవంతుడివికా,భాద్యతనంతా నీ భుజాలపైనే వేసుకొని,నీ విధికి నీవే కర్తవని తెలుసుకో.నీకు కావాల్సిన బలం,సహాయం అంతా నీలోనే ఉంది.అందుకే నీ భవితవ్యాన్ని నీవే నిర్మించుకో" అని యువత శక్తి సామర్థ్యాలను గుర్తింపచేశాడు స్వామి వివేకానంద.బలమే జీవనం,బలహీనతే మరణం.బలం సంక్షేమాన్ని,అంతమే లేని జీవితాన్ని,అమరత్వాన్ని ప్రసాదిస్తుందని,బలహీనత అంతులేని శ్రమను,దుఃఖాన్ని కలిగిస్తుందని అదే బలహీనత మరణమని ఎన్నో మార్లు తన ప్రసంగాల్లో తెలియ చేసిన యోగిపుంగవుడు స్వామి వివేకానంద.

మొదట మన లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలి.తర్వాత దాన్ని ఆచరణలో పెట్టె మార్గాలను అన్వేషించాలని యువకులకు ఉద్బోధ చేసిన గొప్ప వక్త స్వామి వివేకానంద.

దృఢ సంకల్పం, పవిత్ర ఆశయం తప్పక సత్ఫలితాలను ఇస్తాయని,వీటిని ఆయుధాలుగా గ్రహించిన వారు కొద్దిమందే అయినా, అన్ని విఘ్నాలను ఎదుర్కొని నిలువగలిగారని ఎల్ల వేళలా నిలువగలుగతారాని తెలియచేసిన విద్యావేత్త స్వామి వివేకానంద.

ఆధునిక యవతరానికి స్వామీజీ మాత్రమే ఆదర్శం. ఆయన జీవిత కాలం ముప్పై తొమ్మిది సంవత్సరాల ఆరునెలలు. ఇంతటి స్వల్ప జీవితంలోనే ఆయన ఎంతో సాధించారు. మానవాళి సంక్షేమానికి, అభ్యున్నతికి, ఆధ్యాత్మికోన్నతికీ తన యౌవన జీవితంతోనే ఇంతగా కృషిచేసినవారు చరిత్రలో కొద్దిమంది మాత్రమే ఉన్నారు.అందులో ప్రథముడు స్వామి వివేకానంద.భరత మాత దాస్యశృంఖలాలు తెంచడానికి మా దేశపౌరులు సిద్ధంగా ఉన్నారు. స్వాతంత్రం అనంతరం దేశపటిష్ఠత కోసమే తన తపన అని ఎన్నోమార్లు తెలియ చేసిన గొప్ప వక్త మన స్వామిజీ.స్వామీజీ తన జీవితాంతం ఎంతో శ్రమపడి కష్టపడి పని చేశారు. తుదకు స్వామిజీ భౌతిక జీవితం ముగిసింది. కానీ ఆయన పని కొనసాగుతూనే ఉంది. "లేవండి! మేల్కొనండి! గమ్యం చేరే వరకూ విశ్రమించకండి!" అని తన దేశ ప్రజలకి పిలుపునిచ్చారు. ఆయన ప్రసంగాలలో ఉన్న జ్ఞానాన్ని ,ఇచ్చిన ధైర్యాన్ని ఉపయోగించుకొని మొదలైన నవ భారత నిర్మాణం, దేశానికి స్వాతంత్రం రావడంతోనే కాక ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.ఇప్పుడు యువత చేతుల్లోనే మన భవిత ఉన్నదనేది వాస్తవం...ఆధునికత వైపు పరుగులు పెడుతున్న నేటితరం యువత ఆధునికత అంటే నైతిక,ఆధ్యాత్మిక, సామాజిక స్పృహ అనే విలువల పట్ల తిరస్కార భావం కాదని తెలిసుకొని,

భారతదేశ సాంస్కృతి సంప్రదాయాలను తెలుసుకొని,భారతజాతి నిండు గౌరవాన్ని కాపాడుకోవాలన్న తపనతో,ప్రతికులా ప్రాబల్యాలకు లోనుకాకుండా,శక్తిని, ఉత్సాహాన్ని,దేశభక్తిని,ఆత్మవిశ్వశాన్ని కలిగించిన వ్యక్తి స్వామి వివేకానంద అని యువత గుర్తించింది.ఎందరికో జ్ఞానోదయం కలిగించి ,ఆధ్యాత్మిక ప్రపంచాన్ని పరిచయం చేసి,భారత దేశం అంటే ఒక సంస్కృతి కలిగిన గొప్పదేశం అని విశ్వానికి తెలియ చేసి జులై 4, 1902 న విశ్వాంతరాల్లోకి వెళ్లిన దివ్యజ్ఞాని స్వామిజీ.నేను నా శరీరాన్ని వదిలిపెట్టినా,నేను పూర్తిచేయవలసిన కార్యాలను పూర్తి చేసే విదంగా రాబోవు తరాల వారిని కార్యనిర్వహణ కొరకు ప్రేరేపిస్తుంటాను." అని చాలా సందర్భాల్లో ఆశాభావం వ్యక్తం చేసిన మాటను నిజం చేసి ,దేశ అభివృద్ధికి బాటలు వేయవాల్సిన యువత నడుం బిగించాల్సిన అవసరం ఉంది.

గడప రఘుపతిరావు
రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయఅవార్డు గ్రహీత.9963499282

# నేడు సభాభవన్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహణ: డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

వైయస్సార్ కడప,నవంబర్ 09(భారత శక్తి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించు కోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబర్ కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డిఆర్వో కోరారు.

సభాభవన్ లో పిజిఆర్ఎస్ నిర్వహణలి :ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను ఈ సోమవారం సభాభవన్ లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు లినమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చును"ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ " అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారఅర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారుడయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమండయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు.ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆదేశాల మేరకు మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక కఠిన తనిఖీలు

## –జిల్లా వ్యాప్తంగా 46 వాహనాలు సీజ్....!
## –మైనర్ పిల్లలను,తల్లి తండ్రులను కలిపి 70 మందికి కౌన్సిలింగ్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 9 (భారత శక్తి): మోటారు వాహన చట్టం ప్రకారం మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులదే బాధ్యత– జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ హెచ్చరికలిజిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ డా: జి. జానకి షర్మిల, ఆదేశాల మేరకు ఆదివారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించబడింది.ఈ డ్రైవ్‌లో మొత్తం లి46లి మైనర్ డ్రైవింగ్ వాహనాలు సీజ్ చేయబడినవి. మైనర్లు మరియు వారి తల్లిదండ్రులు కలిపి మొత్తం 70 మందికి స్థానికంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం మైనర్ల వాహన నిర్వహణకు వాహన యజమాని (తల్లిదండ్రుల)దే బాధ్యత అని SHO లు హెచ్చరించారు. పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు తల్లిదండ్రులు పూర్తి బాధ్యతను తీసుకోవాలని వారు సూచించారు.ఈ తనిఖీల్లో జిల్లాలో ఉన్న అన్ని స్టేషన్ల HO లు పాల్గొన్నారు.

## నేడు సి పి బ్రౌన్ జయంతి ఉత్సవాలు

వైయస్సార్ కడప,నవంబర్ 9(భారత శక్తి): తెలుగు భాషకు ఎనలేని సేవలు అందించిన సిపి బ్రౌన్ 227 జయంతి ఉత్సవాలను నవంబర్ 10వ తేదీ స్థానిక కలెక్టరేట్లోని సభా భవన్ నందు సాయంత్రం ఐదు గంటలకు ఘనంగా నిర్వహించనున్నట్లు డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ హాజరవుతారని తెలిపారు.

సిపి బ్రౌన్ జయంతి ఉత్సవాల సందర్భంగా బ్రౌన్ గ్రంథాలయంలో పరిశోధకులుగా పని చేయుచున్న డాక్టర్ భూతపరి గోపాల కృష్ణ ''బ్రౌన్ సాహితీ సేవ''అనే అంశంపై,వల్లూరు జడ్పీ హైస్కూల్లో పని చేస్తున్న తెలుగు పండిట్ డాక్టర్ జీవీ సాయిప్రసాద్"బ్రౌన్ ఉద్యోగ ప్రస్థానం జీవితం" అనే అంశాలపై ప్రసంగిస్తారని తెలిపారు. అనంతరం వారిద్దరికీ సత్కారం ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు వారి సిబ్బంది, తెలుగు భాషాభిమానులు, కళాశాల విద్యార్థులు అందరూ పాల్గొని సి పి బ్రౌన్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని పై ప్రకటనలో పేర్కొన్నారు.

## భైంసా నూతన ఎంపీఓ గా జాదవ్ ప్రదీప్ బాధ్యతలు స్వీకారం.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 9 (భారత శక్తి): భైంసా మండల నూతన ఎంపీ ఓ (మండల పరిషత్ అభివృద్ధి అధికారి)గా జాదవ్ ప్రదీప్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.



జాదవ్ ప్రదీప్ గతంలో 2019 సంవత్సరంలో ఖత్గాం గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. ఇటీవల జరిగిన గ్రూప్-2 పరీక్షలో ర్యాంకు సాధించి ఎంపీ ఓగా ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. "గ్రూప్-2లో ర్యాంకు రావడంతో ఈ పదవి రావడం నాకు గర్వకారణం. ఇదే మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన నేను ఇప్పుడు ఎంపీ ఓగా నియమితులవడం విశేషంగా అనిపిస్తోంది," అని జాదవ్ ప్రదీప్ తెలిపారు.మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# ఇతర సంస్థలతో RSS ను పోల్చకండి:ఆరెస్సెస్ సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్ భగవత్




బెంగళూరు, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 9:

ఆరెస్సెస్ శతాబ్ది కార్యక్రమాలలో భాగంగా బెంగళూరులో జరిగిన సభలో ఆరెస్సెస్ సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్ భగవత్, ఆరెస్సెస్ ఆవిర్భావం, ఆలోచన, దిశ, భవిష్య లక్ష్యాల గురించి సమగ్ర వివరించారు.ఇతర సంస్థలతో RSS ను పోల్చకండి

ఆరెస్సెస్‌కి సమానమైన సంస్థ ప్రపంచంలో లేదు. ఇది సొంత ధోరణిలో, సొంత మార్గంలో నడుస్తున్న ఒక అద్భుతమైన సంస్థ.అందుకే బయటివారు దానిని విశ్లేషించే ప్రయత్నం చేస్తే, ఎక్కువసార్లు తప్పుడు నిర్ణయాలకే వస్తారు.

సామాజిక చైతన్యం అత్యవసరం

సమాజంలో నాయకత్వం అవసరం. సామాజిక నాయకులు (సోషల్ లీడర్స్) కావాలి.

భారతదేశం అమెరికా లాంటి దేశాలను అనుకరించడం ద్వారా "విశ్వగురు" అవ్వదు.

మన మూలాలను, మన స్వరూపాన్ని మనవే నిలబెట్టుకోవాలి.

ఆరెస్సెస్ ఎవరికీ వ్యతిరేకంగా పుట్టింది కాదు

సంఘం ఎవరికీ వ్యతిరేకంగా నిర్మాణమైన సంస్థ కాదు. హిందూ సమాజాన్ని సుస్థిరంగా, సంఘటితంగా నిలబెట్టాలనే లక్ష్యంతో రాష్ట్రీయ స్వయంసేవక్ పుట్టింది.

మన బలహీనతలను మనమే గుర్తించాలి

1857 స్వాతంత్ర్య సమరం ఎందుకు విఫలమైందో ఆలోచించాలి.మన జనాభాతో పోలిస్తే బ్రిటిష్ జనాభా చాలా తక్కువ.యుద్ధం మన నేలపైనే జరిగింది, మనం కూడా ఐక్యంగానే పోరాడాం ం అయినా గెలవలేకపోయాం. ఎందుకు?

కాంగ్రెస్ 'సేఫ్టీ వాల్వ్'

1885లో కాంగ్రెస్ స్థాపన జరిగింది.

ఆ సమయానికి విప్లవకారుల ప్రభావం పెరుగుతుండగా, బ్రిటిష్ వారు ప్రజా ఆవేశాన్ని మళ్లించడానికి కాంగ్రెస్‌ను సేఫ్టీ వాల్వ్‌గా సృష్టించారు.

1925కు ముందే సంఘ ఆలోచన పుట్టింది

డాక్టర్ హెడ్గేవార్ స్వాతంత్ర్య సమరంలో ఉన్న నాలుగు ప్రధాన మార్గాలను అనుభవించారు.

చిన్ననాటి నుంచే తల్లిదండ్రులను కోల్పోయిన ఆయన, విప్లవ మార్గం, కాంగ్రెస్ మార్గం, సంస్కృతి పునరుద్ధరణ మార్గం ం ఇవన్నీ పరిశీలించి చివరికి "సంఘ మార్గం" అనే భిన్నమైన దారిగా ఎంచుకున్నారు.

భారతదేశం చరిత్రకంటే ముందే ఉన్నది

ప్రపంచ చరిత్ర మొదలైన నాటికే భారతదేశం తన పూర్ణ కాంతిలో వెలిగేది.

"రాష్ట్రం" అనే భావన అప్పటికే మన దేశంలో స్థిరంగా ఉన్నది.

వ్యక్తిత్వం సరిపోదు, జాతీయతా చైతన్యం కావాలి

మిర్జా జైసింగ్ వ్యక్తిగతంగా ధార్మికుడు.

కానీ ఆయన ఔరంగజేబ్‌కు సహకరించి కాశీ విశ్వనాథ దేవాలయాన్ని ధ్వంసం చేయించాడు.

అందుకే ఆయన జాతీయ స్వభావం లోపభూయిష్టమైనది.

హిందువులు నాలుగు రకాలవారు

హిందువని గర్వంగా చెప్పుకునేవారు.

"నేను హిందువునే కానీ, దానిలో గర్వించేది ఏముంది?" అనేవారు.

ఇంట్లో హిందువులు, బయట వేరేవారిలా నటించేవారు.

తమ వంశం హిందువులేనని మరచిపోయినవారు.

అనుభవమే ముఖ్యం, నమ్మకం కాదు

హిందువుల ధర్మం అనుభవాధారితం.

ఇతరులు మన మాటలు కాకుండా, మన జీవనశైలినే అనుసరిస్తారు.

ధర్మం అంటే మతం కాదు,'ధర్మం' మతం కాదు.

'సంస్కృతి' అనేది 'కల్చర్' కాదు.

'కల్చర్' అంటే కులము లేదా పంథాబీ

'సంస్కృతి' అంటే మన జీవన విధానం.

ప్రతి భారతీయుడు భారతమాతను గౌరవిస్తాడు

తెలుసుకొని అయినా, తెలియకపోయినా ం ప్రతి భారతీయుడు ఈ మాతృభూమిని గౌరవిస్తాడు.

హిందువులు పుట్టినప్పటి నుంచి చావు వరకు ఈ భూమిని పూజిస్తారు.ముస్లింలు, క్రైస్తవులు కూడా తమ అంత్యక్రియల్లో ఈ నేలనే వాడుతారు.

భారతం యొక్క లక్ష్యం - ప్రపంచానికి ధర్మాన్ని ఇవ్వడం

ఇక్కడ 'ధర్మం' అంటే మతం కాదు, ధర్మం అంటే మధ్యమార్గం,ప్రతి వస్తువు యొక్క స్వభావం, కర్తవ్యబద్ధత,నియమశీలత,నిలబెట్టే శక్తి.

ప్రకృతితో సహజీవనం

మనుషులు ప్రకృతిని దోచుకునే శక్తి లేనంత కాలం, వారు ప్రకృతితో ఏకమై జీవించారు.

భారతానికి భౌగోళిక ఆధిక్యం

వేల సంవత్సరాలపాటు భారతదేశం భౌగోళికంగా రక్షితమైనది.అప్పట్లో మనం ధనికులమే, సామర్థ్యం కలిగినవారమే.

కానీ ఇతర దేశాలను జయించాలనే కోరిక రాలేదు.

అదే తర్వాత మన బలహీనతగా మారింది ం బార్బరుల దాడులకు బలయ్యాం.

రాజధర్మానికి ఉదాహరణ - శిబి చక్రవర్తి

శిబి మహారాజు న్యాయం, కరుణ, సత్యనిష్ఠకు ప్రసిద్ధుడు.

ఒకసారి గద్ద (ఇంద్రుడు మారు వేషంలో) దాని వేటలో నుండి తప్పించుకున్న పావురం (అగ్ని మారు వేషంలో) ఒకటి రక్షించమని ఆయనను ఆశ్రయించింది.

ఆ గద్దను సంతృప్తి పరచడానికి శిబి తన తొడ మాంసం కోసి ఇచ్చాడు ం ఇది నిజమైన రాజధర్మానికి ప్రతీక.మోహన్ భగవత్ ప్రసంగం ద్వారా ఆరెస్సెస్ యొక్క 100 ఏళ్ల ప్రయాణం, ఆత్మ, దిశ అన్నీ సజీవంగా ప్రతిబింబించాయి.

"హిందూ సమాజం పూర్తిగా సంఘటితమవ్వాల్సి ఉంది.ఆరెస్సెస్‌కి ఇంకా ఎంతో పని మిగిలి ఉంది!" అని ఆయన చివర్లో అన్నారు.

# జాతీయ కేడెట్ కార్ప్స్ - విజయవాడలో ఐడియా మరియు ఇన్నోవేషన్ పోటీ 2025 నిర్వహణ

### -నవంబర్ 10 నుంచి 16 వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహణ
### -వివిధ ప్రాంతాల నుంచి హాజరుకానున్న 340 మంది కేడెట్లు

విజయవాడ.నవంబర్ 09(భారత శక్తి):

నేషనల్ కేడెట్ కార్ప్స్ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ (సికింద్రాబాద్) డైరెక్టరేట్ ఆధీనంలో, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, విజయవాడలో ఐడియా & ఇన్నోవేషన్ కాంపిటిషన్ 2025 నిర్వహించబడుతుంది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఎన్ సి సి డైరెక్టరేట్లకు చెందిన సుమారు 340 మంది కేడెట్లు ఈ జాతీయ స్థాయి పోటీలో పాల్గొని, "వికసిత్ భారత్ 2047" లక్ష్యానికి అనుగుణంగా తమ సృజనాత్మకత, నూతన ఆలోచనలు, సాంకేతిక ప్రతిభను ప్రదర్శించనున్నారు.

ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, శ్రీ ఎస్, అబ్దుల్ నజీజ్‌బీ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. వీరితో పాటుగా రక్షణ, విద్య, యువజన వ్యవహారాల విభాగాల ఉన్నతాధికారులు పాల్గొంటారు.

నూతన ఆవిష్కరణల ద్వారా యువతకు శక్తివంతమైన వేదిక ఐడియా & ఇన్నోవేషన్ కాంపిటిషన్ యువ కేడెట్లకు సృజనాత్మకతను, సమస్య పరిష్కార నైపుణ్యాలను దేశ నిర్మాణ దిశగా వినియోగించే అవకాశం కల్పిస్తుంది. ఇది ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రతిపాదించిన "ఆత్మనిర్భర్ భారత్" భావనను ప్రతిబింబిస్తుంది.

ఒక వారంపాటు జరిగే ఈ కార్యక్రమంలో పలు వర్క్‌షాపులు, ఆవిష్కరణల ప్రదర్శనలు, ప్రెజెంటేషన్లు ఉంటాయి. కేడెట్లు సాంకేతికత, పర్యావరణం, రక్షణ, లాజిస్టిక్స్, వ్యవస్థాపకత వంటి రంగాల్లో వాస్తవ సమస్యలకు పరిష్కారాలను సూచించే ఆవిష్కరణలను ప్రదర్శిస్తారు.

ప్రతి ఆవిష్కరణను నూతనత, సాంకేతిక విలువ, ఖర్చు తగ్గింపు, ప్రభావ సామర్థ్యం, సృజనాత్మకత వంటి ప్రమాణాలపై పరిశీలిస్తారు.

ఆంధ్రప్రదేశ్‌కు వ్యూహాత్మక ప్రాధాన్యం

ఐసీసి 2025ని విజయవాడలో నిర్వహించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇన్నోవేషన్, విద్య, యువశక్తి అభివృద్ధి రంగాల్లో పెరుగుతున్న ప్రాధాన్యతను ప్రతిబింబిస్తుంది. ఈ కార్యక్రమం రాష్ట్రం యువతలో సాంకేతిక ప్రతిభ, వ్యవస్థాపకత సామర్థ్యాన్ని పెంపొందించడానికి తీసుకున్న నిర్ణయాలను స్ప ష్టంగా చూపిస్తుంది.

జాతీయ మిషన్లకు అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్ వైజ్ఞానిక ఆలోచన, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి దిశగా ముందంజలో నిలుస్తూ, దేశ ఇన్నోవేషన్ ఎకోసిస్టంలో తన స్థానం, పాత్రను బలోపేతం చేస్తోంది.

దేశభక్తి ఉత్సాహానికి ప్రతీక

ఐసీసి 2025 సందర్భంగా వివిధ ప్రాంతాల కేడెట్లు కలిసి పాల్గొనే సాంస్కృతిక కార్యక్రమాలు, పరస్పర సంభాషణ కార్యక్రమాల నిర్వహణ ఉంటుంది. ఇవి దేశంలోని భిన్నత్వంలో ఏకత్వం స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయి.

చివరిగా బహుమతుల ప్రధానోత్సవం, సాంస్కృతిక వేడుకలు, "బరాఖానా"తో ముగుస్తుంది. ఇది ఎన్ సిసి ని సహకార భావన, స్నేహభావం, జాతీయ ఏకతా స్ఫూర్తికి చిహ్నంగా నిలుస్తుంది.

ఈ కార్యక్రమం ద్వారా నూతన ఆలోచనలను గుర్తించి ప్రోత్సహించడమే కాకుండా, కేడెట్లను హద్దులు లేని ఆలోచనలకు, సృజనాత్మక పరిష్కారాలను ప్రోత్సహిస్తుంది. ఇది స్వయం సమృద్ధి, బలమైన భారతదేశం దిశగా మరో అడుగు.

కార్యక్రమ షెడ్యూల్ (10–16 నవంబర్ 2025):

- 10 నవంబర్: కెడేట్ల చేరుకోవడం, డాక్యుమెంటేషన్ & డ్రా ఆఫ్ లాట్స్

-11%-%14 నవంబర్: నిపుణుల వర్క్‌షాపులు & డైరెక్టరేట్ ప్రెజెంటేషన్లు

-15 నవంబర్: తుది ప్రెజెంటేషన్లు, బహుమతుల ప్రదానం & సాంస్కృతిక సాయంత్రం

-16 నవంబర్: కెడేట్లు స్వస్థలాలకు బయలుదేరడం



# సముద్రం నిరంతర శ్రమకు ఒక జీవన ప్రతీక

==================================

(ఎమరాల్డ్ కోస్ట్ ఫ్లోరిడా
(అమెరికా) ప్రపంచంలో అత్యంత
అందమైన బీచ్ లు ఉన్న ప్రదేశాన్ని
సందర్శించిన సందర్భంగా
రాసిన కవిత)

సముద్రం అలలు నిరంతరం
కదులుతూనే ఉంటాయి
ఇవి జీవితంలో మనం
ఎదుర్కొనే కష్టాలకు ప్రతీక
కష్టాలు వస్తె తగ్గకుండా
పోరాడుతూ ముందుకుసాగాలి
అనే సంకేతానికి స్ఫూర్తి నిస్తాయి

పసిడి కిరణాలు సముద్రానికి
పొదిగిన అందం ఇది జీవితంలో
సంతోషకరమైన క్షణాలకు సూచిక

ఎగిసిపడే అలల గంపలలో తీరం
చేరేరహస్యాలు ఎన్నో వుంటాయి
ఎదిగే వయసులో సవాళ్లు సమస్యలు
సంక్షోభాలు కోకొల్లలు

సముద్రం పైకి ప్రశాంతంగా ఉన్నా
దాని లోపల లోతైన ప్రపంచం
లెక్కలేని జీవరాసులు రహస్యాలు
సంపద దాగి ఉండే స్థితి
మనుషుల్ని పై మెరుగులకు
ప్రాధాన్యం ఇవ్వకుండా
అంతర్గత ప్రశాంతత
మనోనిబ్బరత పరిపూర్ణ
జ్ఞానానికి వ్యక్తిత్వానికి
లోతైన ఆలోచన
పెంచుకోవాలని ప్రోత్సహిస్తుంది

సూర్యుడు పడమర వాలగా
పక్షుల కిల కిల రాగాల సవ్వడి
ఆకాశంలో మాయ మౌతుంది
గూటికి చేరేపక్షుల రాగాలతో
సందడిమయమై ఉల్లాస
భరిత సాయంత్రానికి
స్వాగతిస్తుంది

చిరుగాలులు కదిలి వస్తాయి
మత్స్యకారుల ఆశలు మోస్తూ
దిగంతాల దాక సాగే ఆనీరు
ఎన్నో కథలు గాథలు
గుండెల్లో దాచుకుంటుంది

అలల అడుగుల కథ మొదలై
మరొకథ ముగిసిపోతుంది
తీరం మాత్రం శాశ్వతం
సముద్రం ప్రశాంతతనుచాటి
అంతులేని శక్తినితెలియజేస్తుంది
సముద్రం ఆకాశాన్ని మోస్తూ
భూతలం మీద ఒక చేపలాగా
ఈదుతుంది

సముద్రం ఎంత చిలిపిది
ఖండాంతరాలకు విస్తరించి
కొండల నడుము చుట్టూ
చేతులు వేసి ఆకాశాన్నే
తన మేని పసిడి
ముసుగును శిఖరాలు
మీద కప్పి ప్రవహిస్తుంది

సముద్రం కేవలం నీరు కాదు
అలుపు లేని పోరాటం మరియు
నిరంతర శ్రమకుఒక జీవన ప్రతీక

సముద్రం తన ఆనందాన్ని
కెరటాల రూపంలో ప్రదర్శిస్తుంది
సముద్రం అలలు జీవితంలో
సంతోషకరమైన క్షణాలకు
సూచిక
సముద్రం ప్రశాంతతకు
నిదర్శనం ఎన్నోరహస్యాలు
గుసగుసలు మోసుకొస్తుంది
జీవితంలో అంతర్గత శాంతికి
సంకేతం సముద్రం

సముద్రం అలలు భావ
కాలుష్యాన్ని ప్రక్షాళన
చేయాలని సూచిస్తాయి


సముద్రం లాగా మనిషి
ఎదుగుతూ ఉండాలని
లోతుగా ఆలోచించాలని
విశాదృక్పథంతో సమస్యలు
స్వీకరించే మనస్తత్వాన్ని
సముద్రం మనకు నేర్పిస్తుంది

సముద్రం మనకు భయం
గౌరవం ఆత్మనిర్భేతను
నేర్పిస్తుంది
సముద్రం మనిషిజీవితంలో
సొంత బలాన్ని గుర్తించి
వినయం క్రమశిక్షణ కలిగి
ఉండాలనే సంకేతాన్ని ఇస్తుంది

సముద్రం మంచి చెడు
ప్రవాహాలను తమలో
కలుపుకుంటుంది

వివిధ మనస్తత్వాలు
ఉన్న వ్యక్తుల పరిస్థితుల
మధ్య వివక్ష లేకుండా
విశాలత్వంతో
అంగీకరించాలని
సూచిస్తుంది మార్పుకు
అనుగుణంగా మారాలని
సుఖం ధుఃఖాలు వస్తూ
పోతుంటాయి మార్పులకు
అనుకూలంగా మారాలని
సముద్రం మనకు బోధిస్తుంది

నేదునూరి కనకయ్య
ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్‌జి
9440245771



# దివ్యాంగులకు కృత్రిమ అవయవాల దానం

## మాధవ సేవగా భావిస్తూ మానవ సేవ చేయాలి': బి.వి.పి. చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అశ్విని సుబ్బారావు





హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 9:భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ మరియు మణికొండ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కూకట్పల్లిలోని 'బివిపి భవన్' లో వివిధ ప్రాంతాలకు చెందిన పది మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను ప్రధానం చేశారు. చిమ్మపూడి వి.ఎన్. రవికుమార్ తమ తండ్రి స్వర్గీయ చిమ్మపూడి సుబ్రహ్మణ్యం శతజయంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం 30 వేలు అందించిన సహకారంతో తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన పదిమంది దివ్యాంగులకు తమ తల్లి మరియు కుటుంబ సభ్యులతో కలిసి కృత్రిమ అవయవాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అశ్విని సుబ్బారావు అధ్యక్షత వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ ధనానికి ఉన్న దానం, భోగం, నాశనం అను మూడు గతులను, భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను వివరించారు. మనిషిగా పుట్టి సాటి మనుషులను ఆదుకోవడం వారికి సహాయపడటం గొప్ప గుణమని, ఇది సమాజానికి ఎంతో అవసరమని హితవు పలికారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్త, చౌడూరి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు చౌడూరి నరసింహారావు మాట్లాడుతూ.. దానగుణ వైశిష్యాన్ని వివరిస్తూ, మానవ సేవను మాధవసేవగా భావించి దశాబ్దాలుగా ఎంతోమందికి చేయూతనందిస్తున్న గొప్ప దానశీలి, ఉదార గుణశీలుడు మన అశ్విని సుబ్బారావు అని వారి సేవలు కొనియాడారు. 150 ఏళు పూర్తి చేసుకున్న వందేమాతర గీతాన్ని కీర్తిస్తూ తాను రచించిన 'వందేమాతరానికి అక్షరాభిషేకం' గీతాన్ని సభకు వినిపించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులందరికీ కార్యక్రమ సమన్వయకర్త రఘు సతీష్ కుమార్ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మణికొండ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభుజీ, పూర్వ అధ్యక్షుడు రామాంజనేయులు, బివిపి జిజాబాయి అధ్యక్షుడు పెంటారెడ్డి, మల్లేశం, బుజ్జన్న, హుడా కాలనీ అధ్యక్షుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. వందేమాతర గీతాలాపనతో ప్రారంభమైన ఈ కార్యక్రమం చివరగా బివిపి సంపర్క్ ప్రముఖ్ రఘు సతీష్ కుమార్ వందన సమర్పణ చేశారు

# జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన పై అవగాహన కార్యక్రమాలు: జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 9 (భారత శక్తి):జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనపై 10వ తేది నుంచి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ప్రారంభించబోతున్నట్లు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసిడిఎస్ అధికారులు బృందాలుగా ఏర్పడి, జిల్లాలోని వివిధ ప్రాంతాలలో బాల్య వివాహాల అనర్థాలు, నిర్మూలన అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 14వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. అదేవిధంగా 18 వ తేదీన గ్రామాలలో ర్యాలీల ద్వారా అవగాహన కల్పిస్తారని వివరించారు. 20వ తేదీ నుంచి డివిజన్ల వారీగా, వివాహ ఆహ్వాన పత్రికల ప్రింటింగ్ ప్రెస్, డీజే యజమానులు, పూజారులు, పాస్టర్లు, ఖాజీలతో సమావేశాలు నిర్వహిస్తామని అన్నారు. డిసెంబర్ ఒకటవ తేదీ వరకు వివిధ కార్యక్రమాల రూపేనా జిల్లా ప్రజల్లో బాల్యవివాహాల నిర్మూలలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, సంపూర్ణంగా బాల్యవివాహాలను అరికట్టేలా చర్యలు చేపట్టినట్లు అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# యువకులు క్రీడల్లో రాణించాలి: సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

గుమ్మడిదల, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 9 :

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీలోని సిజిఆర్ ట్రస్ట్ కార్యాలయంలో వాలీబాల్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యం, క్రమశిక్షణ, పెరుగుతాయని తెలిపారు. యువత క్రీడలను జీవితంలో భాగంగా చేసుకోవాలని, ట్రస్ట్ తరఫున క్రీడాకారులకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కుంటి మల్లేష్, బాబు యాదవ్, మురళి యాదవ్, అరవింద్ రెడ్డి, ప్రభాకర్ చారి, ఆగం యాదవ్, నవీన్ యాదవ్,క్రీడా అభిమానులు పాల్గొన్నారు.



# గచ్చిబౌలిలో 'అమృత సీనియర్ లివింగ్'ను ప్రారంభించిన నారా భువనేశ్వరి

హైదరాబాద్, నవంబర్ 09 (భారత శక్తి): నగరంలోని గచ్చిబౌలిలో 'అమృత సీనియర్ లివింగ్' పేరుతో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ రిహాబిలిటేషన్ కేంద్రాన్ని ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని శేష్ కొండపల్లి ఏర్పాటు చేశారు. శస్త్ర చికిత్స అనంతరం వృద్ధులకు అవసరమైన సేవలను దీని ద్వారా అందించనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మురళీమోహన్, నందమూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





## పేదవారికి అండగా 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ గాంధీ ఆసుపత్రి వద్ద ఉచిత అన్నదానం!



హైదరాబాద్, నవంబర్ 09 (భారత శక్తి): పేదరికం, ఆకలితో అల్లాడుతున్న వారికి, ఆసుపత్రిలో రోగులకు సహాయకులుగా వచ్చిన వారికి అండగా నిలుస్తూ 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ విశిష్ట సేవలు అందిస్తోంది.ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రి వద్ద ఉచిత అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి వద్దకు వచ్చిన దాదాపు 300 మందికి పైగా పేదలకు, రోగుల సహాయకులకు కడుపునిండా భోజనం అందించారు. ప్రతి ఆదివారం హైదరాబాద్‌లోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద నిరాటంకంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పేదలు ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో ఈ సేవలను కొనసాగిస్తున్నామని ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్ తెలిపారు. ఈ నిరంతర సేవ కార్యక్రమంలో వాలంటీర్లుగా పాల్గొనాలనుకునే వారు లేదా ఈ సేవలకు సహకరించాలనుకునే వారు తమను సంప్రదించవచ్చని 'రెడీ టు సర్వ్' నిర్వాహకులు కోరారు.

## హైడ్రా కాపాడిన పార్కులో వనభోజనాలు

- సత్యనారాయణ వ్రతం నిర్వహించి సంబరాలు చేసుకున్న నివాసితులు
- హైడ్రాకు మద్దతు తెలిపిన కాలనీ వాసులు

హైదరాబాద్, నవంబర్ 09 (భారత శక్తి) ; నిజాంపేట మున్సిపాలిటీ కోశల్యానగర్లోని హైడ్రా కాపాడిన బనియన్ ట్రీ పార్కులో స్థానికులు ఆదివారం వనభోజనాలు చేశారు. కార్తీకమాసం కావడంతో సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. నిజాంపేట మున్సిపాలిటీలో ఇటీవల హైడ్రా రెండు పార్కులను హైడ్రా కాపాడింది. బృందావన్ కాలనీలో 2300 గజాల పార్కును కాపాడగా.. కౌశల్యానగర్ కాలనీలోని 300ల గజాల విస్తీర్ణంలో ఉన్న బనియన్ ట్రీ పార్కును కబ్జాల నుంచి రక్షించింది. కౌశల్యానగర్ కాలనీలోని 300 గజాల పార్కుకు చుట్టూ ఆక్రమణదారులు ప్రహరీ నిర్మించి కాజేశారు. ఎవరూ పార్కులోకి రాకుండా అడ్డుకున్నారు. అలా ఆక్రమణలో వున్న పార్కును కాపాడి కోశల్యానగర్ కాలనీ వాసులకు హైడ్రా అప్పగించింది. అందుకే కాలనీవాసులు బనియన్ ట్రీ పార్కుకు చేరుకుని కార్తీక వనభోజనాలు చేశారు. అదే పార్కులో కాలనీ వాసులు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం చేసారు. దాదాపు వెయ్యి మంది కలసి ఈ ఉత్సవాలను జరుపుకున్నారు. పిల్లలు పెద్దలు హైడ్రా జిందాబాద్..అంటూ హైడ్రా కి హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలియ చేసారు. ప్లకార్డులు ప్రదర్శించి హైడ్రాకు మద్దతు పలికారు. అలాగే బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీలో ఫార్చ్యూన్ మెడోస్ కాలనీలో అడ్డుగోడలు తొలగించి వెనువెంటనే సిమెంట్ రోడ్డు వేసిన హైడ్రాకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. హైడ్రా వచ్చింది దారులు తెరిచిందంటూ కీర్తించారు.










## డబ్బులు ఊరికే రావు.. పెట్టుబడులు పెట్టే ముందు జాగ్రత్త: సీపీ సజ్జనార్



హైదరాబాద్, నవంబర్ 09 (భారత శక్తి): రోజూ రూ.కోట్ల విలువైన సైబర్ నేరాలు జరుగుతున్నాయని హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ అన్నారు. సిటీ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ నియంత్రణపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడుల పేరుతో చాలా యాప్‌ల్లో బాధితులు మోసపోతున్నారని పేర్కొన్నారు. డబ్బులు ఊరికే రావని.. పెట్టుబడులు పెట్టే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏపీకే ఫైల్స్ వల్ల కూడా మోసాలు జరుగుతున్నాయని వివరించారు. సైబర్ నేరాల్లో డబ్బు నష్టపోయిన వెంటనే బాధితులు 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

## యాదగిరిగుట్ట ఆలయానికి పోటెత్తిన భక్తులు

భువనగిరి, నవంబర్ 09 (భారత శక్తి): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పవిత్ర కార్తిక మాసంతో పాటు ఆదివారం సెలవుదినం కావడంతో రద్దీ పెరిగింది. భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి ధర్మ దర్శనానికి 3 గంటలు, ప్రత్యేక దర్శనానికి 2 గంటల సమయం పడుతోంది.








## హెచ్‌సీఏలో సెలక్షన్ల తీరుపై బండి సంజయ్ ఆగ్రహం..

హైదరాబాద్, నవంబర్ 09 (భారత శక్తి): హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్) లో జరుగుతున్న జూనియర్, సీనియర్ సెలక్షన్లపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ''గ్రామీణ స్థాయి క్రికెటర్లకు అవకాశం కల్పించట్లేదని క్రీడాకారుల తల్లిదండ్రులు నన్ను కలిశారు. త్వరలో హెచ్‌సీఏపై చర్యలు ఉండబోతున్నాయి. బీసీసీఐకి కూడా ఫిర్యాదు చేస్తాం. సెలక్షన్ కమిటీలోని కొందరు రూ.లక్షలు తీసుకున్నట్లు తల్లిదండ్రులు చెప్పారు. గతంలో బాగా ఆడేవారిని కూడా ఎంపిక చేయలేదని వారు ఆరోపించారు'' అని బండి సంజయ్ తెలిపారు.



## వారంలో టెట్ నోటిఫికేషన్..!




హైదరాబాద్, నవంబర్ 09 (భారత శక్తి): తెలంగాణలో టెట్ నిర్వహణ కోసం విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసారు. ఇందుకు సంబంధించిన ఫైల్ సీఎంకు చేరినట్టు సమాచారం. ఏటా రెండు సార్లు టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించగా.. ఈ ఏడాది రెండో విడత నోటిఫికేషన్ కోసం అధికారులు ఫైల్ సిద్ధం చేశారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే వారంలో నోటిఫికేషన్ వచ్చే అవకాశముంది అధికారులు చెబుతున్నారు. అయితే టీచర్లూ టెట్ పాసవడం తప్పనిసరని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో వారికి అవకాశం కల్పించేందుకు అర్హత నిబంధనల జీవోను సవరించామని అన్నారు. ఈ క్రమంలో ఈసారి టెట్ కు భారీగా అభ్యర్థులు హాజరయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు.

## ఇన్నాళ్లూ సీఎం రేసులో ఒక్కరే.. ఇప్పుడు ఇద్దరు: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 09 (భారత శక్తి): దగ్గరివాళ్లు చెప్పినా వినే పరిస్థితిలో సీఎం రేవంత్‌రెడ్డి లేరని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు.ప్రశ్నిస్తే పాలన మీరే చేయండంటూ ఎదురుదాడికి దిగుతున్నారని, అలాంటప్పుడు అధికారం నుంచి దిగిపోవాలని అన్నారు. రేవంత్ రెడ్డి కంటే ఎవరైనా బాగానే పాలన చేస్తారని ఎద్దేవా చేశారు. రెండేళ్లలో నిర్మాణ రంగాన్ని ఖతం చేశారని విమర్శించారు. బయటివాళ్లకు అధికారం ఇవ్వాల్సిన అవసరం లేదని, పార్టీలో ఉన్న వ్యక్తులకే ఇవ్వొచ్చని వ్యాఖ్యానించారు. నిన్నటిదాకా భట్టి విక్రమార్క మాత్రమే సీఎం రేసులో ఉండేవారని, ఇప్పుడు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



కూడా పోటీలో ఉన్నారని అన్నారు. ఆదివారం జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. '' సర్పంచ్ ఎన్నికలకు తిరిగినట్లు రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ సందుసందుకు తిరిగారు. ప్రెస్‌క్లబ్ పబ్‌లా కనిపిస్తోందని.. స్టార్ హోటల్‌లో మీట్ ది ప్రెస్ పెట్టారు. రూ.3 వేల కోట్లతో ఉస్మానియా, 100 ఎకరాల్లో హైకోర్టు నిర్మాణం, ఆర్టీసీకి రూ.7వేల కోట్ల లాభం తెచ్చినట్లు చెప్పుకొన్నారు. 20వేల నోటిఫికేషన్లు ఇచ్చి 60 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. అసలు ఒక్క నోటిఫికేషన్ అయినా వచ్చిందా? నిరుద్యోగులు జూబ్లీహిల్స్‌లో నామినేషన్ వేసి కాంగ్రెస్‌ను ఓడించాలని తిరుగుతున్నారు. పీజేఆర్‌ను చంపిందే కాంగ్రెస్ పార్టీ. రాజకీయాల్లో ఆయన కుటుంబానికి స్థానం లేకుండా చేసింది రేవంత్ రెడ్డి. 2004 నుంచి 2014 వరకు స్వర్ణయుగం అన్నారు. మీ జిల్లాలో కూడా ఆకలిచావులు ఉన్నాయి కదా'' అని జగదీశ్‌రెడ్డి అన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక: ముగిసిన ప్రచారం.. ఎల్లుండి పోలింగ్

హైదరాబాద్, నవంబర్ 09 (భారత శక్తి): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడింది. గత కొన్ని రోజులుగా హోరాహోరీగా సాగిన ప్రచార పర్వం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ఎల్లుండి (నవంబరు 11, మంగళవారం) పోలింగ్ జరగనుండగా, ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఉప ఎన్నికలో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీత, కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థిగా దీపక్ రెడ్డి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వీరితో పాటు మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధాన పార్టీల నేతలంతా చివరి రోజు వరకు విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకోసం







ఎన్నికల సంఘం 407 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ముఖ్యంగా 139 సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్లతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. నవంబరు 11న పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం, ఈ నెల 14న ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజు ఫలితాన్ని వెల్లడిస్తారు. దీంతో అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది.

## హైదరాబాద్‌ను వణికిస్తున్న చలి..
## పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నవంబర్ 09 (భారత శక్తి): హైదరాబాద్‌లో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. గత మూడు రోజులుగా రాత్రి సమయాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. దీంతో భాగ్యనగరవాసులు చలికి వణికిపోతున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామున చలిగాలుల ప్రభావం అధికంగా ఉంటోంది. వాతావరణ శాఖ అధికారుల వివరాల ప్రకారం శనివారం నగరంలో 16 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే తక్కువని వారు వెల్లడించారు. రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పూట కూడా మంచు ప్రభావం కనిపిస్తోంది. నగర కేంద్రంతో పోలిస్తే శివారు ప్రాంతాల్లో చలి ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. పటాన్‌చెరులో అత్యల్పంగా 14 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, దుండిగల్‌లో 15 డిగ్రీలు, హయత్‌నగర్‌లో 17, హకీంపేటలో 17.1, రాజేంద్రనగర్‌లో 18 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## అభివృద్ధి కోసం చంద్రబాబు, వైఎస్ విధానాలను ఫాలో అవుతున్నాం : రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 09 (భారత శక్తి): తెలంగాణ అభివృద్ధికి ఉమ్మడి రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రులు చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి అవలంభించిన విధానాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వారి హయాంలో ఐటీ, ఫార్మా రంగాలకు విశేష ప్రాధాన్యం దక్కిందని గుర్తుచేశారు. ఐటీ రంగానికి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి వేసిన పునాది హైదరాబాద్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల నిర్ణయాలు హైదరాబాద్ అభివృద్ధికి బాటలు వేశాయని రేవంత్ రెడ్డి చెప్పారు. నగరం నాలెడ్జ్ సిటీగా మారిందంటే కారణం గతంలో కాంగ్రెస్ సీఎంలు తీసుకున్న నిర్ణయాలేనని అన్నారు. అభివృద్ధిలోనే కాదు.. సంక్షేమంలోనూ కాంగ్రెస్ ముఖ్యమంత్రులు తమ ముద్ర వేశారని వివరించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో వచ్చిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్ కూడా కీలకంగా మారాయన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే అనేక కేంద్ర సంస్థలు హైదరాబాద్ లో ఏర్పాటయ్యాయని చెప్పారు. దేశానికి వచ్చిన వాటిలో 70 శాతం నగరానికే వచ్చాయని, ప్రపంచాన్ని శాసించే చాలా సంస్థలు హైదరాబాద్ లో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం జీసీసీలు, డేటా సెంటర్లకు హైదరాబాద్ హబ్‌గా మారిందని గుర్తుచేశారు. 20042014 మధ్య అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు హైదరాబాద్ అభివృద్ధికి పాటుపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు.

## కోటి దీపోత్సవానికి
## రాష్ట్ర పండుగ హోదా: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 09 (భారత శక్తి): హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో భక్తి టీవీ ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది నుంచి 'రాష్ట్ర పండుగ'గా, అధికారిక ఉత్సవంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కార్తీక మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన తన అర్ధాంగితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కోటి దీపోత్సవాన్ని జాతీయ పండుగగా గుర్తించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని చెప్పారు. కొన్ని రోజుల క్రితం ఇదే వేదికపై కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిస్తే జాతీయ గుర్తింపు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రకటనకు ప్రాధాన్యం సంతరించుకుంది. తన పుట్టిన రోజున, నాలుగు కోట్ల మంది ప్రజలకు వేదికగా నిలుస్తున్న ఇంతటి పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అల్జీపురం మఠం పీఠాధిపతి శ్రీవామనాశ్రమ స్వామి.. ముఖ్యమంత్రి దంపతులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో ఎన్టీవీ అధినేత నరేంద్ర చౌదరి దంపతులు, పలువురు స్వామీజీలు, వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

## 5 రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ బ్యూరో మెగా ఆపరేషన్...

* **ఏపీ సహా పలు రాష్ట్రాల్లో 81 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్**
* **దేశవ్యాప్తంగా 754 కేసుల్లో నిందితులుగా గుర్తింపు**
* **మొత్తం రూ.95 కోట్ల మేర మోసాలకు పాల్పడిన ముఠా**
* **నిందితుల ఖాతాల్లోని కోట్లాది రూపాయలు ఫ్రీజ్**
* **డబ్బును బాధితులకు తిరిగి అందజేస్తామన్న పోలీసులు**



హైదరాబాద్, నవంబర్ 09 (భారత శక్తి): తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన భారీ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి, రూ.95 కోట్ల మేర మోసాలకు పాల్పడిన 81 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసింది. వీరిపై దేశవ్యాప్తంగా 754 కేసులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణ పోలీసుల కథనం ప్రకారం, సైబర్ నేరగాళ్ల కదలికలపై నిఘా పెట్టిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో... ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో మొత్తం 81 మందిని అదుపులోకి తీసుకుంది. అరెస్టయిన వారిలో 17 మంది ఏజెంట్లు, ఏడుగురు మహిళలు, 58 మంది మ్యూల్ ఖాతాదారులు ఉన్నారు. నిందితుల నుంచి 84 సెల్‌ఫోన్లు, 101 సిమ్ కార్డులు, 89 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యుల బ్యాంకు ఖాతాల్లో ఉన్న కోట్లాది రూపాయల నగదును సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఫ్రీజ్ చేశారు. చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఈ మొత్తాన్ని బాధితులకు తిరిగి అందజేయనున్నట్లు వారు వెల్లడించారు. ఈ అరెస్టులతో దేశంలోని అనేక సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడినట్లయిందని అధికారులు తెలిపారు.

## జపాన్ లో భారీ భూకంపం...
## సునామీ హెచ్చరికలు జారీ

జపాన్, నవంబర్ 09: జపాన్‌లో ఆదివారం భారీ భూకంపం సంభవించింది. దేశ ఈశాన్య ప్రాంతంలోని పసిఫిక్ మహాసముద్రంలో రిక్టర్ స్కేలుపై 6.7 తీవ్రతతో భూమి కంపించడంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. ఈ భూకంపం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, బుల్లెట్ రైలు సర్వీసులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 5:03 గంటలకు సంరికు తీరానికి సమీపంలో, సముద్ర గర్భంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించారు. భూకంపం కారణంగా ఇవాతె రాష్ట్ర తీరాన్నిమీటరు ఎత్తు వరకు సునామీ అలలు తాకే ప్రమాదం ఉందని వాతావరణ సంస్థ హెచ్చరించింది. ఒఫునాటోలో 10 సెంటీమీటర్ల ఎత్తున, మియాకోలో ఓ మోస్తరు అలలు తీరాన్ని తాకినట్లు అధికారులు తెలిపారు. భూకంపం కారణంగా తాత్కాలికంగా నిలిపివేసిన తొహోకు షింకన్‌సెన్ బుల్లెట్ రైలు సర్వీసులను కొద్దిసేపటికే పునరుద్ధరించినట్లు ఆపరేటర్ జేఆర్ ఈస్ట్ ప్రకటించింది. ఈ ఘటనపై జపాన్ ప్రధాని సనాయె తకైచి 'ఎక్స్' వేదికగా స్పందించారు. "సునామీ హెచ్చరిక జారీ చేయబడింది, కాబట్టి దయచేసి వెంటనే తీరం నుంచి దూరంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి. ఊహించిన దాని కంటే పెద్ద సునామీ రావచ్చు, కాబట్టి తదుపరి సమాచారం కోసం అప్రమత్తంగా ఉండండి. భూకంపం తర్వాత కూడా ప్రకంపనలు వచ్చే అవకాశం ఉంది" అని ఆమె ప్రజలను హెచ్చరించారు. మియాగి రాష్ట్రంలోని ఒనగావా అణు విద్యుత్ కేంద్రంలో ఎలాంటి నష్టం నమోదు కాలేదని, ప్లాంట్‌కు ఎటువంటి ప్రమాదం లేదని తొహోకు ఎలక్ట్రిక్ పవర్ సంస్థ స్పష్టం చేసింది. అయితే, రానున్న కొద్ది రోజుల్లో ఇదే తీవ్రతతో లేదా అంతకంటే శక్తివంతమైన భూకంపాలు సంభవించే ప్రమాదం ఉందని, సునామీ హెచ్చరికలున్న ప్రాంతాల్లో ప్రజలు సముద్ర తీరానికి వెళ్లవద్దని వాతావరణ సంస్థ అధికారి ఒకరు మీడియా సమావేశంలో సూచించారు.

## పోస్టల్ సేవలు ఇక మరింత సులభం.. వచ్చేసింది 'డాక్ సేవా' యాప్

ఢిల్లీ, నవంబర్ 09 (భారత శక్తి): భారత తపాలా శాఖ తన సేవలను ఆధునికీకరించే దిశగా కీలక ముందడుగు వేసింది. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు మెరుగైన అనుభవాన్ని అందించేందుకు 'డాక్ సేవా' పేరిట సరికొత్త మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించింది. ఇప్పటివరకు వినియోగంలో ఉన్న పాత 'పోస్ట్ ఇన్ఫో' యాప్ స్థానంలో ఈ కొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పోస్టల్ టెక్నాలజీ రూపొందించిన ఈ 'డాక్ సేవా' యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ లేదా ఆపిల్ యాప్ స్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆధునిక సాఫ్ట్‌వేర్, సులభమైన ఇంటర్‌ఫేస్‌తో ఈ యాప్ వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉంటుందని తపాలా శాఖ తెలిపింది. ఈ యాప్ ద్వారా వినియోగదారులు పోస్ట్ ఆఫీసులకు వెళ్లకుండానే తమ పనులను చక్కబెట్టుకోవచ్చు.

**ఒకే యాప్‌లో 8 రకాల సేవలు**

ఈ ఒక్క యాప్‌తో దాదాపు 8 రకాల కీలక సేవలను పొందవచ్చు. స్పీడ్ పోస్ట్, రిజిస్టర్డ్ పోస్ట్, పార్శిళ్లను రియల్ టైమ్‌లో ట్రాక్ చేయడం, సమీపంలోని పోస్ట్ ఆఫీస్ వివరాలు, పనివేళలు తెలుసుకోవడం వంటివి చాలా సులభం. అంతేకాకుండా పంపించాలనుకుంటున్న పార్శిల్ బరువు, గమ్యస్థానాన్ని బట్టి పోస్టేజ్ ఛార్జీలను ముందుగానే లెక్కించుకోవచ్చు. ఇక, ఆర్థిక సేవలు కూడా ఈ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ , రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలను లెక్కించుకోవచ్చు. సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్ వంటి పొదుపు పథకాలపై వచ్చే వడ్డీ వివరాలను కూడా తెలుసుకునే సౌకర్యం కల్పించారు. కార్పొరేట్ కస్టమర్ల కోసం ప్రత్యేక సేవలు కూడా ఇందులో ఉన్నాయి. 'తపాలా శాఖ 2.0' లక్ష్యాల్లో భాగంగా తీసుకొచ్చిన ఈ 'డాక్ సేవా' యాప్.. పోస్టల్ సేవలను డిజిటల్ యుగంలోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్న 'డిజిటల్ ఇండియా' లక్ష్యానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక... అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్: ఆర్వీ కర్ణన్

హైదరాబాద్, నవంబర్ 09 (భారత శక్తి): : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు. నేటితో ఎన్నికల ప్రచార గడువు ముగిసిన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నట్లు తెలిపారు. ''మొత్తం 4 బ్యాలెట్ యూనిట్లు ఉంటాయి. సోమవారం కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తాం. నియోజకవర్గంలో మొత్తం 407 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ ఉంటుంది. ఈ



సారి కొత్తగా డ్రోన్ల ద్వారా నిఘా ఉంటుంది'' అని ఆర్వీ కర్ణన్ తెలిపారు.

## అమెరికాలో కొనసాగుతున్న సంక్షోభం..
## రెండో రోజూ 1,000కి పైగా విమానాలు రద్దు

అమెరికా, నవంబర్ 09: అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ ప్రభావం విమానయాన రంగంపై తీవ్రంగా పడింది. ఎయిర్ ట్రాఫిక్‌ను తగ్గించాలన్న ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (FAA) ఆదేశాలతో విమానయాన సంస్థలు వరుసగా రెండో రోజైన శనివారం కూడా 1,000కి పైగా విమానాలను రద్దు చేశాయి. దీంతో దేశంలోని ప్రధాన విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఫ్లైట్ అవేర్ వెబ్‌సైట్ ప్రకారం నిన్న మధ్యాహ్నానికే 1,000కి పైగా విమానాలు రద్దయ్యాయి. ముఖ్యంగా నార్త్ కరోలినాలోని షార్లెట్ విమానాశ్రయంలో అత్యధికంగా 130 విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. అట్లాంటా, చికాగో, డెన్వర్, నెవార్క్ వంటి ఇతర ప్రధాన ఎయిర్‌పోర్టులలో కూడా ఇదే పరిస్థితి కనిపించింది. న్యూయార్క్ నగర పరిసరాల్లోని విమానాశ్రయాల్లో సిబ్బంది కొరత కారణంగా విమానాలు ఆలస్యంగా నడిచాయి. షట్‌డౌన్ కొనసాగితే రానున్న రోజుల్లో రద్దయ్యే విమానాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం 40 విమానాశ్రయాల్లో 4 శాతం విమానాలను తగ్గించామని, మంగళవారం నుంచి ఈ సంఖ్యను మరింత పెంచి, శుక్రవారం నాటికి 10 శాతానికి చేర్చుతామని ఎఫ్ఏఏ తెలిపింది. షట్‌డౌన్ కొనసాగి, మరింత మంది ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు విధులకు దూరమైతే మరిన్ని కోతలు విధించాల్సి వస్తుందని రవాణా శాఖ కార్యదర్శి సీన్ డఫీ హెచ్చరించారు.

**ఎందుకీ పరిస్థితి?**

ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా దాదాపు నెల రోజులుగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు జీతాలు అందడం లేదు. దీంతో చాలామంది అనారోగ్య కారణాలు చూపి విధులకు గైర్హాజరవుతున్నారు. ఇప్పటికే ఉన్న సిబ్బంది కొరతకు ఇది తోడవడంతో విమానాల నిర్వహణ కష్టంగా మారింది. జీతాలు లేకుండానే వారానికి ఆరు రోజులు తప్పనిసరిగా ఓవర్ టైమ్ చేయాల్సి వస్తోందని, కొందరు తమ కుటుంబ ఖర్చుల కోసం రెండో ఉద్యోగం కూడా చేసుకుంటున్నారని నేషనల్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్ అసోసియేషన్ తెలిపింది.

**ప్రయాణికుల ఆవేదన**

ఈ ఆకస్మిక పరిణామాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. "మనమందరం ప్రయాణాలు చేస్తాం. అందరికీ ఎక్కడికో ఒకచోటికి వెళ్లాల్సిన అవసరం ఉంటుంది. ప్రభుత్వం ఈ సమస్యను త్వరగా పరిష్కరిస్తుందని ఆశిస్తున్నాను" అని మియామి నుంచి డొమినికన్ రిపబ్లిక్‌కు వెళుతున్న ఎమ్మా హోల్గిన్ అనే ప్రయాణికురాలు తన ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రయాణం చేయడమే ఒత్తిడితో కూడుకున్నది. దానికి తోడు ఇలాంటి అంతరాయాలు ఏర్పడితే పరిస్థితి మరింత సవాలుగా మారుతుంది" అని ప్యూర్టోరికోకు వెళుతున్న హీథర్ జు అనే మరో ప్రయాణికురాలు అన్నారు. విమానాల రద్దు ఇలాగే కొనసాగితే థ్యాంక్స్ గివింగ్ వారం నాటికి పరిస్థితి మరింత దిగజారి, పర్యాటకం, హాలిడే షిప్పింగ్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# ఒక సంకల్పం నుంచి సంక్షోభం వరకు..

**ఒక అద్భుతమైన సంకల్పంతో అప్పటి కెసిఆర్ ప్రభుత్వం నిరుపేదలకు ఒక గూడును అందించాలనే మంచి ఉద్దేశంతో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకాన్ని తీసుకొని వచ్చింది.. తీసుకుని రావటమే కాకుండా త్వరితగతిన నిర్మాణాలను చేపట్టింది.. నిర్మాణాలు పూర్తయ్యాక కొంతమంది లబ్ధిదారులకు కేటాయించడం కూడా జరిగింది.. కానీ ఎన్నో వందల ఇండ్లు ఇంకా పంపిణీ కాకుండా అలాగే ఉండిపోయాయి.. మరి ఎందుకు ఆ ఇండ్లను కేటాయించలేదు ఇప్పటివరకు తెలియని పరిస్థితి నెలకొంది.. ఇదే విషయమై అప్పటి ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వ్యవహారంపై విమర్శలు గుప్పించింది.. కానీ దురదృష్టం ఏమిటంటే ఇప్పుడు రేవంత్ రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలో ఉంది అప్పడు విమర్శలు గుర్తించిన రేవంత్ రెడ్డి కూడా డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో కేసీఆర్ కంటే మూర్ఖంగా వ్యవహరిస్తున్నాడని విమర్శకులు మండిపడుతున్నారు.. కొన్ని వందల ఇండ్లు ఎందుకు పనికిరాకుండా అలాగే ఉండిపోయాయి.. ఆ ఇండ్లను పేదలకు ఎందుకు పంచడం లేదు.. కెసిఆర్ ప్రభుత్వంలో నిర్మించిన ఇండ్లను పాము ఎందుకు పంపిణీ చేయాలి అని రేవంత్ ప్రభుత్వం ఆలోచిస్తుందా..? క్రెడిట్ అంతా కేసీఆర్ ఖాతాలోకి వెళ్తుందని భావిస్తున్నారా..? ఇది ఎంత మాత్రం వాంఛనీయం కాదు.. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే హక్కు ఈ ప్రభుత్వాలకు ఎవరు కల్పించారు..? మీ ఈగోలను పక్కనపెట్టి ఒక్కసారి ప్రజల గురించి ఆలోచించమని సూచిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "**



- **నీరుగారిపోయిన డబల్ బెడ్ రూమ్ పథకం..**
- **వందల కోట్ల ప్రజాధనం వృధాగా మిగిలిపోయిన దౌర్భాగ్యం..**
- **గత ప్రభుత్వంలో ఎందుకు పనికిరాని చోట నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లు..**
- **కట్టినవి కట్టినట్టుగానే ఉండిపోయాయి లబ్ధిదారులకు అందలేదు..**
- **ఇప్పుడు పాడుబడిపోయి కనిపిస్తూ ఉన్నాయి..**
- **నివాసానికి పనికి రాకుండా వెలవెలబోతున్నాయి..**
- **అసలు ఎందుకు నిర్మించిన ఇండ్లను నిరుపేదలకు అందించలేకపోయారు..?**
- **కొన్నిచోట్ల లబ్ధిదారులకు అందించిన ఆ నిర్మాణాలు నాసిరకంగా ఉన్నాయి..**
- **నిరుపేదలను పక్కనపెట్టి కేవలం పార్టీ కార్యకర్తలకే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించిన వైనం..**
- **కెసిఆర్ ప్రభుత్వం చేసిన తప్పనే ఇప్పుడు రేవంత్ సర్కార్ కూడా చేస్తోంది..**
- **పూర్తయిన ఇండ్లను త్వరితగతిన లబ్ధిదారులకు నిరుపేదలకు అందిస్తే ఎంతో మేలు జరుగుతుంది..**
- **కెసిఆర్ ప్రభుత్వం తప్పు చేసింది మరి ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం ఏమి చేస్తోంది..?**
- **ఆ ప్రభుత్వం కట్టిన ఇండ్లను మేమెందుకు కేటాయించాలి అన్న భావన నెలకొంది..**
- **స్వార్ధ ప్రయోజనాల కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం చట్టరీత్యా నేరం అవుతుంది..**
- **ఇప్పటికైనా పూర్తయి ఖాళీగా ఉండిపోయిన ఇండ్లను నిరుపేదలకు పంచాలని డిమాండ్ చేస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..**

**(స్పెషల్ కరస్పాండెంట్)**
**హైదరాబాద్, నవంబర్ 09 (భారత శక్తి) :**

2015లో అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు ప్రకటించిన ప్రధాన ప్రజా సంక్షేమ పథకాలలో ఒకటి "డబుల్ బెడ్ రూమ్ హౌసింగ్ స్కీమ్".

**ఈ స్కీం ఉద్దేశం చాలా గొప్పగా ఉంది...**

"గరీబు ప్రజలకు గౌరవప్రదమైన జీవనం కల్పించడం, ప్రతి పేద కుటుంబానికి రెండు బెడ్రూములు, హాల్, కిచెన్, అటాచ్ బాత్రూమ్‌తో కూడిన ఇల్లు ఉచితంగా ఇవ్వడం."

ప్రతి ఇల్లు సుమారు 560 నుంచి 600 చదరపు అడుగులలో ఉండేలా ప్రణాళిక వేసి, ప్రభుత్వ నిధులతోనే నిర్మాణం చేపట్టబడింది. లబ్ధిదారుల నుండి ఒక్క రూపాయైనా తీసుకోకూడదనే నిర్ణయం ఆ సమయంలో ప్రశంసలు పొందింది.

మొదట ఈ పథకం "పేదల కలల ఇల్లు"గా మారింది. హైదరాబాద్, రామగుండం, వరంగల్, మానేరు డ్యాం పరిసరాల్లో మొదటి దశలో కొంతమంది లబ్ధిదారులకు గృహాలు లభించాయి.

కేసీఆర్ ప్రభుత్వ ప్రకారం, మొత్తం రాష్ట్రంలో 2.75 లక్షల ఇళ్లు నిర్మించాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు.

*** వాస్తవానికి ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయి..?**

**నిర్మాణంలో ఆలస్యం :**

* అనేక జిల్లాల్లో కాంట్రాక్టర్లకు చెల్లింపులు లభించకపోవడం వల్ల నిర్మాణం ఆగిపోయింది. కొన్ని ప్రాజెక్టులు 4-6 సంవత్సరాలుగా అర్ధంతరంగా నిలిచిపోయాయి.
* అనేక ఇళ్లు సిమెంట్ షెల్స్ లాగానే నిలిచిపోయాయి.
* పక్కా రోడ్లు, కాలువలు, తాగునీరు, విద్యుత్ కనెక్షన్లు లేని చోట్లే ఇళ్లు నిర్మించబడ్డాయి.
* లబ్ధిదారుల ఎంపికలో అవినీతి :
* ఇక్కడే పథకం యొక్క స్ఫూర్తి దెబ్బతిన్నది.
* చాలా ప్రాంతాల్లో స్థానిక నేతలు, కార్పొరేటర్లు, అధికారుల మధ్య దోపిడీతో కూడిన ఒప్పందాలు జరిగాయి..
* వాస్తవ పేదల పేర్లు తొలగించి, సంబంధిత నేతల బంధువులు, పార్టీ కార్యకర్తలు లబ్ధిదారుల పేర్లు జాబితాలో చేరినట్లు ఫిర్యాదులు వచ్చాయి.
* పేదలు లబ్ధిదారులుగా ఎంపిక కావాలంటే మధ్యవర్తులకు లంచాలు ఇవ్వాల్సి వచ్చింది అనే ఆరోపణలు బలంగా వినిపించాయి.

*** కాంట్రాక్టర్ల అవినీతి, నాణ్యత సమస్యలు :**

ప్రమాదకరంగా తయారైన ఇళ్లు, తక్కువ నాణ్యత సిమెంట్, ఇనుప వాడకం లేకపోవడం వంటివి చోటు చేసుకున్నాయి. కొన్ని చోట్ల వర్షాలతో గోడలు కూలిపోవడం..ఇళ్లలో తడి, బీటలు పడడం.. ఇలాంటి ఘటనలు పేద ప్రజలను తిరిగి అసురక్షిత స్థితిలోకి నెట్టివేశాయని చెప్పవచ్చు..

*** నిధుల లోటు, రాజకీయ ప్రాధాన్యం పెరగడం..:**

ప్రతీ ఎన్నికల ముందు పథకం ప్రచారం బాగా జరిగేది కానీ, వాస్తవానికి నిధులు మాత్రం విడుదల కాలేదు. కేంద్ర నిధులు సరిగ్గా ఉపయోగించకపోవడం, రాష్ట్ర నిధుల కొరత తీవ్రంగా ఉండేది..

ప్రతిష్టాత్మకమైన పథకాన్ని రాజకీయ ప్రచార సాధనంగా మార్చడం వల్ల ప్రాజెక్ట్ నిర్వీర్యమైంది.

*** లబ్ధిదారుల వ్యథలు :**

* "ఏడేళ్లుగా మా పేరు లిస్ట్‌లో ఉందంటున్నారు, ఇల్లు మాత్రం కనిపించదు."
* "ఇల్లు పూర్తయింది కానీ తాళాలు ఇవ్వలేదు, అధికారుల వద్ద తిరుగుతున్నాం."
* "మధ్యవర్తికి ఐదు వేలిచ్చినా కూడా పేరు జాబితాలో లేదు."
* ఇలాంటి వేలాది ఫిర్యాదులు గ్రామీణ స్థాయిలో, జిహెచ్ఎంసి పరిధిలో, మున్సిపల్ కార్యాలయాల్లో నమోదు అయ్యాయి.
* ప్రజాధనం దోపిడీ జరిగిందనే ఆరోపణలు:
* ఒక ఇల్లు సగటుగా రూ. 5.5 లక్షలు వ్యయం అంచనా.
* అయితే చాలా చోట్ల చెల్లించిన మొత్తానికి సరిపడే పనులు జరగలేదు.
* కాంట్రాక్టర్లు, అధికారులు, స్థానిక రాజకీయ నేతల మధ్య కిక్‌బ్యాక్ లావాదేవీలు జరిగాయని విస్తృత ఆరోపణలు వచ్చాయి.
* కాగ్ నివేదికల్లో కూడా పూర్తి పారదర్శకత లోపం ఉన్నట్టు ప్రస్తావనలు వచ్చాయి.

**పథకం నిర్వీర్యం :**

* 2015లో ప్రారంభమైన ఈ పథకం, 2023-24 నాటికి పూర్తిస్థాయిలో అమలుకాకపోవడం స్పష్టంగా ప్రజల్లో నిరాశను కలిగించింది.
* కొన్ని జిల్లాల్లో మాత్రం పథకం పూర్తయి ప్రజలు నివసిస్తున్నారు కానీ, మొత్తంగా చూసినప్పుడు ఈ పథకం ప్రభుత్వం వాగ్దానం చేసినంత గొప్పగా ఏమీ లేదని తెలిసిపోతుంది..



*** సామాజిక, రాజకీయ విశ్లేషణ :**

* కేసీఆర్ ఈ పథకాన్ని తెలంగాణ మోడల్"గా ప్రదర్శించాలనుకున్నారు.
* కానీ పర్యవేక్షణలో వైఫల్యం, పారదర్శకత లోపం, ప్రాంతాల మధ్య అసమాన పంపిణీ కారణంగా ఫలితం కోల్పోయింది.
* ఈ పథకం ద్వారా పేదల విశ్వాసం గెలుచుకోవాలని టిఆర్ఎస్ పార్టీ అంటే ఇప్పటి బి ఆర్ ఎస్ పార్టీ ఎంతగానో ఆశించింది.. కానీ, చివరికి అసంతృప్తి మాత్రమే మిగిలింది...

*** ప్రస్తుత పరిస్థితి (2024–2025) :**

రేవంత్ రెడ్డి నేతృత్వంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకంపై సమీక్ష ప్రారంభించింది. కొన్ని చోట్ల నిర్మాణం నిలిచిన ఇళ్లు పూర్తిచేసే పనులు చేపట్టినప్పటికీ, అవినీతి దర్యాప్తులపై చర్యలు ఇంకా పూర్తి స్థాయిలో మొదలుకాలేదు. కెసిఆర్ ప్రభుత్వానికి అలాగే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పెద్దగా తేడా ఏమీ కనిపించడం లేదని రాజకీయ విశ్లేషకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు..

*** చివరగా చెప్పుకోవాల్సింది ఏమిటంటే...**

* డబుల్ బెడ్‌రూమ్ పథకం ఒక గొప్ప ఆలోచన, కానీ దాన్ని అమలు చేసిన విధానం దాని నమ్మకాన్ని దెబ్బతీసింది.
* ప్రజల ఆశలు, ప్రభుత్వ నిర్లక్ష్యం, అవినీతి కలగలిపి ఈ పథకాన్ని "సంక్షేమం" కన్నా "సంక్షోభం"గా మార్చాయి.
* ప్రజాధనం వృథా కాకుండా, నిజమైన లబ్ధిదారులకే గృహాలు అందేలా మార్పులు రావడం అవసరం. అని ప్రభుత్వానికి సూచిస్తోంది సీ ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..

# టీఆర్పి సింబల్ పై అభ్యంతరం రిటర్నింగ్ అధికారి వివక్ష

**యాధీశ్వర్, చెన్నోజు శ్రీనివాసులు,**

హైదరాబాద్, నవంబర్ 09 (భారత శక్తి):

1) ప్రధాన పార్టీలకు ఒక న్యాయం. సామాన్యుల పార్టీలకు మరో న్యాయం.
2) ఈసీఐ కలగజేసుకొని ఈవీఎం బ్యాలెట్ పై సింబల్ సరిదిద్దాలి.
3) ప్రధాన పార్టీల గెలుపు కోసం విధులు నిర్వహిస్తున్నట్లు ఉంది.
4). కుట్రపూరిత అధికార దుర్వినియోగమే
5) ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందే
6) ఫిర్యాదు చేసిన తప్పు సరిదిద్దని రిటర్నింగ్ అధికారి, సీ.ఈ.వో
7) ఓటర్లు సింబల్ గుర్తించడంలో అయోమయానికి గురవుతారు.

*** సింబల్ సరిదిద్దని యెడల హైకోర్టును ఆశ్రయిస్తాం. అభ్యర్థి యధీశ్వర్ నక్క.**

ఈరోజు బషీర్బాగ్ ప్రెస్క్లబ్లో తెలంగాణ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షులు నక్క యదీశ్వర్ , సెక్రటరీ చెన్నోజు శ్రీనివాసులు తో కలిసి పత్రిక సమావేశ ఏర్పాటు చేశారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తెలంగాణ రిపబ్లిక్ పార్టీ (టిఆర్పి)నుండి నక్క యదీశ్వర్ బరిలో ఉన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రిపబ్లిక్ పార్టీకి అధికారికంగా మైకు గుర్తు కేటాయించింది. సింబల్ యధావిధిగా ముద్రించకుండా భిన్నంగా ఈవీఎం బ్యాలెట్ పేపర్ పై ముద్రించారు. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ గుర్తులు స్పష్టంగా ముద్రించి మిగతా సింబల్స్ బ్యాలెట్ పేపర్ పై అస్పష్టంగా ముద్రించి ఓటర్స్ అయోమయానికి గురై సింబల్ గుర్తించక నష్టపోయే అవకాశం ఉందని కుట్రపూరిత ఇది అధికార దుర్వినియోగమే . ప్రధాన పార్టీల గెలుపు కోసం కృషి చేస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి పనితీరు ఉందన్నారు. ఈవీఎం బ్యాలెట్ సింబల్స్ స్పష్టత లేకుండా ఉన్న తన మైకు గుర్తును సూక్ష్మ పరిశీలన చేసుకున్న అభ్యర్థి యదీశ్వర్ .నక్క ఈనెల మూడవ తారీఖున అభ్యంతరం వ్యక్తం చేస్తూ రిటర్నింగ్ అధికారికి, మరియు చీఫ్ ఎలక్షన్ కమిషన్ తెలంగాణ గారికి ఫిర్యాదు చేశారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ఉల్లంఘించి ఈ.సీ.ఐ కి వ్యతిరేకంగా రిటర్నింగ్ అధికారి వ్యవహరించి ఈవీఎం బ్యాలెట్ పేపర్లో నిర్లక్ష్యం వహించారని సింబల్ గుర్తించడంలో తీవ్ర ప్రభావం చూపుతుందని నా యొక్క గెలుపు పై ప్రభావం పడుతుందని రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లిన ఏమి చేయలేననీ చేతులెత్తేశారని ఆవేదన వ్యక్తం చేశారు ఎలక్షన్ కమిషన్ ఆర్డర్ పాటించని జూబ్లీహిల్స్ రిటర్నింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియాను కోరారు. అధికారులు ఈవీఎం, బ్యాలెట్ పై సింబల్ సరి చేయకపోతే ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నామని తెలియజేశారు. ఈ సీఐ నోటిఫై చేసిన విధంగా సింబల్ ముద్రించిన తర్వాతే ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రిపబ్లికల్ పార్టీ సెక్రెటరీ చెన్నోజు శ్రీనివాసులు, జెట్టమోని యోగేష్ యాదవ్, రాజేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.